ఈనాడు
వికారాబాద్

మంగళవారం 2 జనవరి 2018 16 పేజీలు



నూతన సంవత్సరం నేపథ్యంలో అనంతగిరిలో భక్తుల సందడి

- ఆదర్శంగా కొత్త ఏడాది వేడుకలు
- 50 పోలీసు బృందాల పహారాతో ఫలితం

సంబరం... అంతటా ప్రశాంతం

ఈనాడు డిజిటల్, వికారాబాద్

కొత్త సంవత్సరం వేడుకలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. నిశిరాత్రి వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ముందస్తు ప్రణాళికలు తయారు చేసి పక్కాగా అమలు చేసి, ఫలితం సాధించారు. ప్రత్యేక బృందాలకుతోడు బీట్ అధికారులు సైతం తమ విధులను విజయవంతంగా నిర్వహించడంపై ప్రజలు, పోలీసు ఉన్నతాదికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు వేడుకల్లో యువత, చిన్నాపెద్ద తేడా లేకుండా అంతా అర్ధరాత్రి 12 గంటలకు కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సోమవారం ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. ఇవీ వివరాలు...

జిల్లాలో నాలుగు డివిజన్ల పరిధిలో మొత్తం 21 ఠాణాలు ఉన్నాయి. నూతన సంవత్సర వేడుకలను సాఫీగా కొనసాగేందుకు ముందస్తుగా డీఎస్పీల ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా వికారాబాద్‌తోపాటు తాండూరు పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక విధులు నిర్వర్తించేందుకు మొత్తం 50 బృందాలను ఏర్పాటు చేశారు. వీటిని పెట్రోలింగ్, పికెటింగ్, పరిశీలన బృందాలుగా విడదీశారు. ఇందులో మొత్తం 350 మంది సిబ్బందిని కేటాయించారు. ఒక్కో బృందానికి ఒక్కో ప్రధాన కూడలి బాధ్యతలు అప్పగించారు. మిగిలిన సిబ్బందికి తమ రోజువారీ విధులతోపాటు అణుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. వేడుకలను జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయం నుంచి డిసెంబరు 31 అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పర్యవేక్షించారు. వికారాబాద్‌లోని ఎన్టీఆర్, ఎమ్మార్పీ, బీజేఆర్, ఆర్టీసీ బస్టాండ్ కూడళ్లతో పాటు, తాండూరులో ప్రధాన కూడళ్లు, పరిగి, కొడంగల్ లలో జాతీయ రహదారులపైనా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు ఇతర అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నూతన సంవత్సర వేడుకలు అర్ధరాత్రి దాటినా యువత ఉత్సాహంగా జరుపుకున్నారు. రాత్రి ఒంటి గంట దాటిన తర్వాత కూడా యువత హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. వీధుల్లో ద్విచక్ర వాహనాలపై తిరగడం కనిపించింది. అయితే... మద్యం తాగి వాహనాలు నడిపించడం, ఒక బైక్‌పై ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది ప్రయాణించడం, అతి వేగంగా వెళ్లడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం మిగతా 7 లో...



తాండూరు అనాథ ఆశ్రమంలో పిల్లలతో కలిసి కేక్ కోస్తున్న పోలీసులు

- జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా వివిధ యూనిట్లకు లబ్ధిదారులను ఎంపికచేశారు. పరిమిత సంఖ్యలో యూనిట్ల మంజూరు వల్ల ప్రయోజనం లేదని, వీటి సంఖ్యను పెంచాలని పలువురు మూడు నెలల క్రితం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీని ఇచ్చారు. ఆ తరవాత దీనిపై పురోగతి ఏమిటి. ఏమైనా ప్రయోజనం కలిగిందా? అన్నది అర్జీదారులకు తెలియలేదు.



ప్రజావాణిలో సమస్యను వివరిస్తున్న మహిళ (పాతచిత్రం)

ఆన్‌లైన్‌లో అర్జీలు!

- సమస్యలకు సెలవు
- సత్వర పరిష్కారానికి వీలు
- అమలుకు ప్రయత్నాలు

న్యూస్‌టుడే, కుల్కచర్ల

- కుల్కచర్ల మండలంలో ఓ పంచాయతీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిపై సమగ్ర విచారణ చేయించాలంటూ మండలానికి చెందిన పలువురు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో రెండు మార్లు అర్జీలను ఇచ్చారు. అప్పటికప్పుడు స్పందించిన పాలనాధికారి అక్కడే ఉన్న సంబంధిత అధికారికి తగిన ఆదేశాలు ఇచ్చారు. ఇచ్చిన అర్జీపై పురోగతి ఎంత వరకు వచ్చింది? ఏమైనా చర్యలు తీసుకున్నారా? అన్న వాటిపై నెలలు గడస్తున్నా అర్జీదారులకు ఎవరూ సమాధానం ఇవ్వడంలేదు.
- పారిశుద్ధ్య నిర్వహణ పరిస్థితి మా గ్రామంలో అధ్వానంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ చర్యలు తీసుకోవడం లేదు. తద్వారా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పరిగి నుంచి ప్రజావాణికి అర్జీ ఇచ్చారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? మిగతా 7 లో...

మరింత ప్రయోజనం కలుగుతుంది



– కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ, కుల్కచర్ల

అర్జీలకు ఆన్‌లైన్ పరిష్కారం అమలు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఇచ్చిన వినతి ఏ దశలో ఉంది? ఎప్పటిలోగా పరిష్కారాన్ని చూపుతారు? అన్న సమగ్ర వివరాలు తెలుస్తాయి. అధికారులు మరింత బాధ్యతతో ముందుకు వెళ్లడం తప్పనిసరి అవుతుంది.

అనుమతిస్తే అక్రమం... నిలిపేస్తే గగ్గోలు

- పాతతాండూరుకు చెందిన ఓ వ్యక్తి కాగ్నా నుంచి ఇసుక తరలించేందుకు ఇటీవల అనుమతి పత్రాలు పొందారు. ట్రాక్టర్‌పై ఒక విడత(ట్రిప్) మాత్రమే తరలించాల్సి ఉండగా ఒకేపత్రం ఆధారంగా మూడుసార్లు తీసుకెళ్లారు. అదనంగా తరలించిన ఇసుకను మార్గమధ్యంలో ఇతరులకు విక్రయించారు.
- మరొకరికి మధ్యాహ్నం రెండు గంటలలోపు ఇసుక తరలించేందుకు అధికారులు అనుమతి పత్రాన్ని ఇచ్చారు. సాయంత్రం 4.45 గంటలకు తీసుకెళుతుండగా గమనించిన కానిస్టేబుల్ ఒకరు వాహనాన్ని ఆపారు. ఈ సమయంలో ఎందుకు తీసుకెళుతున్నారంటూ ఆరా తీయగా చక్రాలు దిగబడ్డాయంటూ సాకు చెప్పే ప్రయత్నం చేశారు. దాంతో ఇసుకను ఆర్డీఓ కార్యాలయం పైఅంతస్తులో నిర్మాణానికి చేరవేశారు.
- కోకట్ పరిధిలోని కాగ్నా నది నుంచి గత శుక్రవారం అక్రమంగా ఇసుకను మిత్రానగర్‌లోకి తరలిస్తున్నారు. గుర్తించిన పోలీసులు వెంబడించగా అక్రమార్కులు ట్రాక్టర్‌ను వదిలేసి పరారయ్యారు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

తాండూరు ప్రాంతంలో అనుమతుల ముసుగులో ఇసుక అక్రమ రవాణాకు తెర లేపుతున్నారు. అనుమతులకు నిరాకరిస్తే అభివృద్ధి పనులు ఆగిపోయాయంటూ గగ్గోలు పెడతారు. తీరా ఇసుక తరలించేందుకు సరేనంటే అక్రమ రవాణాకు పాల్పడుతూ వ్యాపారంలా మార్చేస్తున్నారు. ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా వివిధ అభివృద్ధి పనులకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. వాటితో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ఇసుకను పాతతాండూరు, ఖాంజాపూర్‌ల సమీపంలోని కాగ్నా నది నుంచి సరఫరా చేస్తోంది. రెండు పడక గదుల ఇళ్లకు మినహా అన్నింటికీ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1,800 చెల్లించాలని గనులు, రెవెన్యూ శాఖల యంత్రాంగం ఖరారు చేసింది. ఇసుక తరలించేందుకు అనుమతులు ఇస్తే కొందరు దుర్వినియోగం చేస్తూ పత్రాల్లో పేర్కొన్నదానికంటే అధికంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా పాతతాండూరు కాగ్నా నది నుంచి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోంది. రెవెన్యూ ఉద్యోగులంతా ఇటీవలి వరకు గ్రామాల్లో భూదస్త్రాల నవీకరణ కార్యక్రమం నిర్వహించడానికి గ్రామాల బాట పట్టడం, ప్రస్తుతం ఆయా పత్రాలను సరిచేయడంలో తలమునకలై ఉండటంతో ఇసుక తరలింపు తీరును పర్యవేక్షించేందుకు ఒక్క వీఆర్ఓను మాత్రమే నియమించారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు అనుమతిపత్రాలకు మించి తరలిస్తూ ప్రైవేటు పనుల వద్ద కుమ్మరిస్తున్నారు. సిబ్బంది లేమి కారణంగా మార్గమధ్యంలోనూ తనిఖీలు లేకుండాపోయాయి. కొన్నిచోట్ల అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తున్న స్థానికులు సమాచారం ఇస్తుండగా అప్రమత్తం అవుతున్న పోలీసులు నిఘాపెడుతున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు చాకచక్యంగా జారుకుంటున్నారు. రెండు రోజుల క్రితం రాత్రివేళ అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తుండగా పోలీసులు గుర్తించి ట్రాక్టర్‌ను పట్టణ పోలీస్ ఠాణాకు తరలించారు. ట్రాక్టర్ పాతతాండూరుకు చెందిన వ్యక్తిదిగా తేల్చారు. వారం క్రితం తాండూరు మండలం సిరిగిరిపేటలో అభివృద్ధి పనులకు తరలించాల్సిన ఇసుకను చోదకుడు పట్టణంలో విక్రయిస్తుండగా గమనించిన పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని చోదకుడు, యాజమానిపై కేసు నమోదు చేశారు. కాగ్నా నది వద్ద సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత వీఆర్ఓను అయిదు రోజుల క్రితం కార్యాలయానికి పిలిపించిన ఆర్డీఓ వేణుమాధవ రావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మందలించినట్లు సమాచారం.



- ఇసుక రవాణాపై కొరవడిన నిఘా
- ఒకేఒక్క వీఆర్ఓతో పర్యవేక్షణ

వీర్‌శెట్టిపల్లిలో అడ్డుకున్న గ్రామస్థులు

తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి సమీపంలోని కాగ్నా నదిలో నాణ్యమైన ఇసుక ఉందంటూ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు అక్కడ్నించి తరలించేందుకు అనుమతించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు గుత్తేదారులతో డీడీలు కట్టించి వీర్‌శెట్టిపల్లి నది నుంచి ఇసుక పొందేందుకు మిగతా 7 లో...

నిర్మాణాలు నామమాత్రం... నేటికీ అవస్థలే...!

ముందుకు సాగని శౌచాలయాలు

న్యూస్‌టుడే, దౌల్తాబాద్

గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ శౌచాలయాలు నిర్మించుకోవాలని జిల్లా అధికారులు ఆదేశిస్తున్నా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతోంది. గ్రామాల్లో నేటికీ మూస పద్ధతులే పాటిస్తున్నారు. చాలీచాలని నివాస గృహాలు ఉండడంతో ఆరుబయట స్నానాలకు సైతం గోనే సంచులతో దాపు ఏర్పాటు చేసుకుని స్నానాలు చేసే పరిస్థితి నేటికీ దౌల్తాబాద్ మండలంలో కొనసాగుతోంది. డిసెంబర్ చివరి నాటికి మండలంలో అన్ని గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించుకుని స్వచ్ఛ మండలంగా మార్చాలని గత జిల్లా పాలనాధికారిణి దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించినా బేఖాతరు చేస్తూ అధికారులు, పాలకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలేదు. దీంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో మహిళలు అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు పడుతూనే ఉన్నారు. ప్రధానంగా గతంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందివ్వకపోవడంతో గ్రామాల్లో ప్రజలు వీటి నిర్మాణానికి ముందుకు రావడం లేదు. మండల కేంద్రంలో, కుదురుమల్ల, తిమ్మారెడ్డిపల్లి, ఈర్లపల్లి గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించిన వారికి డబ్బులు అందివ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కదలడంలేదు...

జిల్లాలో 18 మండలాలు, కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజక వర్గాలున్నాయి. 367 పంచాయతీలున్నాయి. మొత్తం జనాభా 9 లక్షలకు చేరకుంటోంది. ప్రతి ఇంటికీ వ్యక్తిగత శౌచాలయం నిర్మించాలని గత కలెక్టర్ గ్రామ గ్రామాన ప్రచారం చేయించారు. దీనికి కొంత మేర మాత్రమే



కుదురుమల్లలో గోనే సంచులతో ఇలా...

ఫలితం వచ్చింది. గ్రామాల్లో ప్రజలకు మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి అవగాహన లేకపోవడమే ప్రధాన కారణంగా పేర్కొనాలి. లబ్ధిదారులకు మరుగుదొడ్డి నిర్మించుకుంటామని ముందుకు వస్తే వెంటనే వారికి ఉపాధి సిబ్బంది నిర్మాణం కోసం ముగ్గు వేసి ప్రతిపాదనలు పంపిస్తారు. వెంటనే వారికి గ్రామ పంచాయతీ సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం అధ్యక్షురాలితో కూడిన గ్రామ పారిశుద్ధ్య కమిటీ ఖాతాలో మొదటి దఫాగా రూ. 6వేలు జమ అవుతాయి. ఆ డబ్బులతో నిర్మాణాలు ప్రారంభించి పూర్తి అయిన వెంటనే మరో సారి అధికారులు పరిశీలించి నిర్మాణ ఫొటోను అంతర్జాలంలో నమోదు చేస్తే మరో. రూ. 6 వేలు జమ అవుతాయి. నిర్మాణాల కోసం నిధుల కొరత లేదని అధికారులు చెప్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు ముందుకు సాగపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంద శాతం అన్నారు...

★ దౌల్తాబాద్ మండలంలో ఆయా గ్రామాల్లో 100 శాతం మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని జిల్లా అధికారులు ఆదేశించారు. మండలంలో సుమారుగా 3883 మరుగుదొడ్లను మంజూరు చేశారు. ఇందులో 1100 నిర్మాణాకు ప్రతిపాదనలు పంపగా 41 మందికి మాత్రమే పారిశుద్ధ్య కమి



దౌల్తాబాద్‌లో నిర్మాణంలో శౌచాలయం

టీలో డబ్బులు పడ్డాయి. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలు ప్రారంభించారు. బిల్లుల మంజూరులో జాప్యం జరగడంతో ప్రజలు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపడం లేదు. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు డిసెంబర్ చివరి వరకు పూర్తి చేయాలని జల్లా యంత్రాంగం ఆదేశించినా వారి మాటలు గాలి మూటలుగానే మిగిలిపోయాయని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దౌల్తాబాద్ మండలంలో 10714 జాబ్‌కార్డులు ఉండడంతో ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని అధికారులు ఆదేశించారు. ఇందులో గతంలో సుమారుగా వెయ్యికిపైగా నిర్మాణాలు ప్రారంభించారు.

సూచనలు చేశాం

– సుదాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

మండలానికి 3883 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వీటిలో1100 నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపగా 41 మందికి డబ్బులు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా మంజూరు వచ్చిన తరువాతే నిర్మాణాలు చేయాలని సూచించాం. నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ డబ్బులు వస్తాయి. ఆసక్తి ఉన్న వారు నిర్మించుకోవాలి. మొదట గ్రామాల్లో సర్పంచి, ఎంపీటీసీలు ఇతర నాయకులు మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించాం.

చౌరస్తా ప్రమాదకరం.. నిరోధకాలతోనే ప్రయోజనం!

న్యూస్‌టుడే, కుల్కచర్ల



ఈ చౌరస్తాలోనే వేగ నిరోధకాలను నిర్మించాల్సి ఉంది

పరిగి-మహబూబ్‌నగర్, కోస్గి-మరికల్ ఈ రెండు రూట్లకు కుల్కచర్ల ప్రధాన చౌరస్తా మీదుగానే వెళ్లాలి. ప్రతి అరగంటకు ఒక బస్సు పరిగి నుంచి మహబూబ్‌నగర్, అక్కడి మళ్లీ పరిగికి ఒక బస్సు, దాదాపూర్ నుంచి మరికల్, అక్కడి నుంచి మళ్లీ కోస్గి వైపు వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు ఇతర ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు రాఘవాపూర్ నుంచి నంచర్ల వరకు రెండు వరుసల రహదారి ఉండటంతో వేగంగా వాహనాలు వెళ్తున్నాయి. ఇలా పరిగి నుంచి నంచర్ల వైపు, అటు వైపు నుంచి ఇటు పరిగికి వాహనాలు వేగంగా వెళ్తున్న సమయంలో మరో వైపు మరికల్ నుంచి బండవెల్కిచర్లకు వెళ్లడానికి ఈ రహదారిని క్రాస్ చేయాలి. ఈ క్రమంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం చోటుచేసుకునే వీలుంది. దీనికి తాజా ఉదహరణ... ఆదివారం సాయంత్రం నంచర్ల నుంచి పరిగి వైపు వెళ్తున్న ఇన్నోవా రహదారిని అజాగ్రత్తగా క్రాస్ చేసేందుకు యత్నించిన బైక్‌ను ఢీకొట్టడంలో కనురెప్పపాటులో తప్పిపోయింది. ఇన్నోవా డ్రైవర్ వెంటనే అప్రమత్తమై సడన్ బ్రేక్‌ను వేయడంతో పెను ప్రమాదం తప్పిపోయింది. ఇలా ఈ ఒక్కటే కాదు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెక్ పెట్టినట్లే....: చౌరస్తా నుంచి బండవెల్కిచర్ల, నంచర్ల, పరిగి, మరికల్ ఈ నాలుగు రూట్లలోను వేగ నిరోధకాలను వేయాల్సిన అవసరం అవసరం ఉంది. తద్వారా వేగంగా వచ్చే వాహనాలు చౌరస్తాకు వచ్చే సరికి వేగం తగ్గుతుంది. దీనివల్ల ఇబ్బందులకు చెక్ పడినట్లే. గతంలోను పలు ప్రమాదాలు రెప్పపాటులో తప్పిపోయాయి. అప్పటి హోం మంత్రి సబితారెడ్డి వాహన శ్రేణి గండేడ్ మండలంలో పర్యటన ముగించుకొని కుల్కచర్ల చౌరస్తా మీదుగా వెళ్తున్న క్రమంలో మరికల్ రూటు నుంచి వచ్చిన జీపు బండవెల్కిచర్ల వైపు కాన్వాయ్‌ను గమనించకుండా క్రాస్ చేస్తూ వెళ్లింది. రెప్పపాటులో ప్రమాదం తప్పిపోయింది. దీంతో అప్పట్లో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా ఇక్కడ వేగ నిరోధకాలను ఏర్పాటు చేయించడంలో సంబంధిత అధికారులు అంతగా పట్టించుకోవడం లేదు.

రద్దీ అధికమే...: పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు ఘణాపూర్, రాంపూర్, ఇప్పాయిపల్లి, కుస్మసముద్రం, చౌడాపూర్, మందిపల్, తిర్మలాపూర్, అనంతసాగర్, పుట్టపహడ్, బండవెల్కిచర్ల, కామన్‌పల్లి, పీరంపల్లి తదితర గ్రామాల నుంచి రాకపోకలను సాగిస్తుంటారు. దీనికి తోడు ప్రభుత్వ కార్యాలయాలకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు తమ తమ పనులపై వచ్చి వెళతారు. దీంతో కుల్కచర్ల ప్రధాన చౌరస్తాపై విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మరో వైపు ఆయా రూట్ల నుంచి వాహనాల రాకపోకలు కొనసాగతున్నాయి. ఈ క్రమంలో వేగంగా వెళ్లే వాహనాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోన్న భయం నెలకొంటోంది.

చౌరస్తా నుంచే వెళ్లాలి

– బుచ్చిరెడ్డి, ఘణాపూర్

మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల నుంచి వివిధ అవసరాల నిమిత్తం ప్రజల రాకపోకలను సాగిస్తుంటారు. ఎవరు ఎక్కడికి వెళ్లాలన్నా చౌరస్తా నుంచే వెళ్లాలి. ఆ క్రమంలో వేగ నిరోధకాలను ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది.

అధికారులకు వివరిస్తాం

– చంద్రకాంత్, ఎస్ఐ, కుల్కచర్ల




ప్రధాన చౌరస్తాలో వేగ నిరోధకాలను నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. చౌరస్తాలోనే ఆటోలను నిలిపేవారు, ఆటోల నిలుపుదలను బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేశాం. వేగ నిరోధకాలను నిర్మించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతాం. సమస్యను వివరిస్తాం.

ఐకమత్యంతోనే అభివృద్ధి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే మనువాదం కారణంగానే దేశం వెనుకబాటుతనంలో ఉందని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు అంజి అన్నారు. మహారాష్ట్రలో పీశ్వాలపై మహర్ల విజయాన్ని పుస్కరించుకుని సోమవారం ఎన్కతల గ్రామంలో అంబేడ్కర్ సంఘం వారు సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదర భావం, ఐక్యమత్యంతో నడుచుకుంటే అభివృద్ధి బాటలో పయనించగలమని ఆయన పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషిచేద్దామని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి అనంతయ్య, బుద్ధ విజ్ఞాన కేంద్రం గ్రామ అధ్యక్షుడు నర్సిములు, గ్రామ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఆనంద్, నాయకులు మల్లేశం, పోచయ్య, వెంకటయ్య, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మనిషి మార్పునకు ఇది దోహద పడుతుందని స్థానిక శాసనసభ్యుడు తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తమ నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పరిగి నియోజకవర్గంలో అన్ని ఆలయాలను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా రూ. 2కోట్ల వ్యయంతో 36దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఇప్పటివరకు 58 దేవాలయాల బాగుకు నిధులు మంజూరు చేయించామన్నారు. కొత్త ఏడాదిలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరారు. మంచి మనస్సుతో ఉంటే మంచి ఆలోచనలు వస్తాయని ప్రజల్లో మార్పుకు ఆధ్యాత్మిక చింతన అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బి. నారాయణరెడ్డి, వెంకటేష్, భీంరెడ్డి, పులిందర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరిన నిరసనలు



మరికల్‌లో కొనసాగుతున్న ఆందోళన కార్యక్రమం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కుల్కచర్ల మండలంలో తమ గ్రామాన్ని విలీనం చేయాలని కోరుతూ మరికల్ గ్రామస్థులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు 15వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మాట్లాడారు. పదిహేను రోజులుగా తమను కుల్కచర్ల మండలంలో విలీనం చేయాలని కోరుతున్నా ప్రజా ప్రతినిధుల నుంచి తగిన స్పందన లభించడం లేదన్నారు. నవాబ్‌పేట మండలంలో తమ గ్రామం విలీనం చేయడం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అక్కడ ఇమడ లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి మరికల్, మల్కాపూర్ గ్రామాలను మళ్లీ కుల్కచర్ల మండలంలోనే విలీనం చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తగిన చర్యలను తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, సమస్యలపై నిరంతరం పీఆర్టీయూ పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని అతిథి గృహంలో పీఆర్‌టీయూ 2018 కాలసూచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో బదిలీలు, పదోన్నతలు, పండితుల ఉన్నతీకరణ, సీపీఎస్ రద్దు, సీసీఈ విధానం అమలు తదితర సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, నర్సింలు, కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, మండల మహిళా ఉపాధ్యక్షురాలు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



కాలసూచిని ఆవిష్కరిస్తున్న నాయకులు

చేతికొచ్చినా.. చేయూతకు పడిగాపులే..!

పంట విక్రయానికి కంది రైతుల అవస్థలు


పరిగి విపణికి ట్రాక్టర్లపై తరలుతున్న ధాన్యం

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

● బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన కోస్గి రాజు సాగుచేసుకున్న కంది పంట ద్వారా ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పదిరోజుల కింద కల్లంలో శుద్ధి చేసిన కందులను సంచుల్లో నింపుకొని ఇంటికి తీసుకొచ్చారు. చేతికొచ్చిన పంటను ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కాకపోవటంతో పది రోజులుగా ఎదురుచూస్తున్నారు.

● బురాన్‌పూర్ గ్రామానికి చెందిన రాములు సాగు చేసిన కందిపంటతో ఆరు క్వింటాళ్ల కంది పంట చేతికొచ్చింది. తాండూరు, పరిగి మార్కెట్ యార్డుల్లో పంటలను అమ్ముకుందామంటే మద్దతు ధర కంటే క్వింటాలుకు ఏడెనిమిది వందల రూపాయల నష్టం వస్తోంది. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరలకే రైతులనుంచి కొంటామని ప్రకటిస్తున్నా అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో రైతులు పంటను అమ్ముకోవటానికి ఇబ్బందులు పడుతున్నారు.

నానా తిప్పలు: ముఖ్యంగా ఇక్కడి ప్రాంతాల రైతులు చేతికొచ్చిన పంటను విక్రయించుకోవటానికి నానా అవస్థలు పడుతున్నారు. పంటలు చేతికొచ్చిన సమయంలో కూలీలకు, కోతయంత్రాలకు డబ్బులివ్వటానికి రైతులు ట్రాక్టర్లలో తాండూరు, పరిగి విపణికి తీసుకెళ్తు తక్కువ ధరలకు పంటలను అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ఈఏడాదిలో మద్దతు ధరలకంటే తక్కువకే వ్యాపారులు కొనుగోలు చేయటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతుండగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరలకు కొంటున్నారు. స్థానికంగా వ్యాపారులకు అమ్ముకునే ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేకపోగా ధాన్యం తీసుకెళ్లటానికి రవాణా ఛార్జీలతో ఆర్థికంగా భారం పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కందిపంట సాగు ఎక్కు


కందులను వేరు చేస్తున్న రైతులు

60 వేల హెక్టార్లలో సాగు

జిల్లాలో 2017లో సుమారు 60 వేల హెక్టార్లల్లో కందిపంట సాగుచేయగా కొడంగల్ నియోజక వర్గంలోని బొంరాస్‌పేట, కొడంగల్, కోస్గి, దౌల్తాబాద్, మద్దూరు మండలాల్లో సుమారు 28 వేల హెక్టార్లల్లో రైతులు ఖరీఫ్‌లో ప్రధానంగా కందిపంటను సాగుచేశారు. చేతికొచ్చిన పంటను ఇక్కడి రైతులు తాండూరు విపణిలోనే విక్రయించటానికి తీసుకెళ్తారు.

● మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో రైతులనుంచి రూ.5,450 మద్దతు ధరలకు కొనుగోలు చేస్తుండగా విపణుల్లో మాత్రం రూ.4,700లుగా అటూ ఇటూ ధరలకు కొంటున్నారు.

● కొడంగల్‌లోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయటంతో ఐదు మండలాల నుంచి రైతులు పంటను విక్రయించుకోవటానికి అక్కడికెళ్లిన రైతులు రెండు, మూడు రోజులు కేంద్రాల దగ్గర పడిగాపులు పడుతూ అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక్కడి ప్రాంతంలో కంది పంట సాగును గుర్తించి మండలానికో కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

● కొడంగల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా రైతులనుంచి ధాన్యం కొనటం మొదలు పెట్టకపోవటంతో కేంద్రానికెళ్లి చూసివస్తున్నారు.

● వరి ధాన్యం కొనుగోలు కోసం మండలానికి రెండుమూడు కేంద్రాలు ఏర్పాటు చేసే అధికారులు కందుల కొనుగోలుకు మండలానికో కేంద్రం ప్రారంభించాలని వేడుకుంటున్నారు.

వున్న గ్రామాల్లో మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

బొంరాస్‌పేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

– వెంకటయ్య, రైతు ఏర్పుమళ్ల (బొంరాస్‌పేట)



కందులను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ధరలు తక్కువగా ఉన్నాయి. దగ్గరలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కొనుగోలు కేంద్రాలు లేనందుకు ఇబ్బందులు పడుతూ నష్టపోతున్నాం. కొడంగల్ తీసుకెళ్లాలంటూ రవాణా ఖర్చులు, భోజనాల పేరుతో ఖర్చులు పెరుగుతాయి. బొంరాస్‌పేట మండల కేంద్రంలో కొనుగోలుకేంద్రం ప్రారంభిస్తే ఇక్కడి రైతులకు అందుబాటులో ఉండటంతో మద్దతు ధరలకు అమ్ముకొని లాభపడుతాం. అధికారులు చర్యలు తీసుకొని తొందరగా కేంద్రాన్ని ప్రారంభించాలి.

జిల్లాకు రావాలని ముఖ్యమంత్రికి వినతి


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శుభప్రదపటేల్

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెరాసవి రాష్ట్ర సమన్వయకర్త, ఉద్యమ నాయకుడు శుభప్రదపటేల్ సోమవారం ప్రగతి భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ జిల్లాకు రావాలని ఆయన ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

పర్యావరణ రక్షణకు కృషి చేస్తేనే మానవ మనుగడ

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: కాలుష్యం వల్ల ప్రపంచం మొత్తం ప్రమాదం అంచున ఉందని, అందరూ బాధ్యతగా పర్యావరణ రక్షణకు కృషి చేసినప్పుడే మానవ మనుగడ సాధ్యమని హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వెంగళరావునగర్ డివిజన్ యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో 'గ్రీన్ నూతన సంవత్సర వేడుకలు' ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. భూమిమీద ఉన్న మంచుకొండలు కరిగిపోతున్నాయన్నారు. ఓజోన్ పొరకు చిల్లుపడటం వల్ల భూతాపం పెరిగిపోతోందన్నారు. పారిశ్రామిక రంగం గాలిని, నీటిని విషతుల్యం చేస్తోందన్నారు. వ్యక్తిగత వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోతోందని, కాలుష్య నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గౌరవ అతిథి, పర్యావరణ శాస్త్రవేత్త పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని సంపత్తిగా తయారు చేసుకోవాలన్నారు. కార్పొరేటర్ కిలారి మనోహర్ మాట్లాడుతూ.. పర్యావరణంపై తమ డివిజన్ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. వేడుకలకు హాజరైన జవహర్‌నగర్‌లోని ఎస్సీబాలుర వసతి గృహం విద్యార్థులు, కృష్ణకాంత్‌పార్కు వాకర్స్‌తో జస్టిస్ ఈశ్వరయ్య పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ సంస్థ అధ్యక్షులు సి.హెచ్.భద్ర, ఉపాధ్యక్షులు శిల్పిక కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ ఎం.ఎ.షఫీ, ఆర్గనైజర్ రామకృష్ణ మిట్టపల్లి, పర్యావరణ సంస్థ కార్యదర్శి బి.కల్యాణి, ఎస్సీ బాలుర వసతి గృహం వెల్ఫేర్ అధికారి ఎన్.సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ వేంకటేశుని చెంత కోలాహలం

కొడంగల్ పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కొడంగల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలుచేసి స్వామికి మొక్కును చెల్లించుకున్నారు. స్వామిని పలురకాల పూలతో అందంగా అలంకరించారు. స్వామిని దర్శించుకోవడానికి కొడంగల్ మండలంతో పాటు తాండూర్, కర్ణాటక ప్రాంతల నుంచికూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదలు అందజేశారు.


పూలతో అలంకరించిన శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహం


ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమం

భక్తవత్సలా గోవిందా.. భక్తులు పోటెత్తే గోవిందా..!

చిలుకూరు బాలాజీ ఆలయానికి భారీగా రాక ● కిటకిటలాడిన దారులు


ఆలయంలో భక్తులకు తీర్థ వితరణ..


బాలాజీ ఆలయ వీధిలో కిక్కిరిసిన భక్తులు..

మొయినాబాద్, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరం రోజైన సోమవారం చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రస్తుతం ధనుర్మాసం కావడంతో భక్తులు పోటెత్తారు. ఓ వైపు భక్తుల గోవింద నామస్మరణ.. మరోవైపు అన్నమయ్య కీర్తనలు.. వేదపండితుల మంత్రోచ్ఛారణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉదయం 3 గంటలకే ఆలయాన్ని తెరిచిన పూజారులు.. ముందుగా బాలాజీకి అర్చన, హారతి పూజ పూర్తి చేసి దర్శనాలు ప్రారంభించారు. భక్తుల రద్దీని దృష్టిలోపెట్టు కొని కొద్దిసేపు మాత్రమే గర్భగుడి దర్శనాలకు అనుమతినిచ్చి.. తర్వాత మహాద్వార దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 6.15గంటల సమయంలో ధనుర్మాస ఆరాధన పూర్తి చేయగా.. అనంతరం నక్షత్రహారతి, కుంభ, కర్పూర నీరాజనాన్ని సమర్పించారు. రాత్రి 7.50గంటల వరకు గుడి తెరిచి ఉన్నంత వరకు లక్ష మందికిపైగా దర్శించుకున్నారని అంచనా. మధ్యాహ్నం కాసేపు తోపులాట చోటుచేసుకోవడంతో అక్కడే ఉన్న ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, పూజారి రంగరాజన్ దగ్గరుండి సమస్యలు ఎదురుకాకుండా చూశారు. 11, 108 ప్రదక్షిణలను పూర్తిగా నిలిపివేశారు. తెల్లవారుజామునే ఎమ్మెల్యే డీకే అరుణ బాలాజీని దర్శించుకున్నారు. ఆంగ్ల సంవత్సరాదికి వ్యతిరేకం కాదని, కేవలం శుభాకాంక్షలు మాత్రమే చెప్పుకోవాలని సూచించానని, దాన్ని కొందరు వక్రీకరించారని ఆలయ పూజారి ఎంవీ రంగరాజన్ తెలిపారు.

భారీగా ట్రాఫిక్ జాం..

హైదరాబాద్ నగరం నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన భక్తుల వాహనాలన్నీ చిలుకూరు వైపే రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారుగా 5 కిలోమీటర్ల నుంచే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ స్థలాల్లో పెట్టి.. కాలిబాటన చిలుకూరుకు చేరుకోవాల్సి వచ్చింది. ఆలయం లోపల మూడు వరుసల్లో భక్తులకు బాలాజీ దర్శన సౌకర్యాన్ని కల్పించారు. ఆలయం ప్రాంగణంలోని మొదటి బ్యాంక్ వద్ద నగరంలోని తిరుమల ట్రెడిషన్ మ్యూజిక్ రవిరాజ్‌భట్టర్ బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. మరోవైపు ఆర్టీసీ బస్సులు కిటకిటలాడి కనిపించాయి. శంషాబాద్ జోన్ డీసీపీ పీవీ పద్మజారెడ్డి సోమవారం తెల్లవారుజామునే ఆలయానికి చేరుకొని బందోబస్తును పర్యవేక్షించారు. ఏసీపీలు అశోక్, అశోక్‌కుమార్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పరిగి

ప్రముఖులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

వికారాబాద్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ప్రముఖులను స్థానిక నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి పి.సబితారెడ్డికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎం.డి.హఫీజ్, జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు పి.సునీతారెడ్డికి వికారాబాద్ మండలం కొటాలగూడ సర్పంచి రాఘవన్‌నాయక్‌లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకాశ దీపాల ఏర్పాటుకు కృషి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: గంగ్యాడ నుంచి మూసీ వంతెన మీదుగా గొల్లగూడ రైల్వేస్టేషన్ వరకు ఆకాశదీపాల ఏర్పాటుకు కృషి చేస్తానని చేవెళ్ల లోకసభ సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గంగ్యాడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇటీవల మూసీ నదిలో పడవ ప్రయాణం సందర్భంగా గ్రామస్థులు ఆకాశ దీపాల ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి ఆయనకు వివరించారు.

చిన్న సమస్యలు... పరిష్కరిస్తే మేలు

ఫోకస్

వినియోగంలోకి తీసుకురండి



నిరుపయోగంగా ట్యాంకు

చెరువుముందలితండా, కుల్కచర్ల: చెరువుముందలితండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న మినీ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. నీరు అందుబాటులో లేకపోవడంతో డబ్బాలలో తెచ్చుకున్న నీటినే తాగడానికి ఉపయోగిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే వేసవిలో సమస్య మరింత తీవ్రమవుతుందని, వీలైనంత తొందరగా పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అంతేకాక మండల పరిధిలోని చాలా పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.


అధ్వానంగా రహదారులు



కాలువలు లేక ఇలా...

ఘనాపూర్, కుల్కచర్ల గ్రామీణ: ఘనాపూర్ గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చిన మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో రోడ్లన్నీ అధ్వానంగా మారుతున్నాయి. సమస్యపై గ్రామ స్థాయి అధికారులు దృష్టి సారించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. గ్రామంలో మురుగు వ్యవస్థ సక్రమంగా లేకుంటే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మురుగు కాలువలను నిర్మించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు తెలియజేస్తున్నారు.

నీటి వృథాను అరికట్టాలి



వృథాగా పోతున్న నీరు

కామన్‌పల్లి, కుల్కచర్ల గ్రామీణ: కామన్‌పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న బోరు వద్ద నీరంతా వృథా అవుతుంది. సరఫరా పైపులను సక్రమంగా అమర్చకపోవడమే దీనికి ప్రధాన కారణం. దీంతో రోడ్డంతా బురదమయంగా మారుతుంది. కొన్ని రోజులుగా నీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు అంటున్నారు. దీంతో వేసవిలో తాగునీరు లభించక ప్రజలు అవస్థలు పడే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇప్పటి నుంచే నీటి వృథాకు అడ్డుకట్ట వేస్తే మంచి ఫలితం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

గుంతను పూడ్చండి



ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ: కుల్కచర్ల గ్రామంలోని కల్యాణ్‌నగర్‌లో మురుగు నీరంతా ఒక చోట చేరి చిన్నపాటి కుంటగా మారింది. దుర్వాసన వెదజల్లుతుందని కాలనీవాసులు తెలియజేస్తున్నారు. అంతేకాక గ్రామంలో మురుగు కాలువల నిర్మాణం కూడా అంతంత మాత్రంగానే ఉంది. కాలువలు చాలా రోజుల క్రితం నిర్మించినవి కావడంతో అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు స్పందించి మురుగు పారుదలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పిల్లల్లో సేవాభావం అలవడాలి



సరకులు అందజేస్తున్న రాములు, శ్రీనివాస్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సేవాభావం అలవడాలని పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరెడ్డి, పాఠశాల డైరెక్టర్ రాములు పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని ఆదరణ ఫౌండేషన్ నిర్వాహకులు మాధవరావుకు ఏడు క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల పప్పు, 300 సబ్బులు, చింతపండు, ఇతర నిత్యావసర సరకులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. క్రమశిక్షణతోనే విద్య అలవడుతుందని, మానవతా విలువలు ప్రతి ఒక్కరికీ అవసరమని సూచించారు. పసి వయసు నుంచే అలవడితే సమాజంలో మంచి పేరు కలిగిన వ్యక్తులుగా మారేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేమారెడ్డి, కొడంగల్ ప్రిన్సిపల్ మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

హలో ఈనాడు



పరిగి	:	8008573272
దోమ	:	8008573274
కుల్కచర్ల	:	8008573275
పూడూరు	:	8008573276
కుల్కచర్ల గ్రామీణ	:	7093981580

పూడూరు, న్యూస్‌టుడే:

సమస్య: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరయింది. నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ రాయితీ ఇవ్వటం లేదు. **– నర్సిములు, చన్‌గోముల్**

సమాధానం: దరఖాస్తులు అధికారుల పరిశీలనకు పంపించాం. రాగానే సమాచారం అందించి రుణాలు అందించేందుకు చర్యలు చేపడతాం. **– జయరాం, ఈఓఆర్డీ**

సమస్య: రేషన్ కార్డు అకారణంగా తొలగించారు. కొంతకాలంగా సరకులు రావటం లేదు. కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. **– లక్ష్మమ్మ, పెద్ద ఉమ్మెంతాల్**

సమాధానం: గ్రామాల నుంచి రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించి జాబితాను అధికారులకు పంపాం. ఇంకా అనుమతులు రాకపోవటంతో జాప్యం జరుగుతుంది. **– మహేశ్, ఆర్ఐ**



హోటల్‌ను ప్రారంభిస్తున్న మేనేజరు శ్రీహరి

యువత స్వశక్తితో ఎదగాలి

పూడూరు, న్యూస్‌టుడే: యువత స్వశక్తిపై నిలబడి ఆర్థికంగా ఎదగాలని పూడూరు బ్యాంకు మేనేజరు శ్రీహరి తెలిపారు. మండల పరిధిలోని మన్నెగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజా హోటల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉపాధి రంగాలను ఎంచుకోవటంపై అభినందించారు. వ్యాపారాలను ప్రోత్సహించి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. తీసుకున్న రుణాలను వాయిదాల వారీగా సకాలంలో చెల్లించాలని చెప్పారు. దీంతో ఇతరులకు ఉపయోగం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజునాయక్, రామునాయక్, లక్ష్మణ్, అనిల్, రాజేశ్ భాజపా నాయకులు మల్లేశం, స్థానికులు జావెద్, రహీం, శ్రీనివాస్, గౌస్‌పటేల్, ఫాజిల్ పురోహితులు భీమాచారి ఉన్నారు.

వినియోగంలోకి తీసుకురండి

బోగారం, కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే: పశువుల దాహార్తి తీర్చేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన తొట్లను పట్టించుకోక పోవడంతో వృథాగా మారాయని బోగారం గ్రామస్థులు వాపోతున్నారు. తొట్లలో గడ్డి పెరగడం, చెత్తాచెదారం వేయడంతో నిరుపయోగంగా మారాయని తెలిపారు. సర్జఖాన్‌పేట్, మాసాయపల్లి, బోగారం, బలభద్రాయపల్లి, కొత్తపల్లి, నాచారం, పోలెపల్లి, అమ్లికుంట, గుండుమాల్ గ్రామాల్లో నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి.

పైపులైనుకు లీకులు.. తాగునీరు కలుషితం



నీటి సరఫరా పైపు



దుస్తుల శుభ్రం ఇక్కడే

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ పురపాలక సంఘం ఆలంపల్లి గ్రామ ప్రధాన రోడ్డు మార్గంలో తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ లీకవుతోంది. దీంతో నీరు అక్కడ మడుగు కడుతోంది. ఈ పైపులైన్ వద్దనే ప్రతి రోజు మంచి నీటిని వదిలే ఆన్ ఆఫ్ ఉంది. ప్రతి రోజు మంచి నీటిని వదిలి, గంట తర్వాత ఆపి వేస్తారు. నీటిని వదిలినపుడు లీకేజీ ఉండడంతో తిరిగి పైపుల్లోకి చేరి ఇళ్లకు సరఫరా అవుతోంది. ఈ నీటినే ప్రజలు తాగాల్సి వస్తోంది. అంతేకాకుండా మురుగు కుంట పక్కనే కొందరు దుస్తులు శుభ్రం చేస్తున్నారు. ఈ నీరు సైతం తాగు నీటి పైపుల్లో చేరుతోంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలి



బూట్లు పంపిణీ చేస్తున్న వికారాబాద్ డీఎస్పీ శిరీష

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఇతరులకు తోచినంత సాయం అందించాలని వికారాబాద్ డీఎస్పీ శిరీష అన్నారు. సోమవారం ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా వికారాబాద్ మండలం ధన్నారం శివారులోని యజ్ఞ ఫౌండేషన్ అనాథ ఆశ్రమం పిల్లలకు బూట్లు, కొంపల్లి వృద్ధాశ్రమంలో రేషన్ సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావించాలన్నారు. సేవా భావంతో ఎంత క్లిష్టమైన పనినైనా సులభంగా చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వికారాబాద్, ధారూర్, మోమిన్‌పేట, మహిళా పోలీస్ ఠాణా సీఐలు మాగంటి వెంకటరామయ్య, ఉపేందర్, శ్రీనివాస్, నిర్మల, ఎస్ఐలు రవికుమార్, ప్రణయ్, సురేష్ పాల్గొన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రంగారెడ్డి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నవాబుపేట మండలం మైతాబ్‌ఖాన్‌గూడ గ్రామానికి చెందిన లింగంపల్లి లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఉదయం కాంగ్రెస్ నాయకురాలు, మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంలో రైతులు, యువత ప్రభుత్వ వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రామ స్థాయి నుంచి పార్టీని సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెపు మల్లారెడ్డి తదితరులున్నారు.

పరిగి

ఎన్కతలలో నీటి ఎద్దడి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్కతల గ్రామంలో తాగు నీటి బోర్లు పనిచేయక నీటి సమస్య ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో రెండు సింగిల్ ఫేజ్ బోర్లున్నాయి. ఆయా బోర్లలో నీరు అడుగంటి నిరుపయోగంగా మారాయి. చేతి పంపునకు సైతం మరమ్మతులు చేయకపోవడంతో అది వినియోగించుకునే అవకాశం లేకపోయింది. దీంతో కాలనీలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

కిటకిటలాడిన ఆలయాలు

పరిగి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. మహిళలు వేకువజామునే లేచి రంగవల్లికలతో ఇంటి పరిసరాలు అందంగా తీర్చిద్దారు. ముగ్గులు వేయడంలో ఒకరికొకరు పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పరిగిలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం, సాయి ఆలయాలతో పాటు పూడూరు మండలం దామగుండంలోని శ్రీరామలింగేశ్వరాలయం, దోమ మండలంలోని మైలారం బాలాజీ ఆలయం, కుల్కచర్లలోని పాంబండ శ్రీరామలింగేశ్వరుని ఆలయాలు రద్దీగా కనిపించాయి. కొత్త ఏడాదిలో ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని సుఖశాంతులతో విలసిల్లాలని, పసిడి పంటలతో ప్రాంతమంతా అలరారాలని ప్రజలు కోరుకున్నారు. పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: కుల్కచర్ల మండల పరిధిలోని గ్రామాలలో దేయాలయాల దగ్గర ప్రజలు పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సోమవారం పర్వదినం ఉండటంతో భక్తులు దేవాలయాల దగ్గర అధిక సంఖ్యలో కనిపించారు. బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండ దేవాలయం దగ్గర భక్తుల తాకిడి కనిపించింది. ఉదయం నుంచే భక్తులు దేవాలయం దగ్గర ఉన్న తీర్థంలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి దర్శనానికి బారులు తీరి కనిపించారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు, కుంకుమార్చన కార్యక్రమాలు జరిపించారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు భజన భక్తులు దేవాలయ ప్రాంగణంలో భజనలు చేశారు. నూతన సంవత్సర రోజు కావడంతో ఎక్కువగా యువకులు దేవాలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. అర్చకులు పాండు మాట్లాడుతూ...నూతన సంవత్సరం రోజు మంగళవారం పౌర్ణమి ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో రావడం జరిగిందన్నారు. ప్రతి నూతన సంత్సరం రోజున ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారని ఆయన తెలిపారు.

పూడూరు: నూతన సంవత్సర వేడుకలను మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు టపాసులు కాల్చుతూ నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. కొందరు కేక్‌లను కట్‌చేశారు. మండల పరిధిలోని దామగుండం, రాకంచర్ల, పెద్దఉమ్మెంతాల్, పూడూరులోని సోమలింగేశ్వర ఆలయంతో పాటు ప్రధాన ఆలయాలకు భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.


ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు


దామగుండంలో పూజలు చేస్తున్న భక్తులు

సామాజిక వర్గాలు రాజ్యాధికారం సాధించాలి

మద్దూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు చెందిన సామాజిక వర్గాలు రాజ్యాధికారం దక్కించుకొనుటకు ప్రయత్నించవలసిన అవసరం ఉందని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో తెలంగాణ సామాజిక ప్రజా సంఘం గోడచిత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణలో సామాజికంగా వెనుకబడ్డ కులాలకు సామాజిక న్యాయం, టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా గ్రామ స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేసుకుని 2019 నాటికి సాధారణ ఎన్నికల్లో రాజ్యాధికారం దిశగా ప్రయత్నం చేయాలని వారు సూచించారు. ఈ నెల 3న మద్దూరులో ఏర్పాటు చేసే నూతన కార్యవర్గ ఎన్నికకు అన్ని వర్గాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో చిన్నయ్య, లక్ష్మణ్, అశోక్, హన్మంతు, నరేందర్, కృష్ణ, రాములు, విఠల్, బీమ్లానాయక్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

మద్దూరు, న్యూస్‌టుడే: రెవెన్యూలో పని చేస్తున్న వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా పాలనాధికారి రొనాల్డ్‌రోస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సమస్యలను విన్న అనంతరం సానుకూలంగా స్పందించిన పాలనాధికారి పదోన్నతులపై ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చినట్లు వీఆర్ఏలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నప్ప, కార్యదర్శి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు: ఒకరి మృతి

పరిగి, న్యూస్‌టుడే: మిట్టకోడూరు(పరిగి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పరిగి మండలంలోని లఖ్నాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై క్రిష్ణ తెలిపిన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూడూరు మండలం మంచన్‌పల్లి గ్రామానికి చెందిన సత్తయ్య (36) తన భార్య సంధ్యారాణి, కూతురుతో కలిసి కారులో అత్తగారి ఊరైన దారూర్ మండలం రాజాపూర్ గ్రామానికి సాయంత్రం సమయంలో వెళ్లారు. రాత్రి సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. అదుపు తప్పిన కారు మిట్టకోడూరు క్రాస్ రోడ్డు వద్ద చెట్టుకు ఢీకొంది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా కూతురు కాలు విరిగి పోయిందని వైద్యులు గుర్తించారు. సత్తయ్యకు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా రాకంచర్ల సమీపంలోకి వెళ్లగానే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. సంధ్యారాణి కోలుకుంటున్నట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అంగడిచిట్టంపల్లి (పూడూరు): మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి, మీర్జాపూర్ తదితర గ్రామాల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రజల ముందుకు వచ్చినట్లు ఎంపీ చెప్పారు. అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. ఎక్కడయినా లోపాలు ఉంటే సరిచేసుకుని ప్రజలకు చేరవేయాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించనున్నట్లు ఎంపీ వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, ప్రవీణ్, వినయ్, అశోక్, నర్సములు, రాములు, గోపాల్, బుచ్చయ్య తదితరులున్నారు.


స్థానికులతో సమావేశమైన ఎంపీ

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయి

తుంకిమెట్ల, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శరీర దృఢత్వాన్ని ఇస్తాయని సీఐ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని తుంకిమెట్ల పరిధిలోని బొట్లోనితండాలో శ్రీపంత్ సేవాలాల్ మహరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను సీఐ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 30 జట్లు పోటీలో పాల్గొన్నాయి. గెలుపు, ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని, స్నేహపూర్వక వాతావరణంతో ఆటలు ఆడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తెరాస మండలాధ్యక్షుడు విష్ణువర్దన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు యాదగిరి, రామకృష్ణయాదవ్, నిర్వాహకులు బాలు, రాజు, విజయ్, అర్జున్ తదితరులు ఉన్నారు.

మినీట్యాంకు నిర్మిస్తే మేలు

దౌల్తాబాద్: మండలంలోని చంద్రకల్ అనుబంధ గ్రామమైన దాసరిగూడెం గ్రామంలో సింగిల్‌ఫేజ్ బోరుమోటారు నుంచి నీరంతా వృథాగా పారి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు ఉన్న సమయాల్లో ప్రజలు నీరు తీసుకెళ్లిన తరువాత పరిసర ప్రాంతమంతా బురదమయంగా మారుతుందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో మినీట్యాంక్ నిర్మిస్తే విద్యుత్తు లేని సమయాల్లో కూడా ప్రజలకు నీటి కొరత ఉండదని పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి

సామర్థ్య పరీక్షలో ఆదర్శ పాఠశాల విద్యార్థులదే పైచేయి

పరిగి, న్యూస్‌టుడే: సాఫ్ట్‌లైన్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జి, కంప్యూటర్, ఆంగ్లం, గణితం, సైన్స్ సబ్జెక్టులపై గత డిసెంబరు 3న నిర్వహించిన సామర్థ్య పరీక్షలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఉత్తమంగా నిలిచారు. నియోజకవర్గంలోని పూడూరు, దోమ, పరిగి, కుల్కచర్ల మండలాల నుంచి 34 పాఠశాలలకు చెందిన 2063 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. నిర్వాహకులు కొత్త సంవత్సరం రోజున తమ ఫలితాలను ప్రకటించారు. వంద మార్కులకు పరిగి మండలం జాఫర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలకు చెందిన కె.మమత 81 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఎస్.శిరీష 79 మార్కులతో ద్వితీయ స్థానం, దోమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.మహేష్ 75 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచాడు. విజేతలకు త్వరలోనే ఒక్కొక్కరికి ఒక్కో కంప్యూటరును అందజేస్తామని, పాల్గొన్న అన్ని పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు ఐదు బహుమతుల చొప్పున అందజేస్తామని సంస్థ డైరెక్టర్ ఆంజనేయులు తెలిపారు.


కె.మమత, జాఫర్‌పల్లి


ఎస్.శిరీష, ముజాహిద్‌పూర్


కె.మహేష్, దోమ

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

దౌల్తాబాద్: మండలకేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమలకు పయనమయ్యారు. బలభీమసేన దేవాలయంలో మహబూబ్‌నగర్ గురుస్వామి రామచంద్రయ్య ఇరుముడులు కట్టారు. 41 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో దీక్ష చేపట్టిన స్వాములు శబరిమలకు బయలుదేరారు. గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి స్వాములకు వీడ్కోలు పలికారు. అంతకుముందు దేవాలయం వద్ద గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ప్రవీణ్‌గౌడ్, మధు, హన్మంతు, రాజు, నర్సింహులు, అఖిల భారత అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

తారురోడ్డు వేయించరూ..!

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే: కోస్గి-తుంకిమెట్ల ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తొగాపూర్ గ్రామస్థులు అన్నారు. పరిసర గ్రామాలకు ఈ దారిలో వెళితే సమయం, దూరం ఆదా అవుతుందన్నారు. మట్టిరోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారిందని, ఈ దారి గుండానే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రాత్రివేళల్లో మరింత ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు వెంటనే తారురోడ్డు వేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన పీఆర్‌టీయూ నాయకులు

తాండూరు గ్రామీణం: తాండూరు మండలశాఖ పీఆర్‌టీయూ నాయకులు సోమవారం జడ్పీ అధ్యక్షురాలు సునీతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని అధ్యక్షురాలి నివాసానికి చేరుకున్న నాయకులు పుష్పగుచ్ఛాలను అందజేశారు. నూతన సంవత్సరంలో విద్యారంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

బషీరాబాద్, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. గస్తీలో భాగంగా బషీరాబాద్ ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం రాత్రి తనిఖీలు చేసినట్లు చెప్పారు. బషీరాబాద్ మండలానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భాజపా ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు

దౌల్తాబాద్: మండలంలోని దేవర్‌ఫస్లావాద్ గ్రామంలో భాజపా ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామస్థులకు సహపంక్తి భోజన కార్యక్రమం చేపట్టారు. కులమత బేధాలు లేకుండా సమాజంలో అంతా సమానమనే భావనతో నూతన సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు కూరవెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మదన్, నర్సింహులు, సతీశ్, బాబయ్య, సుమిత్రమ్మ, లక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసి వీఆర్‌ఓ సంఘ నేతలు

గన్‌ఫౌండ్రి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

మెరిసిన ప్రఫుల్

EENADU CHAMPION CRICKET CUP

☛ శ్రేయస్ కళాశాల ముందంజ ☛ స్ప్రైట్ ఈసీసీ కప్- 2017

ఈనాడు, హైదరాబాద్: సాయి ప్రఫుల్ (65 నాటౌట్; 38 బంతుల్లో 7x4, 1x6) రాణించడంతో స్ప్రైట్ ఈనాడు ఛాంపియన్ క్రికెట్ (ఈసీసీ) కప్-2017లో శ్రేయస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ముందంజ వేసింది. సోమవారం డానియెల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో శ్రేయస్ కళాశాల 36 పరుగుల ఆధిక్యంతో వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రేయస్ జట్టు 10 ఓవర్లలో ఒక వికెట్‌కు 107 పరుగులు చేసింది. బదులుగా వివేకానంద కళాశాల 10 ఓవర్లలో 4 వికెట్లకు 71 పరుగులే చేయగలిగింది. వేద డిగ్రీ కళాశాలకు వాకోవర్ లభించింది.



ఆదిల్ (3/5)

Supported by

సతీశ్, నవీన్ విజృంభణ: సతీశ్ (4/4), నవీన్ (3/3) విజృంభించడంతో డానియెల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 89 పరుగుల ఆధిక్యంతో సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కళాశాలపై పైచేయి సాధించింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ కళాశాల 10 ఓవర్లలో 3 వికెట్లకు 103 పరుగులు చేసింది. విశాల్ (42; 24 బంతుల్లో 4x4) ప్రతిభ కనబరిచాడు. అనంతరం సిద్ధార్థ కళాశాల 8.1 ఓవర్లలో 9 వికెట్లకు 14 పరుగులే చేసింది. సతీశ్, నవీన్ 7 వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు.

సాయికుమార్ ఆల్‌రౌండ్ నైపుణ్యం: సాయికుమార్ (50; 23 బంతుల్లో 5x4, 3x6) ఆల్‌రౌండ్ నైపుణ్యం కనబరచడంతో ప్రసాద్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 55 పరుగుల ఆధిక్యంతో మహాత్మ గాంధీ లా కళాశాలపై గెలుపొందింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన గురునానక్ కళాశాల 10 ఓవర్లలో 4 వికెట్లకు 110 పరుగులు సాధించింది. బదులుగా మహాత్మ గాంధీ కళాశాల 10 ఓవర్లలో 6 వికెట్లకు 55 పరుగులు చేసింది. సాయికుమార్ (2/2) బౌలింగ్‌లోనూ రాణించాడు.



సాయి ప్రఫుల్ (65 నాటౌట్)

Title Sponsor: Sprite | Main Sponsor: NARAYANA EDUCATIONAL INSTITUTIONS | Associate Sponsor: SRM Institute of Science and Technology | Health Partner: Endura MASS | Driven by: Hero | Medical Partner: MaxCure Hospitals | Online Associate: eeYuva | TV Partner: ETV తెలంగాణ | Organised by: EENADU The Largest Circulated Telugu Daily

★ సీనియర్స్: ★ ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్: 63/6 (సాయినాథ్ 13, పార్థసాయి 11, అభిలాష్ 2/17, సాయికుమార్ 2/15, రవినాయక్ 2/13), **అరోరాస్ సైంటిఫిక్ టెక్నలాజికల్ రీసర్చ్ అకాడమీ:** 66/0 (సాయికుమార్ 24, అభిలాష్ 26), **★ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ:** 71/8 (అభిలాష్‌కుమార్ 18, సాయివర్ధన్ 2/17, సాయికిరణ్ 2/9, రుఫుస్ 2/15), **సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల:** 46 (ధన్‌రాజ్ 14, ఆదిల్ 3/5, రవిచంద్ర 2/14, నవీన్ 2/3), **★ లయోలా అకాడమీ:** 101/6 (సంజయ్ 29, మైకెల్ 16, కార్తీక్‌రెడ్డి 15, అశోక్ 3/18, సామంత్ 1/22, అఖిల్ 1/16), **మహాత్మ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ:** 89/2 (మనీష్ 39, అభిలాష్ 19, కార్తీక్ 1/7, అన్వర్ 1/11), **★ జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్:** 93/5 (ప్రణీత్ 17, హేమంత్ 12 నాటౌట్, వినీత్ 11), **శ్రీదత్త గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్:** 69 (రోహిత్ 19, కిరణ్ 2/8, వినీత్ 2/7, సచిన్ 2/12), **★ శ్రీచైతన్య క్యాంపస్:** 50/6 (గంగేష్ 13, హరేందర్ 2/12), **శ్రీదత్త ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్:** 51/3 (శివుడు 24 నాటౌట్, రిజ్వాన్ 2/10), **★ అవంతి కళాశాల:** 67/5 (బీర్‌బల్ 21, సల్మాన్ 16, విష్ణు 2/9), **ఓయూ కాలేజ్ ఆఫ్ లా:** 64 (దేబాంషు 19, పాండు 3/8, సల్మాన్ 3/9), **★ స్ఫూర్తి డిగ్రీ కళాశాల:** 97/7 (వరుణ్‌రెడ్డి 15, సందీప్ 14, నిసార్ 2/15, రవితేజ 2/18), **ఐఎస్ఓ డిగ్రీ కళాశాల:** 71/6 (రవితేజ 23, వరుణ్‌రెడ్డి 2/16), **★ గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ:** 110/4 (సాయికుమార్ 50, అక్షయ్ 15, భరతేందు 10, వినాయక్‌రావు 1/28), **మహాత్మ గాంధీ లా కళాశాల:** 55/6 (అల్తాఫ్ 12, మోహనకృష్ణ 11 నాటౌట్, సాయికుమార్ 2/2, రాహుల్ 1/3), **★ భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ:** 103/3 (విశాల్ 42, నవీన్ 29, సాయికుమార్ 1/22), **సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కళాశాల:** 14/9 (సతీశ్ 4/4, నవీన్ 3/3, సాయికిరణ్ 1/0), **★ శ్రేయస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్:** 107/1 (సాయి ప్రఫుల్ 65 నాటౌట్, చైతన్య 18, నరేశ్‌యాదవ్ 1/15), **వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల:** 71/4 (ఫణీంద్ర 18 నాటౌట్, రంజిత్ 1/3, విజయ్‌కాంత్ 1/7), **★ అర్జున్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్:** 55/3 (రాజు 19 నాటౌట్, భరత్ 1/3), **వెస్లీ పీజీ కళాశాల:** 56/3 (అక్షయ్ 27 నాటౌట్, ప్రవీణ్ 2/14)



శ్రేయస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ జట్టు గెలుపు సంబరం



వెస్లీ పీజీ కళాశాల విజయోత్సాహం

మందుబాబులకు ఉస్మానియాలో పరీక్షలు

ఉస్మానియా ఆసుపత్రి: నూతన సంవత్సర వేడుకల్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మందుబాబులకు ఉస్మానియాలో వైద్య పరీక్షలు నిర్వహించారు. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ 'డ్రంకన్ డ్రైవ్' తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన వారు శ్వాస విశ్లేషణ పరీక్షలకు సహకరించకుండా హంగామా సృష్టించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు సుమారు 30 మంది మందుబాబులను ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున 4గంటల వరకూ ఉస్మానియాలోని అత్యవసర చికిత్సా విభాగానికి తరలించారు. మద్యం సేవించిన మైకంలో మందుబాబులు అరుపులు, కేకలు వేస్తుండటంతో ఈ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు ఆందోళనకు గురయ్యారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: సమాజానికి సేవలందిస్తున్న మ్యారేజ్ బ్యూరోల నిర్వాహకులపై ప్రభుత్వం, పోలీసులు కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం సరికాదని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ నార్ల భారతలక్ష్మి అన్నారు. కొన్ని మ్యారేజ్‌బ్యూరోల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ పేరిట డబ్బులు తీసుకుని సంబంధాలను కుదర్చడంలేదని ఫిర్యాదులు వస్తుండడంతో విచారకరమన్నారు. అందరూ అలా ఉండరని అన్నారు. సోమవారం సుందరయ్య కళానిలయంలో ఆ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడో ఏదో మ్యారేజ్ బ్యూరో వాళ్లు చేసిన అపకీర్తిని అందరికి ఆపాదించొద్దన్నారు. ఈ వృత్తిలో చిత్తశుద్ధితో పనిచేసే వారు ఉన్నారన్నారు. ప్రభుత్వం ఈ వృత్తిని గుర్తించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

2 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఈ నెల 2 నుంచి చీకట్లబండ తండాలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు అఖిల భారత బంజార సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు రవీంద్రనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ని ఎంపిక చేస్తారని అన్నారు. ఆసక్తి గల జట్లు 9959958530లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

జిల్లా పోలీసు అధికారిణి అన్నపూర్ణ



ఎస్పీ అన్నపూర్ణ, ఏఎస్పీ నర్సింలుకు శుభాకాంక్షలు చెబుతున్న పోలీసులు

వికారాబాద్, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా పోలీసు అధికారిణి అన్నపూర్ణ తెలిపారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలుపడానికి వచ్చిన పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నూతన సంవత్సరంలో ప్రతి పోలీసు అధికారి శాంతి భద్రతల పరిరక్షణకు లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై స్నేహపూర్వక పోలీసంగ్‌ను అమలు చేయాలని చెప్పారు. బాధితులకు సత్వర న్యాయం అందించి, ప్రజల్లో మంచి పేరు, ప్రతిష్ఠలు తెచ్చుకోవాలన్నారు. సమర్థంగా విధులు నిర్వహించే పోలీసుల పనితీరును గుర్తించి తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కోసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా పోలీసు అధికారి పరమాల నర్సింలు, వికారాబాద్, ధారూర్, మోమిన్‌పేట, మహిళా పోలీస్‌ఠాణా సీఐలు మాగంటి వెంకటరామయ్య, ఉపేందర్‌రావు, బుర్రి శ్రీనివాస్, నిర్మల, ఎస్ఐలు ప్రణయ్‌కుమార్, రవికుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిస్తే అక్రమం... నిలిపేస్తే గగ్గోలు

(మొదటిపేజీ తరువాయి) అనుమతిచ్చారు. గుత్తేదారులు దర్జాగా ట్రాక్టర్లతో కాగ్నా నదికి వెళ్లగానే గుర్తించిన గ్రామస్థులు వెంటనే అడ్డుకొని ట్రాక్టర్లను వెనక్కి పంపించారు. కాగ్నా పరిసరాల్లోని పట్టా భూముల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు తమ ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తే భూగర్భజలాలు తగ్గిపోతాయని, ఈ తరలింపును నిలిపివేయాలంటూ రైతులంతా కలిసి గతంలో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. అప్పట్లో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలతో 15 సంవత్సరాలుగా వీర్‌శెట్టిపల్లి కాగ్నా నది నుంచి ఇసుక తరలించడం నిలిచిపోయింది. తాజాగా అధికారులు అనుమతులు జారీ చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇసుక తరలించనీయబోమంటూ స్పష్టం చేస్తున్నారు. వారి నిర్ణయంతో గుత్తేదారులు లబోదిబోమంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచన మేరకు వీర్‌శెట్టిపల్లి నుంచి ఇసుక తరలించేందుకు అనుమతిపత్రాలకు రెండు, మూడు వారాలు తిరగాల్సి వచ్చిందని, ఇరవై ట్రిప్పులకు రూ.36 వేల చొప్పున డీడీలు చెల్లించామని, చివరకు గ్రామస్థులు అడ్డుకోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఇకపై ఖాంజాపూర్ నుంచి తీసుకెళ్లాలని సూచించారని, మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగలేమంటూ కొందరు గుత్తేదారులు కరీంనగర్ నుంచి లారీల్లో వస్తున్న ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం వీర్‌శెట్టిపల్లి అనుమతి పత్రాలతో పాతతాండూరు నుంచి ఇసుక పొందుతున్నారు.

మరింత అప్రమత్తంగా ఉంటాం

–ధనుంజయ, ఉపతహసీల్దారు, తాండూరు

ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను పొందేందుకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1,800 చొప్పున డీడీ చెల్లిస్తే అనుమతులు ఇస్తున్నాం. వీర్‌శెట్టిపల్లి కాగ్నా నుంచి ఇసుక తరలించేందుకు గుత్తేదారులు ఆర్డీఓకు దరఖాస్తు చేయడంతో అనుమతులు జారీచేశాం. వారు వద్దనుకుంటే పాతతాండూరు, ఖాంజాపూర్‌ల నుంచి ఇసుక పొందేందుకు ఆర్డీఓ ఆదేశాల ప్రకారం మళ్లీ అనుమతులు ఇస్తాం. ఇసుక తరలింపు పర్యవేక్షణ విధులకు ఒక వీఆర్‌ఓను నియమించి నిఘా ఏర్పాటు చేశాం. మరింత అప్రమత్తంగా ఉంటాం.

సంబరం... అంతటా ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి) వంటి సంఘటనలు లేకుండా జాగ్రత్తలు పడ్డారు. ప్రధానంగా తాండూరులో ఇటీవల కాలంలో గొడవలు జరుగుతుండటంతో వాటి ప్రభావం నూతన సంవత్సర వేడుకలపై కనిపిస్తుందేమోనని పోలీసులు నిఘా పెంచారు. ఫలితంగా అంతా ప్రశాంతంగా ముగిసింది. దీంతో జిల్లా ఎస్పీ అన్నపూర్ణ తమ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పూల బొకేలు, బహుమతులకు బదులుగా పేదలు, రోగులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ, ఇంకా ఇతర ఉన్నతాధికారులు సూచించారు. ఆమేరకు పోలీసు సిబ్బంది సోమవారం తమతమ కార్యాలయాల పరిధిలోని ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. తాండూరులోని అనాథ ఆశ్రమంలో చిన్నారుల మధ్య కేక్‌ను కోశారు. వారిని ఆప్యాయంగా ఎత్తుకుని మిఠాయిలు తినిపించారు.


కోట్‌పల్లి చెరువులో ఈత కొడుతున్న పర్యాటకులు


నీటిలో మునిగిన యువకుడిని ఒడ్డుకు తీసుకొస్తున్న బోటింగ్ సిబ్బంది

కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి

ధారూర్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా కోట్‌పల్లి ప్రాజెక్టుకు సోమవారం పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో తరలి వచ్చారు. నూతన సంవత్సరం, సెలువురోజు కావడంతో పరిసర ప్రాంతాలనుండే కాకుండా హైదరాబాద్, కర్ణాటక నుంచి పర్యాటకులు వచ్చారు. టూరిస్టు బస్సులతో పాటు, సొంత వాహనాలు పరిసరాల్లో కిక్కిరిసి పోయాయి. పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటు చేయడంతో రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. పర్యాటకులతో ప్రాజెక్టు బోటింగ్ చేశారు. పరిసరాల్లో తమకు ఇష్టమైన వంటకాలను చేసుకొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. పరిసరాల్లో వివిధ రకాల దుకాణాలు విరివిగా వెలిశాయి. కుటుంబ సమేతంగా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పలువురు పర్యాటకులు చెరువు నీటిలో సరదాగా ఈతలు కొడుతూ సందడి చేశారు. ప్రాజెక్టు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పహరా కాస్తున్నారు. పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టు సమీపంలో మొబైల్ టాయిలెట్‌ను ఏర్పాటు చేశారు.

★ ఓ పర్యాటకుడు చెరువు నీటిలో మునిగిపోతుండగా గమనించిన బోటింగ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై బోటింగ్ సహాయంతో అతని దగ్గరకు చేరుకొని అతన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. సిబ్బంది అప్రమత్తంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు.


చెరువు పరిసరాల్లో పర్యాటకులు

బ్యాంకులో చోరీకి విఫల యత్నం

రాగన్నగూడ(తుర్కయాంజాల్): దుండగులు బ్యాంకులో చోరీకి యత్నించి విఫలమయ్యారు. బ్యాంకు స్ట్రాంగ్ రూం వెనకవైపున గోడకు కన్నం వేసి చోరీకి ప్రయత్నించిన సంఘటన ఆదిభట్ల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్నగూడ వద్ద ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు ఆదివారం అర్ధరాత్రి ముగ్గురు దుండగులు వచ్చి వాచ్‌మెన్ నాగయ్యను చంపుతామని బెదిరించారు. ఇద్దరు దుండగులు వాచ్‌మెన్‌ను భవనంపైకి తీసుకెళ్లగా.. మరో దుండగుడు బ్యాంకు లాకర్ గది (స్ట్రాంగ్ రూం) వెనకాల ఉన్న గోడను సుత్తి, గడ్డపారతో పగులగొట్టి కన్నం వేశాడు. లోనికి ప్రవేశించిన దుండగుడు లాకర్‌ను సుత్తితో కొట్టి తెరిచే ప్రయత్నం చేశాడు. లాకర్ తెరుచుకోకపోవడంతో అక్కడనుంచి వెళ్లిపోయారు. సోమవారం వాచ్‌మెన్ ఇచ్చిన సమాచారం మేరకు బ్యాంకు అధికారులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. దుండగుడు ఒక్కడే బ్యాంకులోకి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ సాయంతో వివరాలు సేకరించారు. ముగ్గురు దుండగులు ముసుగులు ధరించి వచ్చినట్లు వాచ్‌మెన్ పోలీసులకు వివరించారు. బ్యాంకులో ఖాతాదారుల సొమ్ము క్షేమంగా ఉండడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. బ్యాంకు డివిజినల్ మేనేజర్ కరుణాకర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీరామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో అర్జీలు!

(మొదటిపేజీ తరువాయి) పరిస్థితి ఏమిటి అన్నది నెలలు గడుస్తున్నా అర్జీదారులకు చెప్పడంలేదు. - ఇలాంటి విన్నపాలకే కాదు ప్రజావాణితో పాటు వివిధ శాఖలకు అందే అర్జీలన్నింటికీ తగిన సమాచారం ఉండటం లేదు. దీంతో దరఖాస్తు దారులకు నిరాశ తప్పడంలేదు.

అన్నింటికీ చెక్

ఇక మీదట ఇలాంటి సమస్యలకు తావుండదు. నూతన సంవత్సరంలో ప్రభుత్వం సాంకేతిక సహాయాన్ని అందుకుని సమస్యల పరిష్కారానికి సమాయాత్తమవుతోంది. అర్జీదారులకు వాటి పురోగతి ఎలా ఉంది? పరిష్కారానికి అర్హమైందా? కాదా? అయితే ఎప్పటిలోగా పరిష్కారం లభిస్తుంది? ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉంది తదితర విషయాలన్నింటినీ దరఖాస్తుదారులకు వెంటనే ఎప్పటికప్పుడు వివరిస్తుంది. దీని వల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా విధులను నిర్వహించడంతో పాటు అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకోక తప్పదు. ఫలితంగా ప్రజలకు తొందరగా ప్రయోజనం కలుగుతుంది.

ఎలాగంటే...

జిల్లాలో 18 మండలాలు, తాండూరు, కొడంగల్, పరిగి, వికారాబాద్ నియోజక వర్గాలున్నాయి. మొత్తం 367 పంచాయతీలున్నాయి. దాదాపుగా వారం వారం మండల కేంద్రంలో ప్రజావాణి, ప్రజాదర్బార్ నిర్వహిస్తుంటారు. ఇక్కడకు వచ్చే ప్రజలు తమ సమస్యలపై వినతులు అందిస్తుంటారు. ఇదంతా చాలా కాలంగా జరుగుతున్న ప్రక్రియ. అయితే తాజాగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అర్జీదారులను తిప్పుకోకుండా సులభంగా, వేగంగా అనుమతులను జారీ చేసేందుకు ప్రవేశ పెట్టిన రాష్ట్ర పారిశ్రామిక అనుమతుల స్వీయ ధ్రువీకరణ విధానం (టీఎస్ ఐపాస్) విజయవంతమైంది. దీంతో ఈ మార్గదర్శకాలను ఇతర అన్ని శాఖలకు అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ప్రభుత్వ విభాగంలోని వివిధ శాఖలలో ఈ తరహా కార్యాచరణను రూపొందించి అర్జీలు, దస్త్రాల పరిష్కారానికి సిద్ధం కావాలని నిర్ణయించింది. ఆయా శాఖలకు సహాయ కేంద్రం, అన్‌లైన్ వినతుల స్వీకరణ, వాటి పరిష్కారానికి కాలవ్యవధిని నిర్ణయించడం వంటి వాటిని ఈ కొత్త సంవత్సరంలో అమలు చేయనుంది.

సీఎం చొరవతో....

ఇటీవల పరిపాలన అంశాలపై నిర్వహించిన సమీక్షలో సమస్యలన్నీ ఆయన దృష్టికి వచ్చాయి. ప్రజలు ఇచ్చే అర్జీలకు జాప్యం జరగరాదన్న నిర్ణయానికి వచ్చారు. దీంతో పరిశ్రమల శాఖలో అమలు చేస్తున్న టీఎస్‌ఐపాస్ తరహాను అన్ని శాఖల్లో అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విధానం అమలైతే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈమేరకు అర్జీలకు వెబ్‌సైట్ ఏర్పాటు చేయడంతో అర్జీలను మెయిల్, ఫోన్‌లో లేదా స్వయంగా కలసి ఇవ్వవచ్చు. అనంతరం వీటిని పరిశీలించే అధికారులు అందినట్లు సమాచారాన్ని పంపి ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? అన్న సమాచారాన్ని ఇస్తారు.

క్రమశిక్షణ చర్యలూ ఉంటాయి

ఈ విధానం అమలు చేయడంలో అధికారులు ఏ స్థాయిలో అయినా నిర్లక్ష్యం చూపినా, పట్టించుకపోయినా, విధి నిర్వహణలో అలసత్వం వహించినట్లు తేలినా క్రమశిక్షణ చర్యలతో పాటు జరిమానాలను ప్రభుత్వం విధిస్తుంది.

వెంటనే అమలు చేయాలి

– భరత్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ నేత, కుల్కచర్ల



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగ అర్జీల పరిష్కారానికి ఆన్‌లైన్ విధానాన్ని అన్ని శాఖల్లోను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుండం మంచి మంచి పరిణామమే. ప్రజావాణితో పాటు ఇతరత్ర శాఖల్లో వినతులను ఇవ్వడం, ఆ తరవాత అవి ఏ దశలో ఉన్నాయో తెలియని పరిస్థితి ఉంది. టీఎస్‌ఐపాస్ తరహా విధానం అమలుకు ముందుకు రావడం ప్రయోజనకరం.

3 నుంచి ప్రత్యేక యోగ శిబిరం

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 9 వరకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగ సమితి అధ్యక్ష కార్యదర్శులు అనంతయ్య, వీరేశంలు తెలిపారు. పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో యోగ శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం, సాయంత్రం పురుషులకు, స్త్రీలకు యోగ శిక్షణ ఇస్తారని తెలిపారు. హరిద్వార్‌లో శిక్షణ పొందిన వారి చేత యోగ శిక్షణ ఇవ్వనున్నారన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, స్థూలకాయం ఆస్తమా లాంటి దీర్ఘకాలిక రోగాలకు యోగ ద్వారా చక్కటి పరిష్కారం లభిస్తుందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పసుపు పంట పండింది..!!



సాగులో నున్నప్పటి పసుపుతోట

సేంద్రియ విధానంతో పసుపు సాగు చేస్తున్న ఓ యువ రైతు తక్కువ సమయంలో అత్యధిక దిగుబడి సాధించి అబ్బురపరుస్తున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ఈ ఘనత సాధించారు. ఆయన పంట పండించిన తీరుతెన్నులపై 'న్యూస్‌టుడే' కథనం.

● ఎకరానికి 50 క్వింటాళ్ల దిగుబడి ● తక్కువ కాలంలో చేతికొచ్చిన తీరు

● సేంద్రియ సేద్యంతో యువరైతు విజయం

న్యూస్‌టుడే, మోమిన్‌పేట

మోమిన్‌పేట మండలంలోని కొత్త కోల్కుంద గ్రామానికి చెందిన కర్ణం లక్ష్మీనారాయణ కుటుంబం పూర్తిగా వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు తమ కుమారుడిని మంచి చదువులు చదివించాలని భావించారు. అందుకు అనుగుణంగా లక్ష్మీనారాయణ బీకాం, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. వ్యవసాయమంటే మక్కువతో పంటలను పండిస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. పిన్న వయసులోనే మేకవనంపల్లి సహకార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైనా సొంతంగా సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని క్షేత్రస్థాయిలో నిరూపించారు.

తక్కువ కాలంలో పంట తీత...: సాధారణంగా పసుపు పంట చేతికి రావాలంటే జూన్‌లో విత్తనం విత్తుకుంటే ఫిబ్రవరి నెలలో దిగుబడి వస్తుంది. అయితే లక్ష్మీనారాయణ పొలంలో డిసెంబరు నెలలోనే పంట చేతికి వచ్చింది. సాధారణంగా జిల్లాలో పసుపు విత్తనం వేస్తే పంట బాగా పండితే ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. అలాంటిది రెట్టింపు పైన దిగుబడి వచ్చింది. పంట తొందరగా చేతికి రావడంతో పొలాన్ని శుభ్రం చేసి ఉల్లి పంట సాగుచేయడానికి సిద్ధం చేసుకున్నారు. దీంతో పసుపు వేస్తే ఏడాది ఒక పంటే అనే అపోహ తొలగిపోయినట్లయింది. ఒకే సంవత్సరంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం లభించింది.

పొలాన్ని పరిశీలించిన నాటి పాలనాధికారిణి

సేంద్రియ ఎరువులతో పంటను పసుపు సాగు చేస్తున్నారని తెలుసుకున్న నాటి జిల్లా పాలనాధికారిణి దివ్య కొన్ని నెలల క్రితం పొలాన్ని పరిశీలించారు. సేంద్రియ ఎరువులతో సాగు బాగుందని అభినందించారు. మిగిలిన రైతులు సంప్రదాయ సాగుకు మారాలని సూచించారు.



పంట పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివ్య (పాత చిత్రం)

మిగిలిన రైతులకు విత్తనం అందిస్తా

– లక్ష్మీనారాయణ, రైతు

ఈ ఏడాది వచ్చిన దిగుబడిలో అధిక శాతం మళ్లీ విత్తనంగా వాడాలని భావిస్తున్నారు. కనీసం పది ఎకరాల్లో పసుపు విత్తనం తయారు చేసి తోటి రైతులకు ఇవ్వాలనే ఆలోచన ఉంది. సేంద్రియ ఎరువులతో ఏ పంటలోనైనా అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం వేసినప్పటి నుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఎలాంటి రసాయన ఎరువు వాడకుండా సాగు చేస్తున్నా. సేంద్రియ సాగుపై ప్రభుత్వం మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

తక్కువ విత్తనం.. దిగుబడి అధికం

పసుపు పంటను పండిస్తే దిగుబడి తక్కువగా వస్తుంది. ధరలు అనుకున్న స్థాయిలో ఉండవు, సంవత్సరానికి ఒకటే పంట పండుతుంది. ఇలాంటి చాలా ఇబ్బందులు పసుపు రైతులు చెబుతుంటారు. అయితే పసుపు పంటలో దిగుబడి పెంచాలనే ఆలోచనతో గత సంవత్సరం విజయవాడలోని ఓ రైతు వద్ద మేలు రకం 'ప్రగతి' విత్తనాన్ని మూడు క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఆ విత్తనాన్ని పొలంలో నాటారు. పండిన పంటను విక్రయించకుండా ఈ సంవత్సరం ఒక ఎకరం పొలంలో విత్తనంగా వేసి సాగు చేశారు. సాగుకు ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులను మాత్రమే వాడారు. అబ్బురపరిచేలా ఎకరం పొలంలో 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.



పసుపు పంటను చూపిస్తున్న లక్ష్మీనారాయణ

2018.. ఆశల పల్లకి..!

● కొత్త ఏడాదిలో పట్టాలెక్కనున్న పలు పథకాలు

● సంక్షేమం, సౌకర్యాల కల్పనవైపు అడుగులు

2017. ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సాఫీగా సాగిపోయింది. వ్యవసాయ ఆధారిత జిల్లాలో అన్నదాతలకు గడిచిన ఏడాది లాభాలు చేర్చికూర్చింది. మిగిలిన రంగాలు ప్రగతి వైపు అడుగులు వేశాయి. పలు సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పనకు శిలాఫలకాలు పడ్డాయి. అవన్నీ 2018లో సాకారం అవుతాయని జిల్లా వాసులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఏడాదిలో అందుబాటులోకి రానున్న పలు పథకాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్

పెట్టుబడికి భరోసా..



పంట తీస్తున్న రైతు

వ్యవసాయానికి పెట్టుబడులు లేక రైతులు ఏటా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించి పంటలకు కనీసం పెట్టుబడి రావడం లేదు. దీంతో అప్పులు తీరలేక కుటుంబం గడవక రైతన్నలు కష్టాల్లో కూరకుపోతున్నారు. దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నా రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదుగు బొదుగు లేకుండా ఉంటున్నారు. వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రధాన సమస్య పెట్టుబడి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రెండు పంటలకు ఈ ఏడాది వానాకాలం నుంచి ఎకరానికి రూ.4వేలు రెండు పంటకు రూ.8 వేలు చొప్పున ఇచ్చేందుకు నిర్ణయించారు. జిల్లాలో 1.94 వేల హెక్టార్లల్లో భూమి విస్తీర్ణం ఉండగా, రైతులు 1.72 లక్షలు ఉన్నారు. ప్రభుత్వం అందించనున్న పెట్టుబడి కోసం జిల్లా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కోరుతున్నారు.

అప్పులు బాధ తీరుతుంది

రాజు, రైతు, చంద్రాయాన్‌పల్లి

పంట పెట్టుబడి కింద ఎకరాకు రూ. నాలుగు వేలు ఇచ్చేందుకు తీసుకున్న నిర్ణయంతో మేలు జరుగుతుంది. పంట కాలం వచ్చిందంటే అప్పుల కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఈ సంవత్సరం నుంచి పంట పెట్టుబడి ఇస్తుండటంతో ఇతరుల వద్ద నగదు తీసుకునే ఇబ్బంది తప్పనుంది.

సొంతింటి కోసం..



ప్రారంభమైన రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణం

నిరుపేదలకు అద్దె ఇంటి కష్టాలు తీర్చేందుకు ప్రారంభించిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ఈ ఏడాది పూర్తవుతుందని తమ చేతికి సొంతింటి తాళాలు అందుతాయని జిల్లాని పేదలు ఆశిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాకు మొదటి విడతగా 1,960 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో వికారాబాద్ నియోజకవర్గానికి 400, తాండూరుకు 1000, పరిగికి 240, కొడంగల్‌కు 240 ఇళ్లు కేటాయించారు. ఈ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఆ నిధులు సరిపోవంటూ గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రాష్ట్ర రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి చొరవ చూపడంతో ఇటీవల కొందరు గుత్తేదారులు ముందుకు వచ్చారు. వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట, టేకులపల్లి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. తాండూరులోని కోకట్, పరిగి మండలం అడవి వెంకటాపూర్ పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ పట్టణం రాజీవ్‌గృహకల్ప వద్ద 160 ఇళ్లకు భూమి పూజ చేశారు. కొడంగల్‌లో ఇంకా ఈ పథకం పట్టాలెక్కలేదు. ఒక్కో ఇల్లు నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.30 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అంతేకాకుండా రెండో విడతగా జిల్లాకు మరో 3,780 ఇళ్లను సైతం సర్కారు మంజూరు చేసింది. ఈ ఇళ్లన్నీ ఈ ఏడాది పూర్తవుతాయని తమకో గూడు దొరుకుతుందని జిల్లాలోని పేదలు ఎదురుచూస్తున్నారు.

గుత్తేదారులు మందుకు రావాల్సి ఉంది

– మనోహర్, డీఈ, పంచాయతీరాజ్

ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవని గుత్తేదారులు ముందుకు రావడం లేదు. తాండూరు, మోమిన్‌పేటలో రెండు పడకల గదులు ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కొత్త సంవత్సరంలో ఇళ్లు నిర్మించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తారని ఆశిస్తున్నాం.

24 గంటల విద్యుత్తు




వ్యవసాయం బాగుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించిన ప్రభుత్వం సాగుకు నిరంతర విద్యుత్తు సరఫరా డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి ప్రారంభించింది. ఒకప్పుడు వేళాపాళా లేని విద్యుత్తు కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అర్ధరాత్రి విద్యుత్తుతో పొలాల్లో కాలం గడిపిన రోజులు గుర్తు తెచ్చుకుంటున్నారు. అర్ధరాత్రి విద్యుత్తుకు బలైనవారు ఎంతోమంది ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్తు అందించింది. ప్రస్తుతం నిరంతం విద్యుత్తు సరఫరా చేస్తోంది. దీంతో ఏ సమయంలోనైనా పొలానికి వెళ్లి పనులు చేసుకునే అవకాశం రైతులకు కలగనుంది. జిల్లాలో మొత్తం విద్యుత్తు కనెక్షన్లు 55,061 ఉన్నాయి. అందులో వ్యవసాయ కనెక్షన్లు వికారాబాద్‌లో 14,673, తాండూరులో 10,138, పరిగిలో 16,438, కొడంగల్‌లో 10,487 ఉన్నాయి. వీరందరికీ లబ్ధిచేకూరనుంది. అయితే నిరంతర విద్యుత్తు వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను అధిగమించాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా భూగర్భ జలాలు కాపాడుకోవడం పెద్ద సమస్యగా మారనుంది. రైతులు ఆటోస్టార్టర్లు తొలగించాలని ఇప్పటికే పలుసార్లు అవగాహన కల్పించారు. ఈ ఏడాదంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంత విద్యుత్తు అందుతుందని జిల్లాలోని రైతులు ఆశిస్తున్నారు.

ఆటో స్టార్లు తొలగించాలి

జానకీరాం, ఎస్ఈ, విద్యుత్తు శాఖ

24 గంటల విద్యుత్తు సరఫరా ప్రారంభమైంది. రైతులు పొలాల వద్ద ఆటో స్టార్టర్లు తొలగించుకోవాలి. అవసరం మేరకు విద్యుత్తును వినియోగించుకోవడం ద్వారా విద్యుత్తు పొదుపుతో పాటు భూగర్భజలాలు వృథా కాకుండా ఉంటాయి. రైతులు అవసరమైనవారు కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు తీసుకోవాలి.

ఇంటింటికీ నీరు..




మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణం

తాగు నీరు కోసం ఏ ఆడబిడ్డ సుదూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి రాకూడదని భావించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామంలో, పట్టణంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుక 'మిషన్ భగీరథ' పథకాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ నల్లా ద్వారా స్వచ్ఛమైన తాగునీరును అందించిన తర్వాతే ఓట్లు అడుగుతానంటూ హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ ఈ పనులు జిల్లాలో శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో కొత్త ఏడాదిలో ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు నల్లాల ద్వారా అందుతుందని జిల్లా వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 18 మండలాలు, 501 రెవెన్యూ గ్రామాలు, 367 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 9,45,561 జనాభా ఉంది. ఇందులో పట్టణ జనాభా 1,18,258 కాగా, 8,27,303 మంది గ్రామీణులు. జిల్లాకు శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా మిషన్ భగీరథ పథకం కింద నీరును అందించేందుకు ప్రభుత్వం రూ.378.50 కోట్లు మంజూరు చేసింది. పథకంలో భాగంగా 882 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. నీటి సరఫరా కోసం ప్రధాన పైపులు 2440 కిలోమీటర్ల మేర వేస్తున్నారు. గ్రామాలను అనుసంధానం 4,452 కిలోమీటర్లు మేర వివిధ పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన పైపులైన్, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చురుగ్గా కొనసాగుతోంది. పరిగిలోని రాఘవాపూర్ మండలంలో 135 ఎంఎల్‌డీ నీటి సామర్థ్యం గల ట్యాంకు ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి జనవరి నాటికి భగీరథ నీరు ఇంటింటికీ చేరాల్సి ఉన్నా పనులు పూర్తికాపోవడంతో గడువు మరో రెండు నెలలు పొడిగించారు. త్వరలోనే ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో తాగునీటి సమస్యలకు తెరపడనుంది.

ఆమెకు భరోసా

త్వరలో జిల్లాలో ఏర్పాటు ▫ నిర్భయ నిధుల వినియోగం

న్యూస్‌టుడే, వికారాబాద్




జాతీయ నేర పరిశోధన సంస్థ గణాంకాలను పరిశీలిస్తే దేశంలో మహిళలపై వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. పని చేసే ప్రదేశంలోనే కాదు.. ఇంటా, బయట మహిళలు వివిధ రూపాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. దేశ రాజధాని దిల్లీలో చోటు చేసుకున్న నిర్భయ ఘటన అనంతరం కేంద్ర ప్రభుత్వం వనితల భద్రతకు భరోసా ఇవ్వాలన్న సంకల్పంతో చట్టంలో సవరణలు తీసుకొచ్చింది. మహిళలపై హింసను జాతీయ మానవహక్కుల ఉల్లంఘన కింద పరిగణించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే మహిళల ఆర్థికాభివృద్ధి, రక్షణ, శిశువు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 2013 బడ్జెట్‌లో 'నిర్భయ నిధి' కేటాయించింది. దేశవ్యాప్తంగా వన్ స్టాప్ క్రైసిస్ సెంటర్(ఓఎస్‌సీసీ)ను ప్రారంభించడానికి ఈ నిధులనే వినియోగిస్తోంది. మన దగ్గర ఇవి 'భరోసా' పేరిట ఏర్పాటు కానుంది. రాష్ట్రంలో సైబరాబాద్ తరువాత వికారాబాద్ జిల్లాలోనే భరోసా కేంద్రం ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా పోలీసు యంత్రాంగం చేస్తోంది. ఆ వివరాలను జిల్లా పోలీసు అధికారిణి అన్నపూర్ణ, ఏఎస్పీ పరమాల 'న్యూస్‌టుడే'కు వివరించారు.

సమాజంలో వేధింపులకు గురవుతున్న మహిళలతో పాటు బాలికలకు తోడు నిలువడమే 'భరోసా' కేంద్రం ప్రధాన లక్ష్యం. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడికి వచ్చే బాధితులకు కుటుంబ పరంగా లభించే అన్ని రకాల హక్కుల ప్రకారం రక్షణ కల్పిస్తారు. అంతేకాకుండా వివిధ రకాల సేవలు అందిస్తారు.

అవగాహన కార్యక్రమాలు..

మానసిక క్షోభ, వేదనకు గురైన మహిళల్లోని సామర్థ్యం గుర్తించి జీవితంపై వారికి భరోసా కల్పిస్తారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా కౌన్సిలింగ్ ఇస్తారు. జీవితంలో ఒడిదొడుకులు ఎలా ఎదర్కోవాలో తెలియచేస్తారు.



వైద్యం..

శారీరక హింసలకు గురయ్యే మహిళలకు ఏ విధమైన లోటు రానివ్వకుండా మెరుగైన వైద్య సహాయాన్ని దగ్గరుండి అందిస్తారు. గృహ హింస బారిన పడిన మహిళలకు వారి ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా సహకారం అందిస్తారు.



న్యాయ సలహాలు..

వేధింపులకు గురైన మహిళలకు అవసరమైన చట్టపరమైన, న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇచ్చి ఆదుకుంటారు. తామున్నామన్న భరోసాను కల్పించి బాధితుల తరపున పోరాటం చేస్తారు.

తాత్కాలిక ఆశ్రయం..

ఎలాంటి ఆధారంలేని మహిళలను చేరదీసి వారికి అవసరమైన రక్షణ, తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తారు. అభిరుచిని బట్టి స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ ఇప్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకుంటారు.



ఆర్థిక సహాయం..

భరోసా కేంద్రానికి వచ్చి వారి బాధలు, సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే మహిళలకు రానుపోను రవాణా ఖర్చులు చెల్లిస్తారు. వివిధ సమస్యలపై అవసరమైన న్యాయ సలహాలు పొందడానికి అవసరమైన ఖర్చును భరిస్తారు.

నమ్మకం కల్పించేలా సేవలు..



అన్నపూర్ణ, జిల్లా పోలీసు అధికారిణి

భరోసా కేంద్రం నిర్వహణ బాధితుల్లో నమ్మకం కల్పించేలా ఉంటుంది. వేధింపులకు గురయ్యే మహిళల సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చూస్తాం. భరోసా కేంద్రంలో సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్, హోం గార్డు, కంప్యూటర్ ఆపరేటర్, కానిస్టేబుల్ ఉంటారు. గృహ హింస బాధితులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి న్యాయం పొందేలా చర్యలు తీసుకుంటాం. గొడవ పడిన దంపతులకు వేర్వేరుగా కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో పరివర్తన తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.

లక్ష్యంతో పెంచారు.. లక్షణంగా కాపాడారు



● పాఠశాలల్లో హరితహారం ఫలితాలు

● బడితోటలతో చక్కని ఆహారం

హరిత హారం కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు మొక్కలతో కలకళలాడుతున్నాయి. పాఠశాలల్లో పచ్చదనం పెంచేందుకు మూడు సంవత్సరాలుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రతి గ్రామంలో 40 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి మొక్కలు నాటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఫలితంగా అక్కడ నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

న్యూస్‌టుడే, ధారూర్

ధారూర్ మండల పరిధిలో మొత్తం తొమ్మిది ఉన్నత, ఎనిమిది ప్రాథమికోన్నత, 45 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో అక్కడున్న స్థలాన్ని బట్టి వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రతి మొక్కను విద్యార్థులకు దత్తత ఇచ్చి వాటికి నిత్యం నీరు పోసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. దీంతో విద్యార్థులు చొరవ తీసుకుని ఆయా మొక్కలను కంటికిరెప్పలా చూసుకున్నారు. ఫలితంగా రెండు, మూడు సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు చెట్లుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆయా పాఠశాలలను సందర్శించిన వారు విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తున్నారు.

చెట్ల నీడన పాఠాలు..


ధారూర్ బాలుర ఉన్నత పాఠశాలలో గతంలో పెంచిన మొక్కలు ఇప్పుడు మానులుగా మారి విద్యార్థులకు నీడ ఇస్తున్నాయి. ఈ చెట్ల నీడలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం సైతం చెట్ల నీడనే చేస్తున్నారు. చిన్న చిన్న సమావేశాలు ఇక్కడే నిర్వహించుకుంటున్నారు.

ప్రహరీ లేకున్నా..


జీడిగడ్డ ప్రాథమిక పాఠశాల రహదారి ప్రక్కనే ఉండడంతో విద్యార్థులు, ఇబ్బందులకు గురయ్యేవారు. హరిత హారంలో నాటిన మొక్కలను మూగజీవాలు తినేవి. విద్యార్థులు రోడ్డుపైకి వెళితే ప్రమాదాలు చోటుచేసుకునేవి. దీంతో పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయిస్తే ప్రయోజనం ఉంటుందని భావించిన ఉపాధ్యాయులు ఇనుప కంచెను ప్రహరీలా ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థులతో పాటు మొక్కలకు రక్షణ ఏర్పడింది. విద్యార్థులందరూ ప్రార్థనా సమయం కంటే ముందు మొక్కలకు నీటిని పోయడం అలవాటు చేసుకున్నారు. ఫలితంగా ప్రతి మొక్కా చక్కగా ఎదుగుతోంది.

కూరగాయలు.. ఆకుకూరలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి కూరగాయలతో వడ్డించాలనే ఉద్దేశంతో ఆయా పాఠశాలల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరల మొక్కలు పెంచుతున్నారు. దీంతో విద్యార్థులకు కూరగాయల సాగుపై అవగాహన కలుగుతోంది. అవుసుపల్లి, కుక్కింద, మోమిన్‌కలాన్, గట్టేపల్లి, కాచారం తదితర పాఠశాలల్లో ఉద్యాన శాఖ నుంచి పాలకూర, చిక్కుడు, పుంటి, వంకాయ, టమాట వంటి కూరగాయల విత్తనాలను తెచ్చి విత్తారు. ఇక్కడ పండిన కూరగాయలను, ఆకుకూరలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ చిన్నారులకు క్రమం తప్పకుండా బడికి పంపిస్తున్నారు. ప్రతి పాఠశాల ఇలా శ్రద్ధ తీసుకుంటే విద్యార్థులకు మంచి ఆహారం అందుతుందని పలువురు పేర్కొంటున్నారు.



ధారూర్ ఉన్నత పాఠశాలలో చెట్ల నీడన పాఠాలు



జీడిగడ్డ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ



కదలరు.. మెదలరు!

శారీరక చురుకుదనం తగ్గిపోతున్న చిన్నారి లోకం

సర్వేలో ఏం తేలిందంటే

నగరంలోని పలు విద్యాలయాల్లో 6 నుంచి 10 ఏళ్ల వయసున్న ప్రాథమిక విద్యార్థులపై ఈ సర్వే జరిగింది. 57 శాతం మంది చిన్నారులు సాధారణ బరువులోనే ఉన్నారు. 9.8 శాతం అధిక బరువుతో బాధపడుతుండగా 17 శాతం మంది ఊబకాయులుగా తేలింది. ఇందులో అమ్మాయిలు 66 శాతం సాధారణ బరువుతో ఉండగా.. అబ్బాయిలు 46 శాతం మాత్రమే వయసు, ఎత్తుకు తగ్గ బరువుతో ఉన్నారు. అబ్బాయిల్లో 11 శాతం ఉండాల్సిన బరువుకంటే ఎక్కువ ఉండగా.. 20.3 శాతం ఊబకాయంతో ఉన్నారు. అమ్మాయిల్లో 8.8శాతం మంది బరువు ఎక్కువగా ఉండగా, 14.7శాతం ఊబకాయులున్నారు.

ఈనాడు – హైదరాబాద్

ఇంటి ముందుకే ఆటో వచ్చి పాఠశాలకు పిల్లలను తీసుకెళ్తుంది.. లేదా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు కారులోనో, ద్విచక్రవాహనం పైనో బడికి తీసుకువెళ్లి దింపుతుంటారు.. ఇక విద్యాలయాల్లో ఎక్కడా క్రీడా మైదానాలు ఉండవు. ఒకవేళ ఉన్నా ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి ప్రోత్సాహం కరవు. వెరసి బాల్యం బండబారిపోతోంది. కదలని, మెదలని రీతిలో తయారవుతోంది. ఇలా పెరిగి పెద్దయ్యాక యుక్త వయసులోనే అధిక రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు.. అజీర్తి, ఆయాసం, గ్యాస్ సమస్యలు ఎన్నెన్నో. అధిక బరువు సరేసరి. ఇలా అమ్మాయిలకంటే అబ్బాయిలే ఎక్కువమంది ఊబకాయులుగా మారుతున్నారని జాతీయ పోషకాహార సంస్థ ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు పేర్కొంది. ప్రాథమిక విద్యాదశలోనే అధిక బరువుకు గల కారణాలేమిటో నగరంలోని భవన్స్ వివేకానంద కళాశాల బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన డి.రజని, డా.ఎస్.పద్మ, డా.ఎ.సాయిపద్మ, ఎం.ఉష సర్వే చేసి వివరాలను వెల్లడించారు.



నిద్రించాలంటే 10 దాటాల్సిందే



చిన్నారులకు కంటి నిండా నిద్ర ఉండడంలేదు. వీరు 8 నుంచి 9 గంటలు నిద్రపోవాల్సి ఉండగా కేవలం 6 నుంచి 7 గంటలవరకే పరిమితమవుతున్నారని సర్వేలో వెల్లడైంది. ఇక రాత్రి పది దాటిన తర్వాతే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. పాఠశాలకు సమయం అయిపోతుందని ఉదయం 6 గంటలకే నిద్రలేవడం తప్పనిసరైంది. ఇదే సమయంలో కనీసం ఒక గంట ఆరుబయట ఎండలో ఆడుకోవాల్సి ఉన్నా.. అలాంటి అవకాశమే తమ పిల్లలకు లేదని తల్లిదండ్రులు తెలిపారు. తమ వద్దకంటే పిల్లలు పాఠశాలలోనే ఎక్కువ సమయం ఉంటున్నారని.. వారికివేమీ పట్టడం లేదని వెల్లడించారు. ఇదే సమయంలో అధిక బరువు సమస్యతో ఉన్న పిల్లలు చురుగ్గా మారడానికి ఏం చేయాలో కూడా పాఠశాలల్లో చెప్పడంలేదని తెలిపారు.

ఇవి అవసరం





కార్బోహైడ్రేట్లు, కొవ్వులు వంటివి గింజధాన్యాలు, చిరుధాన్యాలు, వివిధ నూనెలలో ఉంటాయి.

మాంసకృత్తులు: పప్పులు, కాయలు, నూనె గింజలు, పాలు, మాంసం, చేపలు వంటివాటిలో ఉండే పోషక విలువలను అంచనా వేసుకుని పిల్లలకు అందించాలి.

విటమిన్లు: ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు, మాంస పదార్థాలలో..

ఇనుము: ఆకు కూరల్లో ఎక్కువగా ఉంటుంది. విటమిన్-సి ఉండే నారింజ, బత్తాయి, ఉసిరి, జామ, అరటి, టమోటా తీసుకోవాలి.

వయసు వారీగా రోజూ ఆహారంలో అందాల్సినవి

వయసు	బరువు కి.గ్రా	నిరశక్తి కి. కేలరీలు	మాంసకృత్తులు గ్రాముల్లో	కొవ్వు గ్రా.	కాల్షియం మి.గ్రా	ఇనుము మి.గ్రా
4–6	19.0	1690	30	25	400	18
7–9	26.9	1950	41	25	400	26
10–12(బాలురు)	35.4	2190	54	22	600	34
10–12(బాలికలు)	31.5	1970	57	22	600	19

ప్చ్...!

- బాలానగర్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ లేనట్లే
- ప్రతిపాదనను పక్కన పెట్టేసి.. ముందు అనుకున్నట్లుగానే
- జనవరి మొదటివారంలో పునాది పనులు షురూ



ఈనాడు, హైదరాబాద్

డబుల్ డెక్కర్ బస్సును చూశాం. అందులో ప్రయాణిస్తే మస్త్ మజా ఉండేది. ఇక డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌ను కూడా చూస్తామంటూ నగరవాసులు ఖుషీ అయ్యారు. కానీ .. ప్చ్..మన ఆశ.. నిరాశే అయ్యింది. బాలానగర్‌లో సాధ్యం కాదని తేలడంతో హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేసింది. ముందు అనుకున్నట్లుగానే అక్కడ పైవంతెన పనుల్ని పట్టాలెక్కిస్తోంది.

▼ బాలానగర్ జంక్షన్ పేరు చెబితే చాలూ.. అక్కడ ట్రాఫిక్ కష్టాలు గుర్తుకొస్తాయి. ఆ సిగ్నల్ దాటాలంటే ఒక్కోసారి అర గంట, గంట కూడా పడుతుంది. వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఈ తిప్పలను తగ్గించేందుకు అప్పటి ప్రభుత్వం అక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించి.. ఆ బాధ్యతను హెచ్ఎండీఏకు అప్పగించింది. రూ.387 కోట్లతో నర్సాపూర్ చౌరస్తా, ఫతేనగర్ జంక్షన్ల మీదుగా కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి బోయిన్‌పల్లి జంక్షన్ వరకు ఆరు లేన్లతో కూడిన 1.09 కిలోమీటర్ల టూ వే ఫ్లైఓవర్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. రూ.70 కోట్లు పైవంతెనకు మిగిలిన మొత్తాన్ని భూసేకరణ, ఇతరత్రా పనులకు వినియోగించనున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు.

▼ భూసేకరణ బాధ్యతను హెచ్ఎండీఏ జీహెచ్ఎంసీకి అప్పగించింది. ఇందుకు రూ.25 కోట్లను కేటాయించింది. చాలా రోజుల క్రితమే గుత్తేదారును కూడా ఎంపిక చేసింది. ఆగస్టు 21న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమి పూజ కూడా జరిగింది. కానీ భూ సేకరణలో జాప్యం ఫ్లైఓవర్ పాలిట శాపంగా మారింది. ప్రాజెక్టు కోసం 450 ప్రైవేట్ ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఆ ప్రక్రియ ఎప్పటి నుంచో కొనసాగుతూనే ఉంది. దీంతో పనులు మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. పైగా భూసేకరణ భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇలాంటి తరుణంలోనే 'డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్' ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కింద నాలుగు లైన్లు.. పైన నాలుగు లైన్లు నిర్మించాలని యోచించారు.

▼ అసలు బాలానగర్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ సాధ్యమేనా అంటూ క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ అధికారులు ఆరా తీశారు. సాంకేతిక నిపుణులు ప్రాథమికంగా అధ్యయనం చేశారు. ఆ క్రమంలోనే కొన్ని అంశాలు తెరపైకి వచ్చాయి. నిర్మాణ వ్యయం మరో రూ.100 కోట్లు పెరిగే అవకాశముంది. ముందు అనుకున్న పైవంతెన పక్కన 45 మీటర్ల భూమి సేకరించాల్సి ఉంది. అదే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ విషయానికొస్తే 35 మీటర్ల నుంచి 40 మీటర్ల వరకు అవసరమవుతుందని గుర్తించారు. భూసేకరణ వ్యయం పెద్దగా తగ్గడం లేదు. ఆ సాంకేతిక పరిజ్ఞానం మనకు కొత్త కూడా. ఈ నేపథ్యంలోనే 'డబుల్' ప్రతిపాదనను పక్కన పెట్టి.. ముందు అనుకున్నట్లుగానే ఆరు లేన్లతో కూడిన ఫ్లైఓవర్‌ను పట్టాలెక్కించాలని నిర్ణయించారు.

▼ పైవంతెన పనులను హెచ్ఎండీఏ యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఒక్కో సమస్యను అధిగమిస్తూ ముందుకెళ్తోంది. రద్దీ మార్గం కావడంతో పనులు ప్రారంభించిన తర్వాత ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు రాకుండా ఉండేందుకు పక్కాగా చర్యలు తీసుకుంటోంది. రోడ్డు వెడల్పు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతోంది. అత్యాధునిక యంత్రాలను వినియోగించనున్నారు. జనవరి మొదటి వారంలో పునాది పనులు మొదలు పెట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆ భూములు అన్యుల చేతుల్లో...

ఇతరుల వద్ద 3795 ఎకరాలు ● అసైన్డ్ అన్యాక్రాంతం గుట్టు విప్పుతున్న 'ప్రక్షాళన'

ఈనాడు–హైదరాబాద్



పేదలకు కేటాయించిన భూములు అన్యుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నగర శివారులు సహా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగరి, వికారాబాద్ జిల్లాల పరిధిలో పేదలకు కేటాయించిన భూములు ఇప్పుడు ఇతరుల ఆధీనంలో ఉన్నాయి. తాజాగా సేకరించిన వివరాల మేరకు రంగారెడ్డి జిల్లాలో 1040 ఎకరాలు, మేడ్చల్- మల్కాజిగిరిలో 928 ఎకరాలు, వికారాబాద్‌లో 1827 ఎకరాల భూమి ఇతరుల పరమైంది.

నిబంధనలకు తూట్లు..

నగర శివారులు సహా పూర్వ రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రతి మండలంలో భూ క్రయవిక్రయాలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా ఉండటం వల్ల ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్ముకోవడం తెలిసిందే. అయితే పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములను కూడా కొందరు కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటే.. మరికొందరు తమ ఫాంహౌజుల్లో కలిపేసుకున్న ఉదంతాలు వెలుగుచూశాయి. నిబంధనల ప్రకారం పేదలకు అసైన్ చేసిన భూములను ఇతరులకు అమ్మడం నిషేధం. ఆ భూములను సాగు చేసుకొని జీవించాలే తప్ప వాటిని అమ్మకూడదు. అలాగే వారసులకు తప్ప ఇతరులకు బదలాయించకూడదు. ఈ నిబంధనలన్నీ పక్కన పెట్టి అనేక గ్రామాల్లో అసైన్డ్ భూముల అన్యాక్రాంతం జరిగింది. తాజాగా భూదస్త్రాల ప్రక్షాళనలో అసైన్డ్ భూములు ఎక్కడెక్కడ అన్యాక్రాంతమయ్యాయన్న వివరాలు సేకరించారు. రంగారెడ్డిజిల్లాలోని 69 గ్రామాల పరిధిలో 786 సబ్‌డివిజన్ల(సర్వేనెంబర్లు)ల్లోని దాదపు 1040 ఎకరాల మేర భూమి అన్యుల చేతుల్లో ఉంది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాపరిధిలో 8 గ్రామాల పరిధిలో 928 ఎకరాలు కేటాయించిన వారి పేర్లతో కాకుండా వేరే వారి ఆధీనంలో ఉన్నట్లు తేలింది. వికారాబాద్‌లో 51 గ్రామాల్లో 1213 సబ్ డివిజన్లల్లోని 1827 ఎకరాలు పరుల పాలైందని గుర్తించారు. ఈ పరిశీలన ఇంకా తుది దశకు చేరలేదు. అయితే పక్కాగా ఆరా తీస్తే ఇతరుల చేతుల్లోకి మారిన మరింత అసైన్డ్ భూమి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు చెపుతున్నారు.

బీఆర్ఎస్‌కు ఆస్కారం..

హెచ్ఎండీఏ పరిధికి వెలుపల ఉండే అసైన్డ్ భూమి అన్యుల చేతుల్లో ఉండి.. వారు నిజంగా అర్హులైతే వారిపేరుతో క్రమబద్ధీకరించే యోచన జరుగుతోంది. అంటే ఒకరి పేరుతో అసైన్ చేసిన భూమిని ఆ వ్యక్తికి విక్రయించడం నిబంధనల మేరకు చెల్లదు. అయితే ఇలా కొనుగోలు చేసిన వ్యక్తి అణగారిన వర్గాలకు చెందిన వాడై ఉండి.. నిబంధనల మేరకు అసైన్డ్ భూమి పొందేందుకు కావాల్సిన అన్ని అర్హతలూ ఉన్నట్లైతే ఆ భూమిని అతని పేరుతో క్రమబద్ధీకరించే యోచన చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల అనేక మందికి ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెపుతున్నారు. భూదస్త్రాల ప్రక్షాళన వల్ల కలిగే పెద్ద ప్రయోజనాల్లో ఇదొకటని జాయింట్ కలెక్టర్ సుందర్‌అబ్నార్ వ్యాఖ్యానించారు.

సైబర్ నేరాల వెల్లువ

☛ నైజీరియన్ నేరగాళ్లకు తోడైన అంతర్రాష్ట్ర ముఠాలు

☛ నేరాల నియంత్రణలో ఫలించని పోలీసుల చర్యలు

ఈనాడు, హైదరాబాద్



రాజధాని వాసుల్ని నిండా ముంచుతూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ఓవైపు పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా మోసాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఒకప్పటిలా నైజీరియన్ మోసగాళ్ల రూపంలో కాకుండా జామ్‌తారా లాంటి ప్రాంతాలకు చెందిన అంతర్రాష్ట్ర ముఠాలు రెచ్చిపోతుండటంతో గతంతో పోల్చితే ఈసారి సైబర్ నేరాల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. సరికొత్త పరిజ్ఞానాన్ని వినియోగించి దిల్లీ, మహారాష్ట్ర, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ్‌బంగ.. తదితర రాష్ట్రాల నుంచి నేరగాళ్లను పోలీసులు పట్టుకొచ్చి కటకటాల్లోకి పంపిస్తున్నా నేరాలకు అడ్డుకట్ట పడటం లేదు. మూడు కమిషనరేట్ల పరిధిలో ఈసారి కేసులు పెరిగిపోవడంతో వీటికి అడ్డుకట్ట వేసేందుకు సైబర్‌క్రైమ్ పోలీసులు కొత్త తరహా ఎత్తుగడలు వేయాల్సిన అవసరం ఏర్పడింది.

చెమట చుక్క చిందకుండా.. కన్నుమేయకుండా.. కేవలం ఫోన్‌కాల్ ద్వారా రూ.లక్షల్లో సొమ్ము స్వాహా చేసే వ్యవహారం ఏదైనా ఉందంటే అది తప్పనిసరిగా సైబర్‌క్రైమే. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బాధితుల్ని వంచించడం సైబర్ నేరగాళ్లకు సులభమైన వ్యాపకంగా మారిపోయింది. ఒకప్పుడు సైబర్ నేరాలు జరిగాయంటే అది ఏ నైజీరియన్ల పనిగానో భావించాల్సి వచ్చేది. ఈ తరహా నేరాలకు చిరునామాగా వారి పేరు మార్మోగిపోయేది. ఒకరకంగా చెప్పాలంటే సైబర్ నేరాలకు మారుపేరుగా '419 నైజీరియన్ ఫ్రాడ్' వ్యవహారంలోకి వచ్చింది. ఆఫ్రికా ఖండంలోని నైజీరియా, కాంగో, సూడాన్, సౌత్‌సూడాన్, ఇథియోపియా.. తదితర దేశాల నుంచి ఉన్నత విద్య, వ్యాపారం, పర్యాటకం, వైద్యచికిత్స పేరిట ఇక్కడికి వచ్చే విదేశీయులు పలువురు ఇక్కడే అక్రమంగా మకాం వేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు మాదక ద్రవ్యాల సరఫరా ద్వారా డబ్బు గడించే ఈ ముఠాలు సులభమైన మార్గం కావడంతో సైబర్ నేరాల వైపు మళ్లాయి. ముఖ్యంగా దిల్లీ, గుడ్‌గావ్, ముంబయి, బెంగళూరు, గోవాల్లో మకాం వేస్తూ హైదరాబాదీయుల్నే లక్ష్యంగా చేసుకొని వదిలేయడం ఆరంభించాయి. ఈసారి ఆఫ్రికన్ నేరగాళ్లకు తోడు అంతర్రాష్ట్ర ముఠాల మోసాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. జార్ఖండ్ రాష్ట్రంలోని జామ్‌తారా ప్రాంతానికి చెందిన పలువురు నిరుద్యోగ యువకులు సైబర్ నేరాలే ఆలవాలంగా రెచ్చిపోయారు. ఉదయం లేచింది మొదలు కంప్యూటర్, చరవాణి, అన్నం సద్ది మూట పట్టుకొని శివారుల్లోని అటవీ ప్రాంతానికి వెళ్లి బాధితులకు వలేయడమే పనిగా పెట్టుకున్నారు. కొన్ని ఏజెన్సీల నుంచి బాధితుల చరవాణులు, క్రెడిట్, డెబిట్‌కార్డుల ప్రాథమిక సమాచారాన్ని కొనుగోలు చేయడం. . అనంతరం వారికి ఫోన్లు చేసి బ్యాంకు ప్రతినిధులమంటూనో, లాటరీ తగిలిందనో, ఉద్యోగం ఇప్పిస్తామనో వలేసి డబ్బు కొల్లగొట్టేయడమే పనిగా పెట్టుకున్నారు. తీరా మోసపోయాక బాధితులిచ్చిన ఫిర్యాదులతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు ఆయా ప్రాంతాలకు వెళ్లి నిందితుల్ని పట్టుకొచ్చి జైళ్లకు పంపుతున్నా నేరాల పరంపర కొనసాగుతూనే ఉంది.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులు

2015లో 268, 2016లో 237 సైబర్ నేరాలు నమోదు కాగా.. ఈసారి 284 నమోదయ్యాయి. వాటిల్లో ప్రధానమైనవి ఇలా...

సైబర్ నేరం	2015	2016	2017
సామాజిక మాధ్యమాల్లో మహిళల నకిలీ ప్రొఫైళ్లు	43	20	23
సంక్షిప్త సందేశాల ద్వారా వేధింపులు	40	20	24
ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసాలు	33	28	52
నైజీరియన్ల మోసాలు	16	14	23
ఏటీఎం/డెబిట్/క్రెడిట్‌కార్డు మోసాలు	43	70	73
ఆన్‌లైన్ మోసాలు	26	26	34
ఇతర	32	15	20

క్రెడిట్‌కార్డు.. లాటరీ.. ఉద్యోగం

సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రెడిట్‌కార్డుల సమాచారాన్ని తస్కరించడం.. ఉద్యోగాలిప్పిస్తామని దరఖాస్తుదారుల్ని నమ్మించడం.. లాటరీ తగిలిందని మభ్యపెట్టడం.. ద్వారా ఎక్కువగా మోసాలకు పాల్పడ్డారు. బ్యాంకు ప్రతినిధులుగా ఫోన్లు చేస్తూ క్రెడిట్/డెబిట్‌కార్డును అప్‌డేట్ చేస్తున్నామంటూ నమ్మించి పాస్‌వర్డ్, ఓటీపీ, సీవీవీ నంబర్లను తెలుసుకోవడం ద్వారా రూ.లక్షలు కొల్లగొట్టేశారు. అలాగే లాటరీ తగిలిందని ఆశ పెట్టి కొంత మొత్తం ధరావతుగా తీసుకోవడంతోపాటు ఆన్‌లైన్ పోర్టళ్లలో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు దొడ్డిదారిన ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు గుంజడం లాంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. టికెట్ కొనకుండా లాటరీ తగలిందనే ఫోన్‌కాల్‌ను నమ్మొద్దని.. క్రెడిట్/డెబిట్‌కార్డు అప్‌డేట్ చేసేందుకు బ్యాంకు ప్రతినిధులు ఫోన్ చేయరని సైబర్ క్రైమ్ పోలీసులు ఎంతగా అవగాహన కల్పించే ప్రయత్నం చేసినా ఈసారి సైబర్‌నేరాలు మరింతగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈనేపథ్యంలో సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు పోలీసులు వచ్చే ఏడాది సరికొత్త వ్యూహాలకు పదును పెట్టాల్సిన అవసరం ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 366 సైబర్ నేరాలు నమోదయ్యాయి

- ఖాతాల హ్యాకింగ్ - 15
- ఫిషింగ్ కాల్స్/కాల్ స్పూఫింగ్ - 192
- నైజీరియన్ల లాటరీ మోసాలు - 9
- ఉద్యోగాల పేరిట మోసాలు - 38
- సామాజిక మాధ్యమాల్లో వేధింపులు- 52
- ఆన్‌లైన్ మోసాలు - 58
- మెయిల్ స్పూఫింగ్ - 2

☛ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 237 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో 83 మంది నిందితుల్ని అరెస్ట్ చేశారు. ఎక్కువగా ఉద్యోగాల, లాటరీల, పెళ్లిళ్ల పేరిట మోసాలు వెలుగుచూశాయి.

ఫిర్యాదు తీసుకోకపోతే ఫిర్యాదు!

- పర్యవేక్షణకు ఏసీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం
- నగర కమిషనరేట్‌లో అందుబాటులోకి సేవలు

ఈనాడు, హైదరాబాద్



మీరు నగర కమిషనరేట్ పరిధిలోని ఏదైనా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే చేదు అనుభవం ఎదురైందా? ఫిర్యాదు తీసుకునేందుకు అక్కడి సిబ్బంది నిరాకరించారా? ఎఫ్ఐఆర్ నమోదుకు రోజుల తరబడి తిరగాల్సి వచ్చిందా? ఇకపై మీరు ఆ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ఠాణాలో సరైన స్పందన లేకపోతే విషయాన్ని మీరు నేరుగా పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఇందుకోసం హైదరాబాద్ కమిషనరేట్‌లో ప్రత్యేక విభాగం ఒకటి అందుబాటులోకి వచ్చింది. ఠాణాల్లో ఫిర్యాదులు తీసుకోకపోతే ఈ విభాగాన్ని సంప్రదించొచ్చు. ఆ విభాగంలోని అధికారి స్పందించి కేసు నమోదు చేసేలా సంబంధిత ఠాణా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తారు. ఇది కాగ్నిజబుల్ అఫెన్స్(గుర్తించదగిన నేరాలు)కే వర్తిస్తుంది. ఠాణాలకు వెళితే ఫిర్యాదులు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం నాంపల్లిలోని సీసీఎస్ ఆవరణలో కేంద్ర పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఏసీపీ వై.శ్రీనివాస్ కుమార్‌కు అప్పగించారు.

- బాధితుడు తొలుత ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే పర్యవేక్షణ విభాగాన్ని సంప్రదించొచ్చు. ఠాణాకు కాకుండా నేరుగా ప్రత్యేక విభాగానికి వెళితే పరిగణనలోకి తీసుకోరు.
- తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదును ఈ విభాగం సిబ్బంది ప్రాథమికంగా పరిశీలిస్తారు. అది గుర్తించదగిన నేరంగా తేలితే వెంటనే సంబంధిత ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తారు.
- అలా తాము జోక్యం చేసుకున్నాకే ఎఫ్ఐఆర్ నమోదయ్యే కేసులపై పర్యవేక్షణ విభాగం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఆయా కేసుల దర్యాప్తులనూ పర్యవేక్షిస్తుంది. బాధితులు ఫిర్యాదు చేశారనే కోపంతో ఠాణాలో కేసు దర్యాప్తును దారి తప్పనీయకుండా చర్యలు తీసుకుంటుంది.
- ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేశాక కేసు దర్యాప్తులో తీవ్ర జాప్యం జరిగినా పర్యవేక్షణ విభాగం దృష్టికి తీసుకెళ్లొచ్చు.
- ఎఫ్ఐఆర్‌ల జారీ విషయంలో తప్ప ఇతర వ్యవహారాల్లో కేంద్ర పర్యవేక్షణ విభాగం జోక్యం చేసుకోదు.

విభాగానికి ఫిర్యాదులు ఇలా...

- **పని వేళలు:** ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలు(అన్ని పని దినాల్లో)
- **ఫోన్ నంబర్లు:** 94901 57512, 040-23260720, 27852041
- **మెయిల్ ఐడీ:** cmcdd@hyd.tspolice.gov.in

అరుణ్‌సాగర్ అవార్డుల ప్రదానోత్సవం నేడు

నాంపల్లి, న్యూస్‌టుడే: సీనియర్ జర్నలిస్ట్ అరుణ్‌సాగర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సాయంత్రం 6 గంటలకు ఈ ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ జర్నలిస్టులకు 'అరుణ్‌సాగర్ బెస్ట్ జర్నలిస్టు' అవార్డులను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

వృద్ధులకు రైళ్లలో ప్రాధాన్యమేది..?

న్యూస్‌టుడే, కాచిగూడ



- *కాచిగూడకు చెందిన శివశంకర్ (71) తన భార్య అంజలి (64)తో కలిసి పాట్నా ఎక్స్‌ప్రెస్‌లో వారణాసి యాత్రకు రైలులో బయలుదేరారు. వారికి పై బెర్త్‌లను కేటాయించారు. శివశంకర్ మోకాళ్ల నొప్పులతో, అంజలి కాలుకు శస్త్ర చికిత్స జరగడంతో అప్పర్ బెర్త్ ఎక్కలేని పరిస్థితి నెలకొంది. తోటి ప్రయాణికులను ప్రాధేయపడి కింది బెర్త్‌కు మారాల్సి వచ్చింది.*
- *వనస్థలిపురానికి చెందిన విమల(65) రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్‌లో సోమ్‌నాథ్ యాత్రకు కుటుంబంతో కలిసి బయలుదేరారు. ఆమె మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. ఆమెకు రైలులో పై బెర్త్ కేటాయించడంతో పైకి ఎక్కలేకపోయారు.*

ఇలాంటి పరిస్థితి నగరంలోని అనేక మంది వృద్ధులకు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎదురవుతోంది. కొన్నిసార్లు కింది బెర్త్‌ల ప్రయాణికులు పై బెర్త్‌కు వెళ్లడానికి నిరాకరిస్తుండటంతో వృద్ధులు అప్పర్ బెర్త్ ఎక్కలేక నానా అవస్థలు పడుతున్నారు. రైల్వే బోర్డు గత ఏడాది వృద్ధులు, గర్భిణులు, 45 ఏళ్లకుపైబడిన మహిళలకు కింది బెర్త్ కోటా పెంచినా కూడా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. నగరం నుంచి నిత్యం 200 లకుపైగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అప్పర్ బెర్త్‌ల కేటాయింపుతో వారు పడే బాధ వర్ణనాతీతం. వృద్ధులు లోయర్ బెర్త్ ప్రయాణికులను ప్రాధేయపడి ఒప్పించి అప్పర్ బెర్త్‌లను మార్చుకోవాల్సి వస్తోంది. లేదంటే వారు పై బెర్త్ ఎక్కలేక సతమతమవుతుంటారు. గర్భిణులు, వయసు పైబడిన మహిళల పరిస్థితి కూడా అంతే.

200 రైళ్లు.. ఐదు లక్షల ప్రయాణికులు: నగరంలోని కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి తదితర ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి ప్రతిరోజు 200 లకు పైగా ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా ఐదు లక్షల మంది ప్రయాణికులు తమ తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. నగరం నుంచి రైళ్లు తెలంగాణ, ఏపీలోని పలు నగరాలు, పట్టణాలతోపాటు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలకు వెళుతున్నాయి. వారాంతాలు, సెలవులు, పండగల రోజుల్లో రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. సాధారణ ప్రయాణికులతోపాటు వృద్ధులు, గర్భిణులు, వయసు పైబడిన మహిళలు రైలులో ప్రయాణించడానికి ఇబ్బందులు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో కేంద్ర రైల్వే బోర్డు రైలు ప్రయాణంలో వారికి కింది బెర్త్‌ల కేటాయింపులో ప్రాధాన్యం ఇచ్చింది. ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రతి బోగీకి వారికి కొన్ని లోయర్ బెర్త్‌లను రిజర్వ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

కోటా పెరిగినా ఇబ్బందులే: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్ తోపాటు ఏసీ 2, 3 టైర్‌లో వృద్ధులు, గర్భిణులు, వయసు పైబడిన మహిళలకు బోగీలవారీగా లోయర్ బెర్త్‌లను ఆన్‌లైన్ రిజర్వేషన్ కోటా కింద కోటాయిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వారి కింది బెర్త్‌ల కోటా పెంచుతూ కేంద్ర రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా 2016 మార్చి 23న రైల్వే బోర్డు ప్యాసింజర్ మార్కెటింగ్ డైరెక్టర్ విక్రమ్ సింగ్ లోయర్ బెర్త్‌ల కోటా పెంచుతూ నగరంలోని సికింద్రాబాద్ రైలు నిలయం కేంద్రంగా పనిచేసే దక్షిణ మధ్య రైల్వే తోపాటు దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్ల చీఫ్ కమర్షియల్ మేనేజర్లకు ఉత్తర్వులను జారీ చేశారు.

నామమాత్రంగానే... బెర్త్‌ల కేటాయింపు

సాధారణంగా ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా గరిష్ఠంగా 24 వరకు బోగీలు ఉంటాయి. ప్రతి స్లీపర్ క్లాస్‌లో బోగీలో 72 బెర్త్‌లలో 6 కింది బెర్త్‌లను మాత్రమే వృద్ధులు, గర్భిణులు, 45 ఏళ్లకుపైగా ఉన్న మహిళలకు రిజర్వేషన్ కోటా కింద కేటాయిస్తున్నారు. అదేవిధంగా 3 ఏసీ బోగీలో 64 బెర్త్‌లతో 3 కింది బెర్త్‌లు, 2 ఏసీ బోగీలో 46 బెర్త్‌లతో 3 కింది బెర్త్‌లను రిజర్వ్ కోటాలో వారికి మంజూరు చేస్తున్నారు. ఈ రిజర్వేషన్ కోటా నామమాత్రంగా ఉండటం వల్ల వారికి తప్పనిసరి పరిస్థితిలో టిక్కెట్ల రిజర్వేషన్‌లో పై బెర్త్‌లను కేటాయిస్తున్నారు. దీంతో వారు అప్పర్ బెర్త్‌కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, గర్భిణులు, వయసుపైబడిన మహిళలకు కింది బెర్త్‌ల రిజర్వేషన్ కోటా పెంచాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

TENTH
Social Studies

Globalisation

2 Marks Questions

Q: Why do Government try to attract more foreign investment?

A: More foreign investment helps in increasing the economic activities. This helps in employment generation. So the Government try to attract more foreign investment.

Q: Where do MNC's setup offices and factories for production? Give reason.

A: MNC's establish offices and factories for production near the markets or places where skilled and unskilled labours are available or where factors of production is available.

Q: What are the various ways in which countries can be linked?

A: The various ways in which countries can be linked are

★ The movement of goods, services, investment and technology.

★ The movement of people between countries in search of better income, better jobs, better education.

Q: The impact of globalisation has not been Uniform. Explain the statement.

A: ★ It is benifitted to rich persons in the urban areas.

★ Some large Indian companies emerged as MNCs.

★ Thousands of small producers closed their units and met losses.

★ Many employees lost their employment and workers saw their rights erode.

Q: Why do developed countries want developing countries to liberalise their trade and investment? What do you think should the developing countries in return?

A: ★ Developed countries want developing countries to liberalise their foreign trade and foreign investment.

★ So that MNC's owned by these developed countries can expand into developing countries.

★ Developed countries with huge wealth, which is greater than the budgets of many developing countries can influence the world trade balance.

Q: Appreciate the role of WTO in promoting Globalisation.

A: W.T.O. is playing a crucial role in promoting globalisation. It promotes global business and international trade. It is the process of rapid integration of the countries. It provides a global platform to the countries for smoother solution for their problems and to establish greater free trade agreements on goods, services and technology.

Q: MNCs provide better quality products. Do you agree?

A: MNCs setup offices and factories for production in regions where they can get cheap labour and other resources.

★ The production process is divided into small parts and spread out across the globe.

★ This is done so that the cost of production is low and the MNC's can earn greater Profits giving quality products.

Q: What is the difference between foreign trade and foreign investment?

A: Foreign trade: It is any kind of trade (exports & imports) with other countries of the world.

Foreign investment: Private capital investment by firms of one country into those of another country is called foreign investment.

Q: Nearly all major multi nationals are American, Japanese or European such as Nike, Coca-Cola, Pepsi, Honda, Nokia. Can you guess why?

A: To start a MNC, enormous wealth is required. Only developed countries like the above can start MNC's as their wealth sometimes exceeds the entire budget of the developing countries. They are financially strong. So most of the MNC's are from America, Europe and Japan.

Q: What are the problems being faced by the small producers and workers by the impact of Globalisation? (2 Marks)

A: The MNC place orders for production with small producers. The products produced are sold by the MNCs under their own brand names. The MNC's have tremendous power to determine manufacturing conditions for the local producers. The History has shown the most of the local producers have failed to compete with the MNC's. So, either they have sold their units to the MNC's or have been wiped off.

ప్రతిభ

What was the previous name of WTO?



Writer:
K. Srinivasa Rao
Subject Expert

4 Marks Questions

Q: How has liberalisation of trade and investment policies helped the globalisation process?

A: ★ Liberalisation of trade and investment helped the Globalisation process.

★ Its policies removed many barriers and restrictions in Industrialisation.

★ Establishment of MNCs accelerated the globalisation.

★ Quality of goods increased

★ Goods and services availability is greatly increased throughout the world.

★ Due to liberalisation of trade and investment policies transport system developed well.

★ Mobile Phones, internet and computer facilities developed well.

★ We can access any information with low cost internet facilities within seconds.

Q: What were the reasons for putting barriers to foreign trade and investment by the Indian Government? Why did it wish to remove these barriers?

A: ★ To protect the producers within the country from foreign competition.

★ Industries were just coming up, with foreign competition they may not survive.

★ Foreign investment may be influence our economy.

★ Our goods quality is less than compare to foreign goods.

★ Around 1991, Indian government decided that the time had come for foreign competition.

★ It believed that competition would improve our goods quality.

★ Foreign technology help for us.

★ So it wished to removed these barriers.

Q: Globalisation will continue in the future. Can you imagine what the world would be like twenty years from now? Give reasons for your answer.

A: After 20 years the world would undergo a positive change with the features of the following.

★ Improved quality of products

★ More access to information technology

★ Healthy competition

★ Better living standards

★ Increased volume of output, income and employment.

The above changes are going to happen because-

★ Human resources are plenty.

★ Enterpreneurship will grow.

★ Domestic markets of all major countries will experience growth.

★ All major countries will have a broad resource and Industrial base.

Q: Elsewhere we read what may be development for one may be destructive for others. The setting of SEZs has been opposed by some people in India. Find out who are these people why are they opposing it.

A: ★ What may be development for one may be destructive for others.

★ The setting of Special Economic zones has been opposed by some people.

★ SEZs need not pay taxes for first five years

★ SEZs have flexible labour laws.

★ They have world class facilities

★ People are against SEZs as many companies which setup SEZs are not functioning well.

★ They were provided exemptions at the expense of other companies.

Q: How is information technology connected with globalisation? Would globalisation have been possible without the expansion of IT?

A: Information and communication technology has played a major role in spreading out production of service across countries.

★ The development in IT in the areas of computers Tele communications, internet have been changing rapidly.

★ Internet also allows us to send instant e -mail and talk across the world at negligible costs.

★ With the help of IT, Globalisation able to integrate of one's country's economy with world economy.

★ Globalisation would not have been possible without expansion of IT.

Q: Supposing you find two people arguing: One is saying that globalisation has hurt our country's development. The other is telling globalisation is helping India develop. How would you respond to these arguments?

A: Positive Impact

1) Increases in the volume of trade in goods and services.

2) Inflow of private foreign capital and export orientation of the economy.

3) Increases the volume of out put, income and employment

Negative impact

1) It may not help in achieving sustainable growth

2) It may lead to aggravation of income inequalities within countries.

3) Whatever may be the negative impacts of the globalisation I feel that it has now become a process which is catching the fancy of more and more nations. Hence we must become ready to accept globalisation with grace and also maximise economic gains from the world market.

1 Mark Questions

Q: What is Globalisation?

A: Globalisation is a major change that occurred across the globe in the late 20th century. This has political, cultural as well as economic dimensions.

Q: What is Arab spring?

A: Tunisia, Egypt were influenced by each other's revolutions and uprooting of dictators. This was called Arab spring in the media.

Q: Would you say Ford motors is an MNC? Why?

A: Yes, we can say Ford motors is an MNC, because its production units have spread over 26 countries of the world. This is the most important feature of an MNC.

Q: What was the previous name of WTO?

A: The previous name of WTO was GATT (General Agreement on Trade and Tariff)

Q: When was the W.T.O established?

A: The W.T.O was established on 01.01.1995

Q: How many countries are currently the members of the W.T.O.?

A: The W.T.O has 159 member countries as on 2.3.2013

Q: What is tariff?

A: A tax on a duty on imports which can be levied on physical units is called tariff.

Q: What is Privatisation?

A: Privatisation means encouraging private sector and discouraging public sector.

Q: Where is the Headquarters of W.T.O?

A: It is in Geneva - Switzerland.

Q: What is meant by MNC?

A: An MNC is a Multi National Corporation, owns and controls production in more than one nation.

Q: What is liberalisation?

A: Removing barriers or restrictions set by the Government is known as liberalisation.

Q: Why was World Trade Organisation setup?

A: The World Trade Organisation was setup to liberalise international trade.

Q: Define Economic reforms of New Economic Policy 1991.

A: The Economic Reforms of NEP 1991 was called liberalisation of trade and business.

Q: Expand I.B.R.D. and S.E.Z and IMF.

A: I.B.R.D: International Bank for Reconstruction and Development.

S.E.Z: Special Economic Zone

IMF: International Monetary Fund

Q: What is outsourcing?

A: Outsourcing means going out to a source outside the company to buy regular service.

Q: State the new strategies of New Economic Policy.

A: 1) Liberalisation

2) Privatisation

3) Globalisation

Q: Write any two impacts of liberalisation and globalisation in India?

A: 1) There are better services in communication sector.

2) Many food processing companies have taken over the market.

టీఆర్‌టీ-2017

తెలుగు (కంటెంట్)

ప్రతిభ

తెలుగు సాహిత్యంలో చాలా ఉద్యమాలు వెలువడ్డా ఎక్కువగా కవిత్వోద్యమాలు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ఉద్యమం అంటే తీవ్రమైన ప్రయత్నం. ఇది కార్యరూపంగా కూడా ఉంటుంది. ఆధునిక ఉద్యమాల్లో జాతీయోద్యమం, భావ కవిత్వోద్యమాలు సమాంతరంగా కొనసాగాయి.

'కిన్నెరసాని' ఎవరి ఊహా ప్రేయసి ...?

జాతీయోద్యమ కవిత్వం

దీన్నే స్వాతంత్ర్యోద్యమం అంటారు. 'అందరూ ఒక్కటే' అనే భావమే జాతీయత. ఈ ఉద్యమం దేశభక్తితో కూడింది. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా, స్వాతంత్ర్య కాంక్షకు ప్రతిబింబంగా జాతీయోద్యమం ప్రారంభమైంది. దీనికి అనుగుణంగా తెలుగు కవులు తమ కలాలను ఝుళిపించి 'మేము సైతం' అన్నారు. తమ పాటలు, కావ్యాల ద్వారా ప్రజలను జాగృతపరిచారు. దేశభక్తిని రగిలించారు.

'భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి'

అనే చిలకమర్తి వారి పద్యం తెలుగువారిని ఉద్రేకపరిచింది. ఇందులో ఆంగ్లేయుల దోపిడీని అందరికీ అర్థమయ్యేలా వెల్లడించారు. చిలకమర్తివారే జైలుకు వెళ్లడం మాతృభక్తికి నిదర్శనమంటూ - 'చెరసాలల్ పృథుచంద్రశాలలెయగున్...' అని చాటారు. రాయప్రోలు సుబ్బారావు దేశభక్తితో కూడిన పద్యాలు, గేయాలు ఎన్నో రాశారు. ఆంధ్రావళి, జడకుచ్చులు లాంటి రచనలు చేసి 'కోకిలస్వామి' అనిపించుకున్నారు. రాయప్రోలు వారి...

'ఏ దేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము'

గేయం నేటికీ ప్రచారంలో ఉంది.

తుమ్మల సీతారామమూర్తిని 'మహాత్ముడి ఆస్థాన కవి' అంటారు. 'తెనుగులెంక' (లెంక అంటే 'సేవకుడు) అనే బిరుదు సంపాదించారు. వీరి 'రాష్ట్ర గానం', 'మహాత్మకథ', 'ధర్మజ్యోతి' లాంటి రచనలు స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిచ్చాయి.

జాతీయోద్యమంలో అంటరానితనం నిర్మూలన, ఖాదీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా, మద్యపాన నిషేధం లాంటివి అంతర్భాగాలయ్యాయి. వీటి గురించి తెలుగు కవులు ప్రచారం చేశారు. అంటరానితనాన్ని తీవ్రంగా నిరసిస్తూ మంగిపూడి వేంకటశర్మ 'నిరుద్ధ భారతం' రాశారు. అస్పృశ్యతపై రాసిన తొలి ఖండ కావ్యమిది. విశ్వనాథ, తుమ్మల, దాశరథి, వానమామలై వరదాచార్యులు, పుట్టపర్తి నారాయణాచార్యులు... ఇలా ఎందరో తమ కలాలతో ఆంగ్లేయులపై నిప్పులు కురిపించారు.

'మాతలకు మాత సకల సంపత్సమేత
మా భరతమాత'

అన్న జాషువా 'బాపూజీ', 'నేతాజీ' లాంటి ఖండ కావ్యాలే కాకుండా, 'గబ్బిలం' సగమంతా దేశభక్తిని చాటేదే. గడియారం వేంకటశేషశాస్త్రి 'శివభారతం', దుర్భాక రాజశేఖర శతావధాని 'రాణా ప్రతాపసింహ', విశ్వనాథ 'ఝాన్సీలక్ష్మి' ఆ రోజుల్లో ఉత్తేజపరిచాయి. 'జాతీయ గేయ కవిసార్వభౌమ'గా పేరొందిన గరిమెళ్ల సత్యనారాయణ రాసిన 'మాకొద్దీ తెల్లదొరతనము దేవా..' అనే 120 పంక్తుల గేయం ఆంగ్లేయులను గడగడలాడించింది. తెలుగువారిని ఉద్రేకపరిచింది. ఉన్నవ లక్ష్మీనారాయణ - మాలపల్లి, వట్టికోట ఆళ్వారుస్వామి - ప్రజల మనిషి, మహీధర రామమోహనరావు - కొల్లాయి గట్టితేనేమి, వేంకట పార్వతీశ కవులు - మాతృ మందిరం... మొదలైన నవలలు స్వాతంత్ర్య పోరాటానికి సమాయత్తం చేశాయి. దామరాజు పుండరీకాక్షుడు రాసిన 'స్వరాజ్యసోపానాలు', 'గాంధీ మహోదయం', కొప్పరపు సుబ్బారావు రాసిన 'రోషనార', వేదం వెంకట్రాయశాస్త్రి రాసిన 'ప్రతాపరుద్రీయం' లాంటి నాటకాలు మరింత దేశభక్తికి తోడ్పడ్డాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గోపీచంద్, గంగినేని వెంకటేశ్వరరావు, బొల్లిముంత శివరామకృష్ణ, నెల్లూరి కేశవస్వామి మొదలైన వారంతా తమ కథల ద్వారా చైతన్యం కలిగించారు. కనుపర్తి వరలక్ష్మమ్మ 'గాంధీ దండకం' రాస్తే మంగిపూడి 'గాంధీ శతకం' రాశారు. గాంధీపై వచ్చినంత కవిత్వం మరో నాయకుడిపై రాలేదు. జాతీయ పతాకం, రాట్నం కవితా వస్తువులయ్యాయి. జాతీయ పతాకాన్ని తెలుగువాడైన పింగళి వెంకయ్య రూపొందించడం గర్వకారణం. గురజాడ 'దేశభక్తి' గేయం అంతర్జాతీయ గేయంగా ప్రశంసలు పొందింది.

జాతీయోద్యమ కవిత్వంపై ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి అక్షరాలా పరిశోధన చేసి, గ్రంథం వెలువరించారు. ఆంధ్ర రాష్ట్రోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం జాతీయోద్యమంలో భాగంగానే భావించాలి.



రచయిత
ద్వానా శాస్త్రి
విషయ నిపుణులు

భావ కవిత్వోద్యమం

ఆంగ్లంలోని కాల్పనికోద్యమం భావ కవిత్వ ఉద్యమానికి మూలం. ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లండ్ దేశాల్లో దీని ప్రభావం బాగా ఎక్కువ. 'లిరికల్ పొయెట్రీ' పేరు కూడా భావ కవిత్వానికి వాడుతున్నారు. భావ కవిత్వానికి ఆ పేరు పెట్టిన వారు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. ఈ కవిత్వం 1910 లో ప్రారంభమై దాదాపు 1935 వరకు కొనసాగింది. ఆంగ్ల కవులైన జాన్సన్, షెల్లీ, వర్డ్స్‌వర్త్, కీట్స్, బైరన్, షేక్‌స్పియర్‌ల ప్రభావం తెలుగు కవులపై బాగా ఉంది. 'భావ కవిత్వం' అనే పేరుపై వాదోపవాదాలు జరిగాయి. భావం లేని కవిత్వం ఉండదు కదా! ఇందులో అస్పష్టత ఎక్కువ కాబట్టి 'అభావ కవిత్వం' అంటే సముచితంగా ఉంటుందన్నారు. 'వస్తువు, భావం, భాషలలో భావానికే ప్రాధాన్యం ఎక్కువ కాబట్టి భావ కవిత్వం అనే పేరు సమంజసమే' అన్నారు సి.నారాయణరెడ్డి.

భావ కవిత్వ లక్షణాలు:

★ ప్రకృతి ప్రీతి ★ ప్రణయారాధన
★ స్వేచ్ఛా ప్రయత్నం ★ ఆత్మాశ్రయరీతి
★ అపూర్వత లేదా అద్భుతతత్వం

డా. సి. నారాయణరెడ్డి 'ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు - ప్రయోగములు' అనే సిద్ధాంత వ్యాసంలో దేశభక్తి కవిత్వం - సంఘ సంస్కరణ కవిత్వం - స్మృతి కవిత్వం అనేవి కూడా చేర్చారు.

భావ కవిత్వంలో ప్రణయ తత్వానికే పెద్దపీట. ఇది ప్రబంధాల్లోని శృంగారం లాంటిది కాదు. భావ కవిత్వం ఉదాత్త ప్రణయానికి ప్రాధాన్యంతో వెలువడింది. స్త్రీని ఒక ఆరాధ్య దేవతగా భావిస్తారు. ప్రేయసిగా ఆదరిస్తారు. సహచరిగా గౌరవిస్తారు. రాయప్రోలు సుబ్బారావు 'తృణకంకణం' కావ్యంతో భావ కవిత్వం మొదలైంది. ఈయన 'అమలిన శృంగార సిద్ధాంతం' ప్రతిపాదించారు. ఇందులో శారీరకమైన ఆకర్షణ కంటే స్నేహ మాధుర్యం ఎక్కువ. సంయోగ శృంగారంలో కంటే వియోగ శృంగారంలో వరవశిస్తారు. ఇందులో ఆత్మాశ్రయత్వం ఉంటుంది. ఒక్కొక్క కవి ఒక్కొక్క ఊహా ప్రేయసిని ఊహించుకుంటాడు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి - ఊర్వశి
నాయని సుబ్బారావు - వత్సల
అడవి బాపిరాజు - శశికళ
శివశంకరశాస్త్రి - హృదయేశ్వరి
విశ్వనాథ - కిన్నెరసాని

దేవులపల్లి కృష్ణశాస్త్రిపై ఆంగ్ల కవి షెల్లీ ప్రభావం ఎక్కువ. అందుకని ఆయన్ను 'ఆంధ్రా షెల్లీ' అంటారు. 'కృష్ణపక్షం'లో ఆత్మాశ్రయత్వం ఎక్కువ. కవి తన అనుభవాలను, కోరికలను, బాధలను నిర్భయంగా ప్రకటిస్తాడు. భావకవిత్వంలో దేశభక్తి, స్మృతి కవిత్వాలకు చెందినవి ఉంటాయనడానికి మచ్చుకి కొన్ని: విశ్వనాథ - వరలక్ష్మీ త్రిశతి, ఆంధ్రప్రశస్తి, దువ్వూరి రామిరెడ్డి - భగ్న హృదయం, నాయని సుబ్బారావు - మాతృ గీతాలు.

భావకవులు కొత్త భావచిత్రాలు ప్రయోగించి భావ నవ్యత తీసుకువచ్చారు. 'రేయి కడుపున చీకటి ఛాయవోలె' అనేది ఇలాంటి భావ చిత్రమే. కొత్త పదబంధాలు సృష్టించారు. మూగకనులు - మంచుమంట - లేత గుసగుసలు - వలపుటాకలి మొదలైనవి.

భావ కవిత్వంపై ప్రతి విమర్శ ఎక్కువగా వచ్చింది. ఇది కవి సొంత గోడు అన్నారు. అస్పష్టత హద్దులు మీరిందన్నారు. ఏడుపుగొట్టు కవిత్వం అన్నారు. భావకవిత్వం 'అంధానుకరణ' తప్ప ఏమీలేదన్నారు. అక్కిరాజు ఉమాకాంతం అనే పండితుడు 'నేటికాలపు కవిత్వం' అనే పుస్తకంలో భావ కవిత్వంపై దుమ్మెత్తి పోశారు. భావ కవిత్వం 'పులుముడు కవిత్వం'గా నిరసించారు. ఇంత వ్యతిరేకత వెలువడినా ఆధునిక కవిత్వంలో భావ కవిత్వం ఒక విసూత్నరీతిగా నిలదొక్కుకుంది. 'కొత్తపాతల మేలు కలయికతో సంప్రదాయ ప్రయోగముల సముచిత మేళనముతో తెలుగునాట వెలుగులు చిమ్మినదీ భావకవిత్వము' అని సినారె ప్రకటించారు.

భావ కవిత్వంలో వెలువడిన ముఖ్యమైన కావ్యాలు

రాయప్రోలు సుబ్బారావు	తృణకంకణం, కష్టకవుల, వనమాల
దేవులపల్లి కృష్ణశాస్త్రి	కృష్ణపక్షం, ఊర్వశి, ప్రవాసం
నాయని సుబ్బారావు	సౌభద్రుని ప్రణయయాత్ర
వేదుల సత్యనారాయణశాస్త్రి	దీపావళి
నండూరి సుబ్బారావు	యెంకి పాటలు
విశ్వనాథ సత్యనారాయణ	కిన్నెరసాని పాటలు
దువ్వూరి రామిరెడ్డి	కృషీవలుడు, వనకుమారి
పింగళి, కాటూరి	సౌందరనందం
వేంకట పార్వతీశ కవులు	ఏకాంత సేవ

జాతీయోద్యమంలో వెలువడిన గీతాలు, కవులు

★ శ్రీగాంధీ నామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం
- దామరాజు పుండరీకాక్షుడు

★ కొల్లాయిగట్టితేనేమి? మాగాంధి
కోమటై పుట్టితేనేమి?
- బసవరాజు అప్పారావు

★ గాంధీలాలీ మోహన గాంధీ లాలీ
కరుణాసాంద్రా మోహన దాస
- కనుపర్తి వరలక్ష్మమ్మ

★ దండాలు దండాలు భారతమాత
అవి అందుకొని దీవించు భారతమాత
- వడ్డాది సీతారామాంజనేయ కవి

★ జండాయెత్తర - జాతికి ముక్తిర
నిండగు శక్తిర - నిల్పర కీర్తి
- గురజాడ రాఘవశర్మ

★ పరదేశీయులు తొలగండి
ఈ భారతదేశం మా దేశం
- వానమామలై వరదాచార్యులు

భావకవులు - వారి ముఖ్యమైన కవిత్వ పంక్తులు

దేవులపల్లి కృష్ణశాస్త్రి	'ఆకులో ఆకునై పూవులో పూవునై .....' 'నవ్వి పోదురుగాక నాకేటిసిగ్గు' 'నా మరణశయ్య పరచుకున్నాను నేనె'
నాయని సుబ్బారావు	'దైవతమ నీవు, నీదు ప్రత్యక్షమునకు గడియలెంచుచునుండు భక్తుడను నేను'
నండూరి సుబ్బారావు	'గుండె గొంతుకలోన కొట్లాడుతాదిరా కూకుండనీదు కూసింతసేపు'
బసవరాజు అప్పారావు	'కోకిలా కోకిలా కూయబోకే గుండెలు బద్దలు చేయబోకే'
రాయప్రోలు సుబ్బారావు	'సరససాంగత్య సుఖవికాసములకన్న దుస్సహ వియోగభారమెమధురము సకియ'
గురజాడ అప్పారావు	'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును ప్రేమనిలిపిన ప్రేమనిలుచును'
విశ్వనాథ సత్యనారాయణ	'జలజలా పొంగింది - బిలబిలా నడిచింది పరికిణీతొక్కాడు పదియేళ్ళకన్నెలా'

అభ్యాస ప్రశ్నలు

1. 'చెరసాలల్ పృథు చంద్రశాలలె యగున్ ....' అన్నదెవరు?
1) రాయప్రోలు 2) గరిమెళ్ల
3) చిలకమర్తి 4) మంగిపూడిశర్మ

2. 'మహాత్ముడి ఆస్థాన కవి'గా పేరుగాంచింది ఎవరు?
1) తుమ్మల సీతారామమూర్తి 2) జాషువా
3) విశ్వనాథ 4) గురజాడ

3. 'జాతీయ గేయ కవిసార్వభౌమ' ఎవరు?
1) వానమామలై వరదాచార్యులు 2) విశ్వనాథ
3) దాశరథి 4) గరిమెళ్ల

4. 'నిరుద్ధ భారతం' రాసిన కవి ఎవరు?
1) కుసుమ ధర్మన్న 2) బోయి భీమన్న
3) మంగిపూడి వేంకటశర్మ 4) ఎవరూకాదు

5. కనుపర్తి వరలక్ష్మమ్మ రచన ఏది?
1) గాంధీ దండకం 2) గాంధీ నాటకం
3) బాపూజీ కావ్యం 4) నేతాజీ కావ్యం

6. 'కొల్లాయి గట్టితేనేమి మా గాంధి కోమటై పుట్టితేనేమి' రాసినవారు?
1) బసవరాజు అప్పారావు
2) తుమ్మల సీతారామమూర్తి
3) జాషువా 4) కాళోజీ

7. 'జాతీయోద్యమ కవిత్వం'పై సిద్ధాంత గ్రంథం రాసిందెవరు?
1) రాయప్రోలు 2) మద్దూరి సుబ్బారెడ్డి
3) జి.ఎన్. రెడ్డి 4) ఆరుద్ర

8. 'శ్రీగాంధీ నామం మరువాం మరువాం ...' అనే గేయం రచించిన కవి ఎవరు?
1) దామరాజు పుండరీకాక్షుడు 2) గరిమెళ్ల
3) వడ్డాది సీతారామాంజనేయ కవి 4) ఎవరూకాదు

9. భావ కవులపై ఏ ఆంగ్ల కవి ప్రభావం ఉంది?
1) షెల్లీ 2) కీట్స్ 3) వర్డ్స్‌వర్త్ 4) అందరూ

10. 'అమలిన శృంగార సిద్ధాంతం' అంటే ఏమిటి?
1) దాంపత్య శృంగారం
2) దేవతా స్త్రీల శృంగారం
3) స్నేహపూర్వకమైన శృంగారం
4) వియోగ శృంగారం

11. భావ కవిత్వపు కాలం ఏది?
1) 1910–25 2) 1910–35
3) 1915–35 4) 1900–25

12. 'శశికళ' ఎవరి ఊహా ప్రేయసి?
1) దేవులపల్లి 2) విశ్వనాథ
3) అడవి బాపిరాజు 4) ఎవరూకాదు

13. 'గుండె గొంతుకలోన కొట్లాడుతాదిరా ....' అన్న కవి రాసిన కావ్యం ఏది?
1) యెంకి పాటలు 2) నీలగిరి పాటలు
3) కిన్నెరసాని పాటలు
4) బసవరాజు గేయ సంపుటి

14. భావ కవిత్వంలోని కొత్త పదబంధానికి ఉదాహరణ ఏది?
1) మంచుమంట 2) వలపుటాకలి
3) మూగకనులు 4) అన్నీ


15. 'నేటి కాలపు కవిత్వం' రచించిందెవరు?
1) సి.ఆర్. రెడ్డి 2) దేవులపల్లి
3) అక్కిరాజు 4) రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

సమాధానాలు

1–3	4–3	7–2	10–3	13–1
2–1	5–1	8–1	11–2	14–4
3–4	6–1	9–4	12–3	15–3.

మీ అభిప్రాయాలు పంపాల్సిన మెయిల్ ఐడీ...
pratibhadesk@eenadu.net

హాయ్! బుజ్జీ!!




ఈ పిట్టలు అపార్టుమెంట్లు కట్టేస్తాయ్!

పక్షి గూళ్లు చూసే ఉంటారు... ఏ చూరుకో చెట్లపైనో కనిపిస్తుంటాయి... గుప్పెడంతే ఉంటాయా గూళ్లు... అయితే ఓ రకమైన పక్షులు న్నాయి... అవి ఏకంగా అపార్టుమెంట్లు కట్టేస్తాయి... ఆశ్చర్యపరిచే ఆ సంగతులేంటో చదివేయండి మరి!

ఓ పది, ఇరవై కుటుంబాలతో మనం అపార్టుమెంట్లు కట్టుకుంటాం. ఒకే పెద్ద భవంతిలో వాటాల్ని పంచుకుంటాం. గదులు కేటాయించుకుంటాం. ఇలా చేసేది మనమేనా? సోషల్ వీవర్ పక్షులూ చేసేస్తాయి. అయితే అపార్టుమెంట్లు అనగానే మనలా ఇసుక, సిమెంటుతో కట్టినవి కాదండోయ్... చెట్లపైన చిన్న చిన్న కర్రలు... గడ్డి ఆకులు వంటి వాటితోనే. అయితే మిగతా పక్షి గూళ్లలా ఇవి చిన్నగా ఉండవు. భారీ పరిమాణంలో ఉంటాయి. లోపల అంతరాలు అంతరాలుగా వందల సంఖ్యలో గదులుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బోలెడు పక్షులు కలిసి ఒకే పెద్ద పక్షి గూడుని నిర్మించుకుంటాయన్నమాట.

■ ఈ గూళ్ల కొలతలు వింటే అయ్య బాబోయ్ అనేస్తారు. ఇరవై అడుగుల వెడల్పు, పది అడుగుల ఎత్తు, వెయ్యి కిలోల బరువుతో ఉంటాయివి. 100 జంటల పక్షులుండేంత పరిమాణం ఈ గూళ్లది. ఈ గూళ్లతో ఏకంగా చెట్టే పడిపోగలదు.



■ ఆశ్చర్య పరిచే సంగతి తెలుసా? చెట్లు, విద్యుత్తు స్తంభాలపై కట్టుకునే ఈ గూళ్లు గాలి వానకో, వాన నీటికో అంత సులువుగా కూలిపోవట. ఏకంగా ఏళ్లకు ఏళ్లు దృఢంగా స్థిరంగా ఉంటాయట.

■ అద్భుతమైన ఈ గూటికి... ఎండిపోయిన చెట్ల కొమ్మలే సిమెంట్. మనం ఇంటిని అలంకరించుకున్నట్టే ఈ పక్షులు కూడా గూటి లోపల నిర్మాణానికి గడ్డి, దూది, ఆకులు, ఈకల్ని వాడేస్తాయి. పది అంగుళాల పొడవుతో మూడు అంగుళాల వెడల్పుతో ద్వారమూ నిర్మించుకుంటాయి. వీటికి ఎంత తెలివంటే... పాముల్లాంటి శత్రువులు లోపలికి చొరబడకుండా ముళ్లతో ప్రత్యేకఏర్పాటు చేసుకుంటాయి.


■ అంతేకాదూ... ఈ గూళ్ల మధ్యలో హాలు లాంటి విశాలమైన గది దాని చుట్టూ బోలెడు బుల్లి గదులు ఉంటాయి. వీటి ప్రత్యేకతలు ఏమిటంటే... గూడు మధ్యలోని పెద్ద గది ఉష్ణాన్ని నిలిపి ఉంచుకుంటూ రాత్రుల్లో వెచ్చగా ఉంటుంది. పగటిపూట బయట వాతవరణ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుందిగా... దానికి తగ్గట్టు చుట్టూ ఉన్న గదులు పగటిపూట 7 నుంచి 8 డిగ్రీల సెల్సియస్‌తో చల్లగా ఉంటాయట. ఏమైనా భలే ఏర్పాటులెండి.

■ వీటిని చూస్తే మనకే కాదూ ఇతర జాతి పక్షులకూ ముచ్చటేస్తుందేమో... అందుకే పిగ్మీ ఫాల్కన్, రెడ్ హెడ్డెడ్ ఫించెస్ వంటి పక్షులూ ఈ గూళ్లను ఎంచక్కా వాడేసుకుంటాయి.

■ ఐదున్నర అంగుళాల పొడవు, 26 నుంచి 32 గ్రాముల బరువుండే ఈ పక్షుల చిరునామా ఆఫ్రికా.

■ ఈ చిట్టిపొట్టి పిట్టలు... కీటకాలు, పురుగులు, విత్తనాల్లాంటివి తిని పొట్ట నింపుకొంటాయి. ఇవి నీటిని తాగవట. పదార్థాల నుంచే అవసరమయ్యే తేమను గ్రహిస్తాయట.

అంకెల్లో బొమ్మ



ఆణిముత్యం

మౌనంగా ఉండటం అంటే మనం ఇంకో మార్గం ద్వారా మన వాదనను కొనసాగించడమే


– చేగువేరా

నేర్చుకుందాం!

Lose = కోల్పోవడం

Loose = వదులుగా ఉన్న

దారేది?




బావిలో నీరు వేడిగా ఉంటుందేం?

ఎందుకు ఏమిటి ఎలా

ప్రశ్న: **బావిలో నీరు చలికాలంలో వేడిగా, వేసవి కాలంలో చల్లగా ఎందుకుంటుంది?**

జవాబు: నీటికున్న ఉష్ణ వాహకత్వ లక్షణం వల్ల ఈ తేడా వస్తుంది. నీటి ఉష్ణవాహకత చాలా తక్కువ. వేసవికాలంలో పగలు చాలా వేడిగా ఉంటుంది. అయినా ఆ వేడిని నీరు గ్రహించి వేడిగా కావడానికి సాయంత్రం వరకూ పడుతుంది. అందుకే వేసవి కాలంలో పగలు బావి నీళ్లు చల్లగా ఉంటాయి. రాత్రి పూట కాస్త వెచ్చగా అనిపిస్తాయి. అదే విధంగా చలికాలంలో పగటిపూట ఉన్న చల్లదనాన్ని మెల్లగా పొందుతాయి. కానీ పగటి పూట ఉన్న ఎంతోకొంత ఎండ వల్ల వచ్చిన వేడిని గ్రహించడానికి సాయంత్రం వరకూ పడుతుంది. ఆ వేడి మరుసటి రోజు పగటి పూట వరకూ అంతో ఇంతో ఉంటుంది. చలికాలంలో రాత్రి పూట బయట ఉన్న చలి వల్ల, బావి నీటికున్న అధమ ఉష్ణ వాహకత్వం వల్ల తన దగ్గరున్న వేడిని అంత తొందరగా కోల్పోదు. అందువల్ల పగటి పూట బావి నీరు కొంత వెచ్చగా అనిపిస్తుంది. ఒక్కోసారి మనం బయట ఉన్న లోహ పదార్థాల్ని తాకి, బావిలో నీటిని తాకితే అవి వెచ్చగా, లోహపు వస్తువులు చల్లగా అనిపిస్తాయి. అందుకు కారణం లోహపు వస్తువు వేడిగా ఉందని, బావిలో నీరు చల్లగా ఉందని భావించకూడదు. మన శరీరం నుంచి వేడిని స్వీకరించేతత్వం లోహపు వస్తువులకు ఎక్కువగా ఉండటం వల్ల అవి చల్లగా, నీటికి ఆ తత్వం తక్కువగా ఉండటం వల్ల సాధారణంగా అలా అనిపిస్తాయి.



– **ప్రొ॥ ఎ.రామచంద్రయ్య,** నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

సబ్జెక్ట్ ల్యాబ్ ఇంగ్లిష్

ఆంగ్ల అచ్చులైన **a, e, i, o, u** లను బొమ్మల ఆధారంగా సరైన చోట నింపితే పదాలు అర్థవంతమవుతాయి.

1) _ pple
2) s _ t
3) d _ g
4) r _ d
5) b _ nch
6) v _ n
7) b _ s
8) p _ g

జర్మనీ రాజధాని?

స్కూల్ సవాల్

1. మన దేశంలో 'సిటీ ఆఫ్ సెవెన్ ఐలాండ్స్' అని ఏ నగరాన్ని పిలుస్తారు?
2. 'రాజతరంగిణి' రాసిందెవరు?
3. జర్మనీ రాజధాని ఏది?



దారిశెట్టి సాన్వి, కృష్ణవేణి పాఠశాల, సిర్పూర్ కాగజ్‌నగర్

జవాబులు: సబ్జెక్ట్ ల్యాబ్ - ఇంగ్లిష్: 1-A 2-I 3-O 4-E 5-E 6-A 7-U 8-I

స్కూల్ సవాల్: 1. ముంబయి 2. కల్హణుడు 3. బెర్లిన్

గిరిజనుల సంక్షేమానికి కృషి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: గిరిజన తండాలలో నివసిస్తున్న గిరిజన సంక్షేమానికి తగిన కృషి చేయాల్సిన అవసరం ఉందని అఖిల భారత బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్రనాయక్ పేర్కొన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆయన జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సునీతా రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి గిరిజన తండాలలోని సమస్యలను వివరించారు. జిల్లాలో నేటికీ పలు తండాలకు రహదారి సౌకర్యం లేదని, విద్య, వైద్య సౌకర్యాలు లేవని అన్నారు. వీటన్నింటిపై తగిన దృష్టిని సారించి తండాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



జడ్పీ అధ్యక్షురాలిని కలసిన రవీంద్రనాయక్

3న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

వికారాబాద్ టౌన్: జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఈనెల 3న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంత్ రావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో యువజనోత్సవ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కల్గిన యువతీ, యువకులు రెండు ఫోటోలు, పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువపత్రాలు బూర్గుపల్లిలోని జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఉన్న యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. జానపద నృత్యాలు, జానపద గీతాలు, ఏకపాత్రాభినయం, ఆంగ్లం, హిందీ, వృక్తత్వ పోటీలు, ఆంగ్లం, హిందీ, సంప్రదాయ గాత్రం (హిందుస్థానీ, కర్ణాటక) సంప్రదాయ నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, మణిపురి, ఒడిశా, కథక్) క్లాసికల్ (పిల్లనగ్రోవి, వీణ, సితార) మృదంగం, తబలా, హార్మోనియం (లైట్), గిటారు వాయిద్య ప్రయోగాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. అర్హత కలిగిన యువతీ యువకులు అందరూ పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 9849909071 సంప్రదించాలి తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: మంగళవారం గోంగూర దానంచేస్తే ఆర్థిక విషయాలు అనుకూలిస్తాయా?, వాస్తుదోషాలు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: అమ్మో! ఒకటో తారీఖు (శ్రీకాంత్, రాశి).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'బెండకాయ కొబ్బరి వేపుడు', మీ చేతి వంట 'మలై కోఫ్తా కర్రీ', 'ఆలూకార్న్ సూప్', జస్ట్ ఎ మినిట్ 'గుమ్మడి పరోటా' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ: (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(విధి–2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జబర్దస్త్ (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్) 06-30: తేనె మనసులు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: సై సై సయ్యారే: దర్శకేంద్రుడి పాటల సందడి..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 పిట్టగోడ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం రిపీట్
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి 07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 అల్లరే అల్లరి
08:30 సరదాగా కాసేపు
09:00 పటాస్
09:30 మహాతల్లి
09:45 ఫ్రూట్స్
10:00 నా షో నా ఇష్టం రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస: సాఫ్ట్ స్కిల్స్ ఎవరికి ఎంత అవసరం - పార్ట్ 1 (ఉ. 6:00, రా. 11:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
★ అమృతం: వండర్ వెజిటబుల్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: మహిళల్లో గుండె జబ్బులా? ఎలా అడ్డుకుందాం? (ఉ. 9:30)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: స్త్రీలలో మూత్రనాళ సమస్యలా? ఎటువంటి జాగ్రత్తలు అవసరం? (మ. 2:00, రా. 7:00)
★ అంతరంగం: కొత్త సంవత్సరంలో తీసుకునే సంకల్పాలను..మీరు మధ్యలోనే వదిలేయకుండా ఉండాలంటే ఏంచేయాలి? (ఉ. 10:00)
★ అంతరంగం: మీ పిల్లల ఫోన్లను చెక్ చేయాలనుకుంటున్నారా? మరి వారిని ఎలా మ్యానేజ్ చేయాలి? (మ. 2:30, రా. 9:30)
★ ఆరోగ్యమస్తు: 1. నూతన సంవత్సరం - ఆరోగ్య సంకల్పాలు, 2. పూర్ణాయుషుకు పోషకాహారం, 3. లాలాజలం..ఓ దివ్యౌషధం (ఉ. 10:30)
★ ఆరోగ్యమస్తు: 1. రక్తంలో పూడికలు ఏర్పడడానికి కారణాలు, 2. మనం హోటళ్ళో తినగా మిగిలిన ఆహారాన్ని ప్యాక్ చేసి ఇంటికి తీసుకొని వెళ్లడం మంచిదేనా?, 3. శరీరంలో వాపుల వెనుక దాగున్న వాస్తవాలు (మ. 3:00, రా. 9:00)
★ డా. ఈటీవీ: గుండె ఆరోగ్యం (ఉ. 11:00)
★ డా. ఈటీవీ: చర్మ సంరక్షణ (ఉ. 11:15)
★ డా. ఈటీవీ: మధుమేహం (మ. 3:30, రా. 7:30)
★ డా. ఈటీవీ: ENT (మ. 3:45, రా. 7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగపెళ్ళి (శోభన్‌బాబు, విజయశాంతి) 10-00: మార్నింగ్ షో: బాలమిత్రుల కథ (మాస్టర్‌దేవానంద్, మాస్టర్ సురేంద్ర) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ఘటోత్కచుడు (ఆలీ, రోజా) సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో : హృదయం (మురళి, హీరా) రాత్రి: 7-00: ఫస్ట్‌షో: బాగ్దాద్ గజదొంగ (ఎన్టీఆర్, జయలలిత) 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల చాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - చోలే ఆలూ ఔర్ గోబీ కా టిక్కీ ఛాట్, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - కర్డ్ అండ్ ఓట్స్ సెరియల్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - స్పినాచ్ ఎగ్ పొంగణాలు, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - మటన్ దమ్ బిర్యానీ & కార్జం వేపుడు, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - అవలక్కి ఎర్రియప్ప, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - అరవి కబాబ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - గుమ్మడికాయ హల్వా, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - గుమ్మడికాయ గింజలతో సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పారిస్ క్యూసైన్) - పార్సీ ఫ్రైడ్ చికెన్ & చికెన్ కర్రీ విత్ పొటాటోస్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఇండియన్ కేక్, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ - స్టఫ్‌డ్ ఎగ్ విత్ చికెన్ & చాక్లెట్ ఎక్లెర్స్, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - పెరుగు మర్చీ మటన్ బిర్యానీ & కాజు మటన్ ఫ్రై, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - ఉల్లి పునుగులు, మ.2.45, రా.10.30: ఎట్‌హోమ్ - మ్యాంగో స్క్వాష్ & క్లాసీ రంచ్ డ్రెస్సింగ్, మ.3.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థ యాత్ర: శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయం, మధురవాడ, విశాఖపట్నం, 5-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థ యాత్ర: శ్రీ గోదారంగనాథస్వామి ఆలయం, ఎదులాబాద్, మేడ్చల్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ఈటీవీ న్యూస్, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 02-01-2018

SVBC ఉదయం: 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (అష్టాదళ పాదపద్మారాధన సేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - ఆంజనేయ స్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారికల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ +ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:**12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 భగవద్గీత - బాలవికాసం, 03-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ (రిపీట్), **సాయంత్రం:** 04-00 శ్రీదేవీ కటాక్షం, 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు - భక్తిచైతన్యం, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - గుహ్య అగస్త్యేశ్వరస్వామి ఆలయం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాలకృష్ణమాచార్యులు.

భక్తి TV ఉదయం: 06-00 శ్రీ లలితాసహస్రం, 06-30 హనుమాన్ చాలీసా, 07-00 అర్చన, 07-30 శ్రీ కనకధారస్తోత్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 ఆరుద్ర దర్శనం (లైవ్), 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీ కనకధారస్తోత్రం, 05-30 హనుమాన్ చాలీసా, 06-00 శ్రీ లలితాసహస్రం, **రాత్రి:** 07-00 భక్తి విశేషాలు, 07-30 అమృత కలశం 08-00 ఆరుద్ర దర్శన మహోత్సవం 08-30 శ్రీమద్భగవద్గీత, 09-00 దుర్గాసప్తశతి 09-30 మహా భారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తి విశేషాలు, 11-00 గోదామృతం.

జీ తెలుగు ఉదయం: 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: చందమామ, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 రారండోయ్ వేడుకచేద్దాం, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 కళ్యాణ వైభోగం రిపీట్, **సాయంత్రం:** 04-00 డ్రామా జూనియర్స్ రిపీట్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్).

మా ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: పోకిరి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లి కూతురు, 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: లీడర్, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 స్టార్ మా పరివార్ అవార్డ్స్.

జెమిని ఉదయం: 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: నేనున్నాను, 11-30 నాగిని 2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 షిరిడి సాయి, 03-00 సినిమా: శంభో శివ శంభో, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 జూలకటక, 10-30 సినిమా: మిస్టర్ ఫర్‌ఫెక్ట్.

HBO ఉదయం: 06-00 స్నిచ్, 07-54 రాక్ ఆఫ్ ఏజెస్, 09-53 టీనేజ్ మ్యుటెంట్ నింజా టర్‌టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-52 300: రైజ్ ఆఫ్ యాన్ అంపైర్, **మధ్యాహ్నం:** 01-24 బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్: డాన్ ఆఫ్ జస్టిస్.

రబీ మొక్కజొన్నలో చీడల నివారణ

రబీలో సాగుచేసిన మొక్కజొన్నలో పలు చీడపీడలు ఆశించి నష్టపరుస్తున్నాయి. వాటిని సకాలంలో గుర్తించి తగునివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త ఎస్.నర్సింహారెడ్డి సూచించారు. మొక్కజొన్నకు పూతకు ముందు నుంచి గింజ పోసుకునే వరకు నీటి తడులు అందించాలి. మొక్కజొన్నలో రసం పీల్చే పురుగులు, కాండం తొలిచే పురుగులు ఎక్కువగా ఆశిస్తున్నాయి.



కాండం తొలిచే చారల పురుగు: ఇవి లార్వా దశలో ఆకుముడతలో దాగిఉండి ఆకులోని పచ్చని భాగాన్ని తిని నష్టం కల్గిస్తాయి. తర్వాత దశలో కాండం అడుగుభాగాన చేరి కాండాన్ని తొలిచి రంధ్రం చేస్తాయి.

గులాబీ రంగు పురుగు: ఇది ఆకుల పత్రహరితాన్ని గోకి తినడం వల్ల ఆకులు పలుచగా మారతాయి. పెరిగిన లార్వా కాండానికి రంధ్రం చేసి మొవ్వు భాగాన్ని తిని మొక్క చనిపోయేటట్లు చేస్తుంది. ఈ పురుగుల నివారణకు పురుగాశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ., లీటరు నీటికి కలిపి మొక్క మొలిచిన 15 రోజుల్లోపు పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే 30 రోజుల తర్వాత ఆకు సుడుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను వేయాలి.

రసం పీల్చే పురుగు: 25 నుంచి 30 రోజుల పైబడిన పైరుపై పేనుబంక నల్లి ఆశించి దిగుబడులను తగ్గిస్తాయి. వీటి తల్లిపురుగులు మొక్క ఎదిగే భాగాల నుంచి, ఆకుల నుంచి రసం పీల్చడం వలన ఆకులు లేత పసుపు రంగుకు మారి మొక్కలు గిడసబారిపోతాయి. ఇవి విసర్జించే తేనెలాంటి జిగురు పదార్థంపై నల్లని బూజు ఏర్పడి కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలుగుతుంది. వీటి నివారణకు ఎసిఫేట్ 1.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ, లీటరు నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

మొవ్వుతొలిచే పురుగు: ఈ పురుగుల వల్ల 90 శాతం పంటకు నష్టం కలిగే ప్రమాదం ఉంది. ఈగ ఆకు అడుగు భాగాలలో తెల్లని, సన్నటి పొడవాటి గుడ్లను విడివిడిగా పెడుతుంది. ఈ గుడ్లు 3 రోజుల్లో పొదిగి పిల్లపురుగు మొవ్వు భాగం నుంచి మొక్కలోకి ప్రవేశించి తినడం వలన మొవ్వు ఎండిపోతుంది. ఎండిన మొవ్వులను పీకితే తేలికగా వస్తాయి. నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను మొవ్వు తొలిచే ఈగ నివారణకు చాళ్లలో విత్తేటపుడు ఒక మీటరు కు 2 గ్రాముల చొప్పున వాడాలి.

కంకినల్లి: పూతదశ నుంచి గింజలు గట్టిపడే దశవరకు కంకినల్లి బెడద ఎక్కువగా ఉంటుంది. పసుపు పచ్చ రంగులో ఉన్న వందల కొద్ది నల్లులు కంకిని ఆశించి రసం పీల్చి నష్టపరుస్తాయి. గింజలు కట్టక 10 -80 శాతం నష్టం జరుగుతుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉన్నపుడు నల్లిసోకిన కంకులపై బూజు తెగులు ఎక్కువగా రావడానికి అవకాశం ఉంది. దీని నివారణకు కార్బరిల్ 5 శాతం పొడి మందును ఎకరానికి 8 కిలోల చొప్పున కంకులపై చల్లాలి.

– న్యూస్‌టుడే, గరిడేపల్లి

చెరకులో చెదపురుగులు

ముచ్చెలు నాటినప్పటి నుంచి చెరకులో అయిదారు కణుపులు ఏర్పడే వరకు చెదపురుగుల తాకిడి ఉంటుంది. సారవంతమైన నల్లరేగడి భూముల్లో ఈ చెదపురుగులు తక్కువగా ఉన్నప్పటికీ, తేలికపాటి ఇసుక, గరప నేలల్లో ఎక్కువగా ఉంటాయి. నీటి వనరులు తక్కువగ ఉండే భూముల్లో ఇవి ఎక్కువగా ఆశిస్తాయి. ఇవి భూమిలోని ముచ్చెలను కూడా తొలుస్తాయి. కనుక మొలకభాగం (కన్నులు) కూడా చెదపురుగులకు ఆహారమైపోతుంది. దాంతో సాళ్ళలో ఖాళీలు ఏర్పడుతాయి. ఈ విషయాన్ని గమనించడానికి నెల రోజులు పడుతుంది. అప్పటికీ చెదపురుగులే దీనికి కారణమని గ్రహించలేం. విత్తన లోపమని భ్రమపడతాం లేదా విత్తనం నేలలో ఎక్కువ లోతుకు పోయి ఉంటుందని భావిస్తాం. ముచ్చెలు నాటిన వారం రోజుల్లోపు మొలకలు కనిపించక పోతే, అక్కడ మట్టిని పెకిలించి చూడాలి. ముచ్చెలు డొల్లలుగా ఏర్పడి చెదపురుగులు కనిపిస్తాయి. అలా ఖాళీలు ఏర్పడిన చోట మళ్ళీ ముచ్చెలు నాటినప్పటికి ఉపయోగం ఉండదు. కాబట్టి చెరకు సాగుకు ముందుగానే చెదపురుగుల నివారణ చర్యలు చేపట్టాలి.

నివారణ చర్యలు: 5 శాతం ఆల్‌డ్రిన్, 5 శాతం క్లోరిన్‌గానీ, 5 శాతం హెప్టాక్లోర్ గానీ, ఎకరాకు 10 కిలోలు చొప్పున విత్తడానికి ముందే సాళ్ళలో చల్లడం ద్వారా చెదలను సమర్ధవంతంగా అరికట్టవచ్చు. సహజంగా 6-8 కణుపులు ఏర్పడినపుడు చెదపురుగులు పెరుగుతున్న గడలను ఆశించి నష్టపరుస్తాయి. ఆ దశలో వెంట వెంటనే నీరు పారించడం వల్ల చెదపురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. ఆ దశలో చెరకునకు నీటి అవసరం ఎక్కువ కాబట్టి ఎక్కువ నీరందించినా నష్టం ఉండదు.

– ఎ.నవీన్‌రెడ్డి, ఈనాడు వ్యవసాయ విభాగం



పరిగిలో చిన్నారుల ఆటా, పాటా...



పరిగిలో ఇంటి ముందు వేసిన ముగ్గు



తాండూరు భద్రేశ్వర దేవాలయంలో శివలింగానికి 2018 సంవత్సరం అలంకరణ

కేరింతలు.. తుళ్లింతలు..!

ఆనందం, ఆధ్యాత్మికతల కలబోతగా నూతన సంవత్సర వేడుకలు

ఎన్నెన్నో ఆశలు.. ఎన్నెన్నో ఊసులు...వీటన్ని కలబోతగా జిల్లా వాసులను అర్ధరాత్రి కొత్త సంవత్సరం పలకరించింది. అందరి మోముపై ఆనందం నింపింది. గతమొక అనుభవంగా, భవిష్యత్తుకు పునాదిగా మార్చుకోవాలనే పాఠం నేర్పుతూ ప్రగతి పథంవైపు సాగిపోవాలని లేలేత సూర్య కిరణాలతో నిద్దుర లేపింది. కొత్త సంవత్సర వేడుకలను జిల్లా వాసులు అత్యంత ఆనందోత్సాహాల మధ్య జరిపారు. అర్ధరాత్రి, ఉదయం అనే తేడా లేకుండా కుర్రకారు హల్‌చల్ చేస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలిపితే, ఇళ్లముందు రంగు రంగుల రంగవల్లికలతో మహిళలు స్వాగతం పలికారు. ప్రజలు ఎంత ఉత్సాహం చూపారో అదే సమయంలో భక్తి భావాన్నీ చాటుకున్నారు. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన అనంతగిరి పద్మనాభుని ఆలయం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడింది. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజక వర్గాల్లోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. క్రైస్తవ సోదరులు చర్చిల్లో అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు చేశారు.

– న్యూస్‌టుడే, వికారాబాద్ పట్టణం



పెద్దేముల్‌లో చిన్నారుల సంబురాలు



దామగుండంలో భక్తుల స్నానాలు



అనంతగిరిలో బారులు తీరిన భక్తులు



తాండూరు సాయిబాబా ఆలయంలో భక్తుల మొక్కులు



కొడంగల్: పర్సాపూర్‌లో వేసిన ముగ్గు



వికారాబాద్: చర్చిలో ప్రార్థనలు



బొంరాస్‌పేటలో చిన్నారుల ఆనందోత్సాహాలు



కొడంగల్ వేంకటేశుని ఆలయానికి వచ్చిన మహిళా భక్తులు



కుల్కచర్ల: పాంబండ దేవాలయం వద్ద యువకులు, చిన్నారులు

కూరగాయల ధరలు

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలోని చిల్లర విపణిలో సోమవారం పలికిన కూరగాయల ధరలు కిలోకు రూ.లలో టమాటా రూ.10, బెండకాయలు 30, పచ్చిమిర్చి 30, వంకాయలు 20, బంగాళా దుంపలు 20, క్యారెట్ 80, బీరకాయలు 60, ఉల్లిగడ్డలు 40, దొండకాయలు 40, బీన్స్ 60, క్యాప్సికం 40, క్యాబేజీ 40, క్యాలీఫ్లవర్ 40, చిక్కుడు రూ.40.

ప్రత్యేక బోధనతో.. ఉత్తీర్ణతలో పరుగు

★ ఉపాధ్యాయుల కృషి ★ అయిదేళ్లుగా ఉత్తమ ఫలితాలు



బషీరాబాద్ బాలికల ఉన్నత పాఠశాల

బషీరాబాద్, న్యూస్‌టుడే:

త్వరలో పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది శతశాతం ఫలితాల సాధన కోసం బోధన పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం, ఒక్కో ఉపాధ్యాయురాలు ఎనిమిది మంది విద్యార్థులను దత్తత తీసుకొని బోధిస్తూ వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. బషీరాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో గత అయిదేళ్లుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో బోధన చేస్తూ మండలంలో ప్రత్యేకత చాటుకుంటున్నారు. పాఠశాలలో 6 నుంచి 10 వరకు మొత్తం 376 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఫైముదాబేగంతోపాటు 11 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. వీరితోపాటు నలుగురు విద్యాబోధకులు ఉన్నారు. తెలుగు మాధ్యమంలో 62 మంది, ఆంగ్ల మాధ్యమంలో 18 మంది, మొత్తం 80 మంది విద్యార్థులు పదోతరగతి చదువుకుంటున్నారు. మార్చి నెలలో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని సబ్జెక్టులలో పాఠ్యాంశాల బోధన పూర్తయిందని, పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణిస్తున్నారు. పోటీ పరీక్షల్లో బాలికలు పాల్గొని బహుమతులు సాధిస్తున్నారు.

అయిదేళ్లుగా బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత ఇలా..

సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణత	శాతం
2012-13	65	53	81
2013-14	66	61	92
2014-15	59	51	86
2015-16	60	55	91
2016-17	61	49	80

విద్యార్థుల దత్తత

ఒక్కో ఉపాధ్యాయురాలు పదోతరగతిలోని ఎనిమిది మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. ప్రతి రోజు వారు ఆయా సబ్జెక్టులను విద్యార్థులతో చదివించడం, రాయించడం చేస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులు ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులను చరవాణి ద్వారా సంప్రదించి విద్యార్థుల చదువుపై ఆరా తీస్తున్నారు. పాఠ్యాంశాన్ని చదివించి మరుసటి రోజు వారితో పరీక్ష రాయిస్తూ చదువులో రాణించేలా చూస్తున్నారు. విద్యార్థులు అనుత్తీర్ణత సాధిస్తే వారిని దత్తత తీసుకున్న ఉపాధ్యాయులదే బాధ్యత అని విద్యాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

ఆంగ్ల మాధ్యమంలో శతశాతం

2013-14, 2015-16 విద్యాసంవత్సరాల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులు 90 శాతంపైగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 18 మంది విద్యార్థులు ఉన్నారనీ, అందరూ ఉత్తీర్ణత సాధిస్తారని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిపై శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఆత్మవిశ్వాసం పెరిగింది

– అంబిక, పదోతరగతి, బాలికల ఉన్నత పాఠశాల బషీరాబాద్

డిసెంబరు మొదటి వారంలోనే అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాల బోధన పూర్తయింది. మరోసారి అన్ని పాఠాలను బోధిస్తున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. బోధన పూర్తయిన వెంటనే పరీక్షలు రాయడం వల్ల వార్షిక పరీక్షలను బాగా రాయగలమన్న ఆత్మవిశ్వాసం పెరిగింది. మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణ సాధిస్తాం.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం

– ఫైముదాబేగం, ప్రధానోపాధ్యాయురాలు, బషీరాబాద్

ఈ ఏడాది పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నాం. దత్తత ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చదువులో వెనకబడ్డ విద్యార్థులను, చురుకుగా ఉన్న విద్యార్థుల బృందంలో చేర్చి చదివిస్తున్నాం. ప్రణాళిక ప్రకారం బోధన చేస్తున్నాం. ప్రతి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: తాండూరు పురపాలక సంఘంలోని యశోదా నగర్ కాలనీ ప్రాంతంలో మూడు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. అధికారులు స్పందించి మా కాలనీలో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోలి.

– విద్యాసాగర్‌రెడ్డి, యశోదానగర్ తాండూరు

సమాధానం: తాండూరు పురపాలక సంఘంలోని యశోదానగర్ కాలనీలో తాగునీరు సరఫరా కాకపోవడానికి గల కారణాలను పరిశీలించి, సమస్య పరిష్కరిస్తాం.

–భోగేశ్వర్లు, పురపాలక సంఘం కమిషనరు తాండూరు

సమస్య: తాండూరు పట్టణంలోని భవానీనగర్ ప్రాంతంలో రాత్రి వేళ వీధుల్లో విద్యుత్ దీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మా ప్రాంతంలోని వీధి దీపాలు రాత్రిపూట పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– నారాయణ, తాండూరు

సమాధానం: భవానీనగర్ ప్రాంతంలోని వీధుల్లో రాత్రి వేళ విద్యుత్ దీపాలు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, ఏఈ పురపాలక సంఘం తాండూరు

శుభాకాంక్షలు తెలిపిన పీఆర్‌టీయూ నాయకులు



పుష్పగుచ్ఛం స్వీకరిస్తున్న జడ్పీ అధ్యక్షురాలు సునిత

తాండూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తాండూరు మండల శాఖ పీఆర్‌టీయూ నాయకులు సోమవారం జడ్పీ అధ్యక్షురాలు సునీతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని అధ్యక్షురాలి నివాసానికి చేరుకున్న నాయకులు పుష్పగుచ్ఛాలను అందజేశారు. నూతన సంవత్సరంలో విద్యారంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, కార్యదర్శి మొగులప్ప, జిల్లా ఉపాధ్యక్షులు నాగప్ప, రాష్ట్ర అసోసియేట్ ఉపాధ్యక్షులు కిష్టప్ప, మోహన్, శశిధర్ ఉన్నారు.

జిన్నారంలో పడకేసిన పారిశుద్ధ్యం

కోట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జిన్నారం గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు నిలువ ఉండి దోమలు వస్తున్నాయి. అంతేకాకుండా మురుగులోనే తాగు నీటి పైపులైను ఉండడంతో మంచి నీరు కలుషితమవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. మిషన్ భగీరథ పనుల నిమిత్తం కాలువలు తవ్వి వదిలేయడంతో మురుగు అంతా ఒక్క చోట మడుగు కడుతోంది. దుర్వాసన, దోమల సమస్యతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యన మురుగు ఇలా..

అనాథ ఆశ్రమంలో పండ్ల పంపిణీ

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలోని అమ్మ ఆదరణ అనాథాశ్రమంలో సంరక్షణ పొందుతున్న బాలికలకు సీఐటీయూ, టీ-మాస్ ప్రతినిధులు సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, టీ-మాస్ ప్రతినిధి జైపాల్, అమ్మ ఆదరణ ఆశ్రమ నిర్వాహకురాలు సునీత పాల్గొన్నారు.

బషీరాబాద్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా బషీరాబాద్ ఎస్సై లక్ష్మయ్య అనాథలు, నిరుపేదలకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. బషీరాబాద్‌లోని ప్రధాన వీధులు, ప్రయాణ ప్రాంగణాల వద్ద ఉన్న వారికి సిబ్బందితో కలిసి వివిధ రకాల పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు తదితరులు ఉన్నారు.



అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్సై లక్ష్మయ్య

ముగ్గురిపై కేసు నమోదు

బషీరాబాద్, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. గస్తీలో భాగంగా బషీరాబాద్ ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం రాత్రి తనిఖీలు చేసినట్లు చెప్పారు. బషీరాబాద్ మండలానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై సూచించారు. ప్రతి రోజు తనిఖీలు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి ఒక్కరు సేవా భావం అలవర్చుకోవాలి

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఇతరులకు తోచినంత సాయం అందించాలని వికారాబాద్ డీఎస్పీ శిరీష అన్నారు. సోమవారం ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా వికారాబాద్ మండలం ధన్నారం శివారులోని యజ్ఞ ఫౌండేషన్ అనాథ ఆశ్రమం పిల్లలకు బూట్లు, కొంపల్లి వృద్ధాశ్రమంలో రేషన్ సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావించాలన్నారు. సేవా భావంతో ఎంత క్లిష్టమైన పనినైనా సులభంగా చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వికారాబాద్, ధారూర్, మోమిన్‌పేట, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐలు మాగంటి వెంకటరామయ్య, ఉపేందర్, శ్రీనివాస్, నిర్మల, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

శాంత్‌మహల్	:	హలో
చంద్ర	:	ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయ్)
లక్ష్మిమహల్	:	ఒక్క క్షణం
శ్రీనివాస	:	2 కంట్రీస్

– న్యూస్‌టుడే, తాండూరు పట్టణం

తాండూరు

కాలనీ కబుర్లు

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నప్పటికీ కొందరు వాహనాదారులు నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్నారు. దీంతో కూడళ్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పోలీసు అధికారులు స్పందించి వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఉల్లాసంగా నూతన సంవత్సర వేడుకలు

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: తాండూరులో నూతన సంవత్సర వేడుకలను పట్టణ వాసులు ఉత్సాహంగా చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటలు దాటిన మరుక్షణం కేరింతలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆనందించారు. మహిళలు సరదాగా ఆటలు ఆడారు. నూతన సంవత్సర వేడుకలతో పట్టణం మారుమోగింది. సోమవారం ఉదయం కుటుంబ సమేతంగా పట్టణ ప్రజలు ఆలయాలకు వెళ్లారు. కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే జరగాలని వేడుకున్నారు. భక్తులతో పట్టణంలోని సాయిబాబా దేవాలయం, భద్రేశ్వర దేవాలయం, కాళికాదేవి, ఆదర్శ తులసీనగర్‌లోని వరసిద్ధి వినాయక దేవాలయం, పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయం, శ్రీవేంకటేశ్వర, రామలింగేశ్వర దేవాలయం, రసూల్‌పూర హనుమాన్ దేవాలయం భక్తులతో సందడిగా మారింది. దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. యువకులు తమ వాహనాలకు పూజలు చేయించారు. సాయిబాబా ఆలయంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. భద్రేశ్వర దేవాలయంలోని శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేశారు. పోలీసుల ఆంక్షల మధ్య నూతన సంవత్సర వేడుకలు పట్టణంలో ప్రశాంతంగా జరిగాయి.


తాండూరు సాయిబాబా ఆలయంలో భక్తులు


మహిళల సందడి

తాండూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తాండూరు మండలంలోని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు యువతీయువకులు, మహిళలు, చిన్నపిల్లలు సంతోషంగా గడిపారు. సోమవారం ఉదయం ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో అంతారంతండా భూకైలాస్, కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం, కరణ్‌కోట వేంకటేశ్వరాలయం, చంద్రగిరి శ్రీదేవి భూదేవిసమేత శ్రీనివాస, అయ్యప్ప ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

ఆలయాల్లో భక్తుల సందడి


రంగవల్లికలు వేస్తున్న మహిళలు

బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్ మండలంలో నూతన సంవత్సర సంబరాలను చిన్నా పెద్ద తేడాలేకుండా ఘనంగా నిర్వహించుకున్నారు. డిసెంబరు 31న అర్ధరాత్రి వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఓ ఆసుపత్రి సిబ్బంది కేక్ కోశారు. ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పెద్దేముల్, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరం వేడుకలను ప్రజలు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు అర్ధరాత్రి వరకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. చిన్నారులు, మహిళలు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం ఉదయం మండలంలోని అంబురామేశ్వర, శంభులింగేశ్వర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు


రంగులు అద్దుతున్న చిన్నారి


బషీరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలు

వైభవంగా అయ్యప్పస్వామి పూజ

తాండూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తాండూరు మండలం ఓగీపూర్ సరిహద్దులోని వికాట్ కలుబుర్గి సిమెంటు పరిశ్రమలో సోమవారం అయ్యప్పస్వామి పూజలు వైభవంగా నిర్వహించారు. పరిశ్రమ పరిసరాల్లో కొత్తగా నిర్మించిన సంఘమేశ్వర ఆలయంలో వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామి చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అయ్యప్పకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. 18 సార్లు మాలధారణ చేసిన గురుస్వామి కర్పూరదీపాలు వెలిగించగా భక్తులు అయ్యప్పనామస్మరణ చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బషీరాబాద్, న్యూస్‌టుడే: అయ్యప్ప భక్తులకు ఎంపీపీ కరుణ, సహకార సంఘం సభ్యుడు అజయ్‌ప్రసాద్ దంపతులు అన్నదానం చేశారు. బషీరాబాద్ హనుమాన్ దేవాలయంలో సోమవారం మధ్యాహ్నం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు 41 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో దీక్ష చేయడం ద్వారా మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు శ్రావణ్‌కుమార్, వివిధ పార్టీ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న అజయ్‌ప్రసాద్

మొదలైన వంతెన నిర్మాణ పనులు


కొనసాగుతున్న బుద్దారం వంతెన పనులు

పెద్దేముల్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు బుద్దారం వాగుపై వంతెన నిర్మాణ పనులు మొదలయ్యాయి. రెండు రోజులుగా పనులు జరుగుతున్నాయి. ఏడాది క్రితమే పనులు మొదలు కావాల్సి ఉండగా గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యమయ్యాయి. మంత్రి మహేందర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పాత వంతెనను తొలగించే పనులు జరుగుతున్నాయి. బుద్దారం, గాజీపూర్ రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. అయితే గాజీపూర్ పనులు కూడ పెండింగ్‌లోనే ఉన్నాయి.

నీటి సమస్య పరిష్కారం

మైల్వార్, బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్ మండలం మైల్వార్‌లో మల్లికార్జున దేవాలయం వద్ద నీటి సమస్య పరిష్కారమైంది. ఎంపీపీ కరుణ ప్రత్యేక చొరవతో ఆలయం వద్ద బోరు వేయించారు. సోమవారం సర్పంచి బోరుమోటరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు ప్రజలకు నీటి ఇబ్బందులు తీరాయన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


బోరుమోటరు ప్రారంభిస్తున్న సర్పంచి చంద్రశేఖర్

వినూత్నంగా నూతన సంవత్సరం వేడుకలు

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారిణి అన్నపూర్ణ ఆదేశాల మేరకు తాండూరులో పోలీసులు నూతన సంవత్సర వేడుకలను సోమవారం వినూత్నంగా నిర్వహించారు. అనాథ ఆశ్రమంలో పిల్లలు, జిల్లా ఆసుపత్రిలో రోగులతో మధ్య పోలీసులు నూతన సంవత్సర సంబురాలు జరిపారు. ఆదివారం అర్ధరాత్రి వరకు విధులు నిర్వహించిన పోలీసులు డీఎస్పీ రామచంద్రుడుతో కలిసి పట్టణంలోని అనాథ ఆశ్రమానికి వెళ్లి పిల్లలతో కలిసి కేక్ కోసి, కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. పిల్లలతో కొద్దిసేపు ఆనందంగా గడిపారు. వారికి మిఠాయిలు, చాక్లెట్లు, ఆట వస్తువులు అందజేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి కొత్త సంవత్సరం వేడుకలు జరిపారు. అనాథ పిల్లలు, రోగులకు మీకు మేమున్నామనే భరోసానిస్తూ పోలీసులు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ సీఐ సైదిరెడ్డి, కరణ్‌కోట్ ఎస్సై రేణుకారెడ్డి, తాండూరు ఎస్సై సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ఆసుపత్రిలో రోగులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న పోలీసులు

బావిలో దూకి విద్యార్థిని ఆత్మహత్య

తాండూరు గ్రామీణం: బావిలో దూకి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. తాండూరు మండలం ఉద్దండాపూర్ పంచాయతీ పరిధి మైసమ్మతండాకు చెందిన శ్రీలక్ష్మి(17) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్లాలంటూ కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఇంట్లోంచి వెళ్లిపోయింది. విద్యార్థిని ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులను కుటుంబీకులు ఆరాతీస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోని బావిలో మృతదేహాన్ని పరిశీలించిన గ్రామస్థులు శ్రీలక్ష్మిగా గుర్తించారు. బావి వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పంచానామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో తలెత్తిన ఉద్రిక్తత నేపథ్యంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎం.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామ దేవత జాతరను కొందరు రాజకీయం చేశారన్నారు. తెరాస నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయిస్తామని భయపెడుతున్నారని ఆరోపించారు. పోలీసు ఉన్నతాధికారులు గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వికారాబాద్

తారురోడ్డు వేయించరూ..!

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే: కోస్గి-తుంకిమెట్ల ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తొగాపూర్ గ్రామస్థులు అన్నారు. పరిసర గ్రామాలకు ఈ దారిలో ప్రయాణిస్తే సమయం, దూరం ఆదా అవుతుందన్నారు. మట్టిరోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారిందని, ఈ దారి గుండానే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు.

జిన్నారంలో పడకేసిన పారిశుద్ధ్యం



ఇళ్ల మధ్యన మురుగు ఇలా..

కోట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జిన్నారం గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు నిలువ ఉండి దోమలు వస్తున్నాయి. అంతేకాకుండా మురుగులోనే తాగు నీటి పైపులైను ఉండడంతో మంచి నీరు కలుషితమవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. మిషన్ భగీరథ పనుల నిమిత్తం కాలువలు తవ్వి వదిలేయడంతో మురుగు అంతా ఒక్క చోట మడుగు కడుతోంది. దుర్వాసన, దోమల సమస్యతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.కోటితో పనులు.. తొలగనున్న ఇక్కట్లు

పట్టణంలో కొత్త విద్యుత్తు స్తంభాలు, తీగల ఏర్పాటు

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్:

వికారాబాద్ పట్టణ ప్రజలకు త్వరలో అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారం కానుంది. పురపాలక సంఘం పరిధిలోని కాలనీల్లో కోతలు లేని నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఐడీపీఎస్ పథకం కింద రూ. కోటి కేటాయించారు. ఆయా నిధులతో పట్టణంలోని కాలనీల్లో శిథిలావస్థలో ఉన్న స్తంభాలు, తీగలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

వికారాబాద్ పట్టణంలో మొత్తం 28 వార్డులు, 55 వేల జనాభా ఉంది. విద్యా కేంద్రంగా వికారాబాద్‌కు పేరుంది. ఇక్కడ జిల్లాలో అత్యధిక మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు, ఇతర సమయాల్లో విద్యుత్తు కోతలతో వారు సతమతమవుతున్నారు. వేళాపాళాలేని కోతలతో మహిళలు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్త స్తంభాలు, విద్యుత్తు తీగలు ఏర్పాటు చేస్తున్నారు. త్రీ ఫై తీగలను లాగుతున్నారు. దీంతో అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారం కానుంది. రెండు నెలలుగా ఈ పనులు కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల పాటు కొనసాగనున్నాయి.

వేసవి నుంచి ఇబ్బందులు ఉండవు

– సంతోష్, ఏఈ, ట్రాన్స్‌కో

పట్టణ ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిధులు ఇచ్చింది. ఆయా నిధులతో చేపట్టిన పనులు వచ్చే వేసవిలో పూర్తవుతాయి. విద్యుత్తు సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి.

తొలగనున్న సమస్యలు

పట్టణంలో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలంలోనూ విద్యుత్తు తీగలు తెగిపోకుండా కొత్త తీగలు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పాత అతుకుల విద్యుత్తు తీగలను తొలగిస్తున్నారు. ప్రస్తుతం శివరాంనగర్, ఆలంపల్లి, సాయిబాబానగర్, గంగారం, ఇంద్రానగర్, రామయ్యగూడ కాలనీల్లో ఈ పనులు సాగుతున్నాయి.



విద్యుత్తు పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రంగారెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న రంగారెడ్డి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నవాబుపేట మండలం మైతాబ్‌ఖాన్‌గూడ గ్రామానికి చెందిన లింగంపల్లి లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఉదయం కాంగ్రెస్ నాయకురాలు, మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంలో రైతులు, యువత ప్రభుత్వ వ్యతిరేకతన వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రామ స్థాయి నుంచి పార్టీని సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెపు మల్లారెడ్డి, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు భరత్ రెడ్డి, ప్రభాకర్, మండల, జిల్లా నాయకులు బాల్‌రెడ్డి, ఎక్‌బాల్, కొండల్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

కంది పంటకు నిప్పు..రైతుకు నష్టం



కాలిపోయిన పంట

మర్పల్లి, న్యూస్‌టుడే: కంది పంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిన ఘటన కోటమర్పల్లి శివారులో సోమవారం చోటుచేసుకుంది. కోట మర్పల్లి గ్రామానికి చెందిన కోటపల్లి రవీందర్ గ్రామ సమీపంలోని మూడు ఎకరాల్లో కంది పంటతో పాటు అంతర పంటగా మొక్కజొన్న సాగు చేశారు. మక్క నూర్పిళ్లు పూర్తి అయ్యాయి. కంది పంట చేతికి వచ్చింది. రెండు, మూడు రోజుల్లో కంది నూర్పిళ్లు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు కంది పంటకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం చుట్టు పక్కల రైతులు రవీందర్‌రెడ్డికి తెలియచేశారు. దీంతో ఆయన పొలానికి చేరుకుని విలపించారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలని కోరారు.

పైపులైనుకు లీకులు.. తాగునీరు కలుషితం



నీటి సరఫరా పైపు



దుస్తుల శుభ్రం ఇక్కడే

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ పురపాలక సంఘం ఆలంపల్లి గ్రామ ప్రధాన రోడ్డు మార్గంలో తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ లీకవుతోంది. దీంతో నీరు అక్కడ మడుగు కడుతోంది. ఈ పైపు లైన్ వద్దనే ప్రతి రోజు మంచి నీటిని వదిలే ఆన్ ఆఫ్ ఉంది. ప్రతి రోజు మంచి నీటిని వదిలి, గంట తర్వాత ఆపివేస్తారు. తాగు నీరు వదిలినపుడు లీకేజీ నీరు తిరిగి పైపుల్లోకి చేరి ఇళ్లకు సరఫరా అవుతోంది. ఈ నీటినే ప్రజలు తాగాల్సి వస్తోంది. అంతేకాకుండా మురుగు కుంట పక్కనే కొందరు దుస్తులు శుభ్రం చేస్తున్నారు. ఈ నీరు సైతం తాగు నీటి పైపుల్లో చేరుతోంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకాశ దీపాల ఏర్పాటుకు కృషి



గ్రామస్థులతో ఎంపీ విశ్వేశ్వరరెడ్డి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: గంగ్యాడ నుంచి మూసీ వంతెన మీదుగా గొల్లగూడ రైల్వేస్టేషన్ వరకు ఆకాశదీపాల ఏర్పాటుకు కృషి చేస్తానని చేవెళ్ల లోకసభ సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గంగ్యాడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇటీవల మూసీ నదిలో పడవ ప్రయాణం సందర్భంగా గ్రామస్థులు ఆకాశ దీపాల ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి ఆయనకు వివరించారు. ఇందులో భాగంగా సోమవారం ఎంపీ గ్రామంలో పర్యటించారు. దీపాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. నాయకులు మహేశ్వర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అంజయ్య, రామకృష్ణ, మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బందయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

వికారాబాద్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ప్రముఖులను స్థానిక నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి పి.సబితారెడ్డికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎం.డి.హఫీజ్, జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు పి.సునీతారెడ్డికి వికారాబాద్ మండలం కొటాలగూడ సర్పంచి రాఘవన్‌నాయక్‌లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



సబితారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎం.డి.హఫీజ్

పిల్లల్లో సేవాభావం అలవడాలి

పరిగి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సేవాభావం అలవడాలని పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరెడ్డి, పాఠశాల డైరెక్టర్ రాములు పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని ఆదరణ ఫౌండేషన్ నిర్వాహకులు మాధవరావుకు ఏడు క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల పప్పు, 300 సబ్బులు, చింతపండు, ఇతర నిత్యావసర సరకులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. క్రమశిక్షణతోనే విద్య అలవడుతుందని, మానవతా విలువలు ప్రతి ఒక్కరికీ అవసరమని సూచించారు. పసి వయసు నుంచే అలవడితే సమాజంలో మంచి పేరు కలిగిన వ్యక్తులుగా మారేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేమారెడ్డి, కొడంగల్ ప్రిన్సిపల్ మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.



సరకులు అందజేస్తున్న రాములు, శ్రీనివాస్‌రెడ్డి

ఎన్కతలలో నీటి ఎద్దడి



నిరుపయోగంగా మారిన బోరు

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్కతల గ్రామంలో తాగు నీటి బోర్లు పనిచేయక నీటి సమస్య ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో రెండు సింగిల్ ఫేజ్ బోర్లున్నాయి. ఆయా బోర్లలో నీరు అడుగంటి నిరుపయోగంగా మారాయి. చేతి పంపునకు సైతం మరమ్మతులు చేయకపోవడంతో అది వినియోగించుకునే అవకాశం లేకపోయింది. దీంతో కాలనీలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి నిరుపయోగంగా మారిన బోర్లకు ఫ్లషింగ్ చేయించాలని కోరుతున్నారు.

వికారాబాద్

వినియోగంలోకి తీసుకురండి

బోగారం, కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే: పశువుల దాహార్తి తీర్చేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన తొట్లను పట్టించుకోక పోవడంతో వృథాగా మారాయని బోగారం గ్రామస్థులు వాపోతున్నారు. తొట్లలో గడ్డి పెరగడం, చెత్తాచెదారం వేయడంతో నిరుపయోగంగా మారాయని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సరానికి స్వాగతం


కేక్ కోస్తున్న చిన్నారులు


బీటీఎస్ కాలనీలో విద్యార్థినిల నృత్యాలు


వేడుకల్లో చిన్నారులు

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరానికి యువత కేక్ కోసి ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి పలువురు యువకులు కేరింతలు కొడుతూ రహదారులపై సందడి చేశారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేయడంతో ఈసారి ఎక్కువ మంది రాత్రివేళ రహదారులపైకి రాలేదు. సోమవారం ఉదయం మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముందు ముగ్గులు వేశారు.

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన విధుల్లో యువకులు బాణాసంచా కాల్చారు. పలువురు ఇళ్లలో కేకులు కోశారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సోమవారం క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందువులు ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ మండల పరిషత్తు అభివృద్ధి అధికారి సత్తయ్య సోమవారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పీఆర్టీయూ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు విశ్వం పంతులు ఉన్నారు.


వెంకటేశ్వర్‌నగర్ కాలనీలో ముగ్గులు


ఎన్కతలలో కేక్‌ను కట్ చేస్తున్న యువకులు.


మోమిన్‌పేటలోని చర్చిలో ప్రార్థనలు


జడ్పీ అధ్యక్షురాలికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ

కోట్‌పల్లి, న్యూస్‌టుడే:

సమస్య: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో మంచి నీటి బోరు నిరుపయోగంగా ఉంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బోరుకు మరమ్మతులు చేయించాలి. – శ్రీనివాస్, గ్రామస్థుడు.

సమాధానం: త్వరలోనే బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తాం. – నిర్మల, గ్రామసర్పంచి.

సమస్య: కోట్‌పల్లి మండలం జిన్నారం గ్రామంలో బీసీ కాలనీలో మంచి నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నాం. – రాజు, గ్రామస్థుడు.

సమస్య: మంచి నీటి కుళాయిలకు త్వరలో ఆన్-ఆఫ్ బిగించి సమస్య పరిష్కరిస్తాం. – మల్లేశం, గ్రామసర్పంచి.

విరిగిన విద్యుత్తు స్తంభం

వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలంపల్లి-కొత్తగడి ప్రధాన రహదారి ప్రక్కన ఆలంపల్లి సమీపంలో విద్యుత్తు స్తంభాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విరిగిన విద్యుత్తు స్తంభాన్ని పరిశీలించిన విద్యుత్తు అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.


విరిగిన స్తంభం

ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలి

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఇతరులకు తోచినంత సాయం అందించాలని వికారాబాద్ డీఎస్పీ శిరీష అన్నారు. సోమవారం ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా వికారాబాద్ మండలం ధన్నారం శివారులోని యజ్ఞ ఫౌండేషన్ అనాథ ఆశ్రమం పిల్లలకు బూట్లు, కొంపల్లి వృద్ధాశ్రమంలో రేషన్ సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావించాలన్నారు. సేవా భావంతో ఎంత క్లిష్టమైన పనినైనా సులభంగా చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వికారాబాద్, ధారూర్, మోమిన్‌పేట, మహిళా పోలీస్ ఠాణా సీఐలు మాగంటి వెంకటరామయ్య, ఉపేందర్, శ్రీనివాస్, నిర్మల, ఎస్ఐలు రవికుమార్, ప్రణయ్, సురేష్ పాల్గొన్నారు.


బూట్లు పంపిణీ చేస్తున్న వికారాబాద్ డీఎస్పీ శిరీష

అనంతగిరిలో భక్తుల సందడి

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరిలోని అనంతపద్మనాభుడిని దర్శించుకోవడానికి సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏడాదిలో మొదటి రోజు కావడంతో హైదరాబాద్, సంగారెడ్డి, కొడంగల్, తాండూరు, పరిగి తదితర ప్రాంతాల నుంచి సుమారు 30 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అనంతగిరిలోని వ్యూపాయింట్ వద్ద స్వీయ చిత్రాలు తీసుకుంటూ సందడి చేశారు.


ఆలయానికి వస్తున్న భక్తులు

రైతు హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు

నియోజకవర్గ వ్యాప్తంగా కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: రైతులకు 24 గంటల విద్యుత్తు అందించి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని జడ్పీటీసీ ముత్తార్‌షరీఫ్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతులు ఆటో స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విపణి అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తిమ్మని శంకర్, దత్తు, నర్సిములు పాల్గొన్నారు.

బంట్వారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సోమవారం తెరాస నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏఎస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఖరీఫ్ నాటికి రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ. 4వేలు చొప్పున వేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు బల్వంత్‌రెడ్డి, డైరెక్టర్ చిరంజీవి, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటయ్య, రైతు సమన్వయ కమిటీ మండల సమన్వయకర్త పి.మల్‌రెడ్డి, నాయకులు ఖాజాపాషా, షబ్బీర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మర్పల్లి, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి కృషి చేస్తోందని మండల అధ్యక్షురాలు సుమిత్రమ్మ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి జడ్పీటీసీ శోభారాణితో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విపణిలో ధాన్యం నిల్వకు గోదాంలు, మద్దతు ధరకు మక్కలు, కందులు, పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షులు సురేష్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు రామేశ్వర్, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సంజీవరెడ్డి తెరాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధారూర్, న్యూస్‌టుడే: రైతులకు 24 గంటల విద్యుత్తు ఇవ్వడం అభినందనీయమని తెరాస మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అంబేడ్కర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెరాస మండల ప్రధాన కార్యదర్శి కావలి అంజయ్య, కో-ఆప్షన్ సభ్యుడు హఫీజ్, రైతు సంఘం కన్వీనర్ రాంరెడ్డి పాల్గొన్నారు.


ఎన్టీఆర్ చౌరస్తాలో తెరాస నాయకులు


బంట్వారంలో..



మర్పల్లిలో..


ధారూర్‌లో..